

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ

fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

12-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 71 పేజీలు: 8+16 వెల: 8.00



ఇరాన్ ధ్వంసం పూర్తి.. ఇక ప్లాన్-బి లేదు: ట్రంప్

ఆర్టెమిస్ సురక్షితంగా భూమికి రాక 5


# వికసించని 'శాంతి'



చర్చలకోసం పాక్ వచ్చిన ఇరాన్ ప్రతినిధుల బృందం

ఇస్లామాబాద్‌లో 'అమెరికా, ఇరాన్ మధ్య తొలిరోజు నాలుగు గంటలు చర్చలు

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మధ్యవర్తిత్వం

స్తంభించిన ఆస్తులు, నిధులు విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్

కొత్త షరతులతో ముందుకు సాగని చర్చలు

హార్ముజ్‌పై కొనసాగుతున్న ప్రతిష్టంభన



శనివారం ఇస్లామాబాద్ చేరుకున్న జెడివాన్స్ బృందం

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** ఇరాన్‌పై యుద్ధం ముగింపు కోసం అమెరికా, ఇరాన్ దేశాలమధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో పురోగతి కనిపించకపోయినా ఒకరి డిమాండ్ల చార్టర్ మరొకరు పంచుకున్నారు. >>2

# బడుల్లో బ్రేక్‌ఫాస్ట్

## 24,408 ప్రభుత్వ స్కూళ్లలో జూన్ 1 నుంచి అమలు

## 17.70 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం

## టిఫిన్‌తోపాటు 3 రోజులు పాలు, 3 రోజులు రాగిజావ



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 11:** తెలంగాణలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులకు ఉదయం కూడా ప్రభుత్వమే పౌష్టికాహారం అందించాలని భావించిన నేపథ్యంలో రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న పిల్లలందరికీ అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఇలా అందించడంతో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడమే కాకుండా, డ్రాపౌట్స్ కాకుండా ఉంటారని, అలాగే రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యల పాలుకాకుండా ఉంటారని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం అమలు చేయనున్న బ్రేక్‌ఫాస్ట్ పథకానికి సంబంధించి మెనును సిద్ధం చేసింది. వారంలో ఆరు రోజుల్లో ఏ రోజు ఏ టిఫిన్‌ను విద్యార్థులు అందించాలనే విషయాన్ని నిర్ణయించింది. అందులో భాగంగా ఒక రోజు ఇడ్లీ, ఒక రోజు దోశ, ఒక రోజు వడ, ఒక రోజు మైసూరు బజ్జీ, ఒక రోజు మిల్లెట్ ఇడ్లీని, ఒక రోజు పూరిని ఇవ్వాలని ఇప్పటికే మెనును సిద్ధం చేశారు. దీంతోపాటు మూడు రోజులపాటు పాలను అందించాలని, మరో రోజులపాటు రాగిజావను ఇవ్వాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా శాఖ సమీక్షలో అధికారులు చెప్పారు. అనంతరం మార్చి 20న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించి.. అందుకోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్టు కూడా ప్రభుత్వం తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించింది. >>2



# బాన్సువాడ లిఫ్ట్ పథకాలు పూర్తి

## జకోరా, చందూర్, చిన్తకుంట ఎత్తిపోతలు ప్రారంభానికి రెడీ: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఏప్రిల్11, ప్రభాతవార్త:** బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని జకోరా, చందూర్, చింతకుంట ఎత్తిపోతల పథకాలు పూర్తి అయ్యే దశకు చేరుకున్నాయని త్వరలో వీటిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. త్వరితగతిన ఈ ఎత్తిపోతల పథకాలు పూర్తి కావడం తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. >>2

# రాష్ట్రంలో 4 వేల మె.వా అణు విద్యుత్ కేంద్రాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాత వార్త:** తెలంగాణలో అణు విద్యుత్ ఉత్పత్తి దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సుముఖత కనబరుస్తోంది. ఈ నేపథ్యంలోనే అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు విషయంలో సాధ్యా >>2

# దక్షిణాదిపై కేంద్రం వివక్షను తిప్పికొడతాం

## సౌత్ ప్రాధాన్యత తగ్గించేందుకు కుట్ర

## పన్నులు మన దగ్గర వసూలు.. నిధులు ఉత్తరాదికి

## సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో డి.సిఎం భట్టి



పూలే జయంతి సభలో ప్రసంగిస్తున్న డి.సి.ఎం భట్టి

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ.. ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిభారావు పూలే జయంతి వేడుకలు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని మంత్రి వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంత రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా జ్యోతిభారావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కుల గణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని ఆమోదించకుండా కాలయాపన చేస్తోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం అడుగులు వేస్తున్నామని తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుకు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. మహాత్మ జ్యోతిబా పూలే విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చారని, >>2

# నేడే ఇంటర్ ఫలితాలు

## ఉదయం గం.11కు విడుదల చేయనున్న ప్రభుత్వ సలహాదారు కెకె

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 11:** నేడు(ఆదివారం) తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు కె కేశవ రావు ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 20 కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల1తో మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. మూల్యాంకన అనంతరం ఫలితాల విడుదలకు సంబంధించిన క్రోడీకరణ పనులను ఇంటర్ బోర్డు అధికారులు ఈ నెల 8 వరకు పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన 25 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేయనున్నారు. మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించి.. నెలాఖరులోగా ఫలితాలను సైతం విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు ప్రణాళికను రూపొందించినట్టు తెలిసింది.



శనివారం కీసర దగ్గర కారుపై ట్యాంకర్ బోల్తాపడిన దృశ్యం

# బిఎండబ్ల్యు కారుపై భారీ ట్యాంకర్ బోల్తా

## కీసర టోల్‌గేటు వద్ద ఘోర ప్రమాదం

## హైదరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శ్రీనివాసరావు మృతి

## విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా దుర్ఘటన

**విజయవాడ, ఏప్రిల్11, ప్రభాతవార్త ప్రతినిధి:** కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బీఎండబ్ల్యూ కారుపై సిమెంట్ ఫ్లయాస్ లోడుతో వెళ్తున్న భారీ ట్యాంకర్ బోల్తాపడింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు.. టోల్ కట్టేందుకు ప్లాజా వద్ద ఆగింది. వేగంగా వచ్చిన ట్యాంకర్ అదుపుతప్పి దానిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఏపీ, తెలంగాణ హైకోర్టుల సీనియర్ న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావు మృతి చెందారు.ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన టోల్‌గేట్ సిబ్బంది, >>2

# జిసిసిలకు అడ్రస్ హైదరాబాద్

## నైపుణ్యాలున్న టాలెంట్ పూల్ పుష్కలం

## అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు

## మంత్రి శ్రీధర్‌బాబుతో పికో టెక్నాలజీ ప్రతినిధుల భేటీ

## రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డితో భేటీ అయిన పికో సంస్థప్రతినిధులు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల(జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టేలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అందుబాటులో ఉండే అద్దెలు ప్రముఖ కంపెనీలని ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థప్రతినిధులు శనివారం నాడు సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఫైనాన్సియల్ మార్కెట్‌కు సంబంధించిన సేవలు అందించే పికో టెక్నాలజీ సంస్థ పికో టెక్నాలజీ ఇండియా అనే అనుబంధ కంపెనీ ద్వారా ఇక్కడ జిసిసి ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ సంసర్భంగా శ్రీధర్ బాబు వారికి ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతుల గురించి వివరించారు. రానున్న 5-10 సంవత్సరాలు, తర్వాత 20 సంవత్సరాల అవసరాలకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బెంగళూరు, ముంబాయి నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని చెప్పారు. ముంబాయిలో అది 52% మాత్రమేనని తెలిపారు. బెంగళూరు, ముంబాయిమెట్రో నగరాల్లో ట్రాఫిక్,వాయుకాలుష్యం సమస్యలుగా మారినందున ఐటిసంస్థలు, జిసిసిలు హైదరాబాద్ కు తరలి వస్తున్నాయని తెలిపారు. కాగా ఇప్పుడున్న నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలో మీటర్ల వెలుపల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయిని వివరించారు. రింగ్ రోడ్ల పక్కన రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని పెద్ద నగరాలను తలదన్నేలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హయత్‌నగర్ ఎల్బీనగర్‌ల మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మిస్తున్నాట్టు వివరించారు. కింది రోడ్డు స్థానిక ట్రాఫిక్ అవసరాలకు వినియోగిస్తామని పైన ఉండే రెండు అండు అంతస్థుల రోడ్లునగరం నుంచి వెలుపలకు,లోపలకి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకిస్తామని చెప్పారు. నాగపూర్ తర్వాత డబుల్ డెక్కరో రోడ్లు నిర్మిస్తున్న నగరం ఇదేనని అన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పికో టెక్నాలజి వ్యవస్థాపక సిఇఒ జారోడ్ యుస్టర్, పికో ఇండియా సిఇఒ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



# ఉన్న బియ్యం చాలవు.. కొత్తవి రావు!

## బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు

**పలు చోట్ల టోకెన్ సిస్టం పెట్టడంతో ఆందోళన**

**రేషన్ షాపుల వద్ద మండు టెండల్లో పెద్ద క్యూలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** రేషన్ బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు తీవ్రమయ్యాయి. పంపిణీ ఆలస్యం కావడం, సర్వర్‌స్లో, బియ్యం అయిపోవడం రకరకాల కారణాలతో రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యంగా సాగుతోంది. హైదరాబాద్‌లో పలు చోట్ల చౌకధరల దుకాణాల వద్ద కార్డుదారుల రద్దీ నెలకొంది. 3 నెలల బియ్యానికి బయోమెట్రిక్ థంబ్ మూడుసార్లు తీసుకోవాల్సి వస్తుండటంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. దీనికి సర్వర్ స్లో ఉండన్న సాంకేతిక కారణాలు తోడయ్యాయి. దీంతో షాపుల వద్ద లబ్ధిదారులు గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని చోట్ల టోకెన్ సిస్టమ్ పెట్టడంతో మిగతా వారు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఆలస్యం జరిగినా ఈనెల30 వరకు కాకుండా గడువు >>2



డిఎస్ సోమిరెడ్డి (ఫైల్)

# ఎక్సైజ్ కమిషనర్ తిట్ల దండకం

## ఆత్మాభిమానంతో డిప్యూటీ కమిషనర్ రాజీనామా

## కుప్పకూలి ఆసుపత్రిపాలైన అధికారి

## పెన్‌డౌన్‌కు సమాయత్తమైన అబ్కారీశాఖ అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్11,ప్రభాతవార్త:** తెలంగాణ ఎక్సైజ్ కమీషనర్, నిజామాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తెలంగాణ రాష్ట్రంను కుదిపివేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కమీషనర్ తిట్లదండకంతో ఆత్మాభిమానం చంపుకోలేక కుప్పకూలి పోయిన డిప్యూటీ సూపరిటెండెంట్ ఆసుపత్రిపాలైనాడు. ఆత్మాభిమానంతో ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్ వేధింపులను తట్టుకోలేక డిఎస్ సోమిరెడ్డి రాజీనామాచేశారు. నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ కమీషనర్ హరి కిరణ్ తమను వేధిస్తున్నారని, >>2

## ప్రఖ్యాత గాయని
# ఆశాభోంస్లేకు తీవ్ర అస్వస్థత



**ముంబయి, ఏప్రిల్ 11:** భారత సినీ సంగీత ప్రపంచంలో తన గాత్రంతో దశాబ్దాల పాటు వెలుగు వెలిగిన లెజెండరీ సింగర్ ఆశా భోస్లే (92) శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు గుండెపోటు రావడంతో వెంటనే ముంబైలోని ప్రముఖ బ్రీచ్ క్యాండీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ అత్యవసర వైద్య విభాగం (ఐసియు)లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం ఆశా భోస్లే ప్రముఖ వైద్యుడు ప్రతి సంధానీ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆశా భోస్లే కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారు. ఈ వార్త తెలియడంతో ఆమె త్వరగా కోలుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులు, సినీ ప్రముఖులు ప్రార్థిస్తున్నారు. దివంగత గాయని లతా మంగేష్కర్ సోదరిగా సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఆశా భోస్లే, తనదైన శైలితో సొంత ముద్ర వేసుకున్నారు. 1950వ దశకంలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆమె, వేల సంఖ్యలో పాటలు పాడారు. 1952లో సంగ్దిల్ చిత్రంతో గుర్తింపు పొందిన ఆమె, ఆ తర్వాత పరిణీత, బూట్ పాలిష్‌వంటి సినిమాలతో అగ్ర దర్శకుల దృష్టిని ఆకర్షించారు. మహమ్మద్ రఫీతో కలిసి ఆమె పాడిన మాంగ్ కే సాథ్ తుమ్హారా," సాథీ హాత్ బధానా", ఉడేన్ జబ్ జబ్ జుల్ఫైన్ తేరీ" వంటి పాటలు నేటికీ ఎవర్‌గ్రీన్ హిట్స్. ఆర్.డి. బర్మన్ సంగీత దర్శకత్వంలో ఆశా భోస్లే పాడిన పాటలు ఒక ట్రెండ్ సెట్ చేశాయి. ఆజా ఆజా," పియా తూ అబ్ తో ఆజా," యే మేరా దిల్" వంటి డ్యాన్స్ నంబర్లతో ఆమె అప్పట్లోనే సంచలనం సృష్టించారు. ఆశా భోస్లే కేవలం కమర్షియల్ పాటలకే పరిమితం కాలేదు. గజల్స్ పాడి జాతీయ అవార్డులను సైతం అందుకున్నారు.

90వ దశకంలో రంగీలా చిత్రంతో కుర్రకారును ఉర్రూతలూగించిన ఆమె, ఇటీవలే 91 ఏళ్ల వయసులో దుబాయ్ కచేరీలో తౌబా తౌబా" వంటి ట్రెండింగ్ సాంగ్స్ పాడి జెన్ జీ మనసులు కూడా గెలుచుకున్నారు. సంగీత సామ్రాజ్ఞిగా కీర్తి పొందిన ఆశా భోస్లే మళ్లీ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఆస్పత్రి నుంచి బయటికి రావాలని ఆమె అభిమానులందరూ కోరుకుంటున్నారు.

## బాన్సువాడ లిఫ్ట్ పథకాలు పూర్తి

>> 106.04 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకాలతో నిజామాబాద్ జిల్లాలోని వర్ని, చందూర్, మోస్రా మండలాల పరిధిలోని 7,975 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని ఆయన తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు వేగవంతం చేసినట్లు ఆయన చెప్పారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుండి జకోరా ,చందూర్, చింతకుంట ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి పంపిణీ ఉంటుందని ఆయన వివరించారు. ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన పంప్ హౌస్ లకు 2.93 మేఘావాట్ల విద్యుత్ వినియోగం ఉంటుందని, తద్వారా నీటి పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకాలతో ఇప్పటికే ఉన్న ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు అదనంగా కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందించడం చెరువులు కుంటలు నింపి భూగర్భ జలాలను పెంపొందించాలి అన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు.

ఇప్పటికే ఈ ఎత్తిపోతల పథకాలను ట్రయిల్ రన్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ పథకాలు ప్రారంభోత్సవం అయితే ధాన్యం దిగుబడి విశేష రీతిలో పెరగడంతో పాటు, పంటల భద్రత ఇనుమడింప చేస్తుందన్నారురైతుల అభ్యున్నతికి సాగునీటి విస్తరణకు కాంగ్రెస్ పార్టీ అంకిత భావంతో పనిచేస్తుందని త్వరలోనే ఈ పథకాలు ప్రారంభించి రైతులకు అంకితం చేస్తామని తెలిపారు.

## రాష్ట్రంలో 4 వేల మె.వా అణు విద్యుత్ కేంద్రాలు

>> సాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలియవచ్చింది. తదుపరి అధికారుల నుండి వచ్చిన అభిప్రాయాలు, సూచనలను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారవర్గాల ద్వారా వెల్లడైంది. రాష్ట్రంలో ప్రధానంగా అణు ఇంధన ఉత్పత్తికి కావాల్సిన వనరులు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, అందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున 4 రూపాయలు వరకూ ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ 2.15 రూపాయలకు లభిస్తోంది. ఇక రాత్రి వేళలల్లో ఎక్స్ఛేంజలో విద్యుత్ సేకరిస్తే యూనిట్‌కు దాదాపు 9 రూపాయల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాలపై సర్కార్ దృష్టిసారించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## రాష్ట్రంలో ఎంపిటిసి, జెడ్పిటిసి
# ఎన్నికలు ఇంకెప్పుడు?
### జనాభా లెక్కల తర్వాతే ముహూర్తమా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్11:** తెలంగాణలో సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల తర్వాత ఎంటనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని ఆశించిన అభ్యర్థులకు నిరాశ మిగిలేలా ఉంది. రాష్ట్రంలో ఇప్పట్లో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని విశ్వసనీయంగా తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసింది. ఆయా ఎన్నికల్లో పార్టీ ఆశించిన దానికంటే మెరుగైన ఫలితాలను సాధించడంతో అదే ఊపులో ఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా ముగించేయాలని తొలుత భావించింది. క్షేత్ర స్థాయిలో నాయకులు కూడా అభ్యర్థుల ఎంపికను సిద్దం చేసుకున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఎంపీటీసీ. జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు దేశ వ్యాప్త జనాభా లెక్కల షెడ్యూల్ ప్రధాన అడ్డంకిగా మారే అవకాశం ఉంది. మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి విడత జనాభా లెక్కల ప్రక్రియ జరగనుంది. 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన ప్రారంభం కానుంది. ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు నిర్వహించాలనుకుంటే జనగణన ప్రారంభం కావడానికి ముందే పూర్తి చేయాలి. లేని పక్షంలో సిబ్బంది కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జనగనణన ప్రక్రియ ముగిసిన తర్వాతే ఈ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఈమేరకు ప్రస్తుతానికిమాత్రం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగే పరిస్థితులు కనిపించడం లేదు.

# బ్రేక్‌ఫాస్ట్

>> దీంతో రాష్ట్రంలోని 24,214 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతో పాటు 194 మోడల్ స్కూల్స్‌లోని విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో యుడైస్ ప్రకారం 17,70,265 మంది ఉండగా.. 194 మోడల్ స్కూల్స్‌లో 1,08,745 మంది విద్యార్థులున్నారు.

మొత్తంగా 24,408 స్కూల్స్‌లో 17,70,265 మంది విద్యార్థు లకు బ్రేక్‌ఫాస్ట్‌ను అందించనున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో బ్రేక్‌పాస్ట్ పథకాన్ని అమలు చేయడం కోసం టెండర్లను పిలవాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ వారం రోజుల్లో ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టెండర్లను దాఖలు చేయడానికి మూడు వారాల సమయం ఇచ్చి.. మే మూడో వారంలో టెండర్లను ఫైనలేజ్ చేయాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. మే నెలాఖరు నాటికి టెండర్లను ఫైనలైజ్ చేసి విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు.

బ్రేక్‌పాస్ట్‌ను మధ్యాహ్న భోజనం లాగా ఏ స్కూల్‌కి ఆ స్కూల్‌లో కాకుండా కొన్ని స్కూల్స్‌లో కలిపి ఒకదగ్గర సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి దగ్గరలో ఉన్న స్కూల్స్‌కి బ్రేక్‌పాస్ట్‌ను సరఫరా చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. వారంలోని ఆరు రోజుల్లో ఒక్కో బ్రేక్‌పాస్ట్‌ను విద్యార్థులకు ఇవ్వనున్నారు. ఒక రోజు ఇడ్లీ, ఒక రోజు దోశ, ఒక రోజు వడ, ఒక రోజు మైసూరు బజ్జీ, ఒక రోజు మిల్లెట్ ఇడ్లీని, ఒక రోజు పూరిని ఇవ్వాలని ఇప్పటికే మెనును సిద్ధం చేశారు.

## కారుపై భారీ ట్యాంకర్ బోల్తా

>> పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో అతి కష్టంగా మీద లారీని పైకి లేపారు. ప్రమాద సమయంలో కారులో శ్రీనివాసరావు ఒక్కరే ఉన్నారని, ఆయనే డ్రైవ్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. శనివారం కావడంతో రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంది. వాహనాలు ప్రస్తుతం ఒకవైపు మాత్రమే నడుస్తున్నాయి.

## వారం - వర్జ్యం

12-04-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
దశమి రా.1.13
శ్రవణ ను.3.09
వర్జ్యం : రా.7.17-రా.8.56
దు.సా.4.38-సా.5.28
శుభసమయం : ఉ.9.00-10.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** మీ మీద ఉన్న గుడ్‌విల్‌ను దెబ్బతీసే విధంగా దృష్ప్రచారం చేస్తున్న వారిని గుర్తిస్తారు. వారిపై తగుచర్యలను చేపడతారు.

**వృషభం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. కోపాన్ని అదుపులో ఉంచుకోండి.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం.

**కర్కాటకం:** మీకు దక్కిన ఒకానొక అధికార పత్రం ద్వారా పరోక్షంగా లాభపడతారు. శ్రమకు తగిన ఫలితం వుంటుంది.

**సింహం:** కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. మీ ఆలోచనలు మెరుగ్గా, చురుగ్గా వుంటాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** వ్యాపారాభివృద్ధికి కొన్ని కొత్త వ్యూహాలు అమలుచేస్తారు. సానుకూల ఫలితాలు సాధిస్తారు. వస్త్రలాభం కలదు.

**తుల :** వృత్తిలో ఓర్పు అవసరమవుతుంది. శుభకార్యాలకు సంబంధించిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** స్థిరాస్తుల వృద్ధికి కృషిచేస్తారు. కేవలం అభిష్టాన్నే కాక, కష్టాన్ని కూడా నమ్ముకోవడం వలన లాభపడతారు.

**ధనుస్సు:** వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు సానుకూల ఫలితాలనిస్తాయి. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** పుకార్లను నమ్మడంవలన కొంత ఆందోళనకు లోనుకావడం జరుగవచ్చు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం:** ప్రజా సంబంధాలు పెంచుకుంటారు. అధికారస్థానంలో ఉన్నవారికి మీకు అత్యంత సన్నిహితం అవుతారు.

**మీనం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. ముఖ్యమైన వ్యవహారంలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉన్న బియ్యం చాలవు.. కొత్తవి రావు!

>> పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాగా, 3 నెలల కాలానికి సంబంధించిన బియ్యం చౌకధరల దుకాణాల్లో నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడం ఒక కారణం కాగా మరోవైపు రేషన్ దుకాణంలో నిండుకున్న నిల్వల స్థానంలో కొత్త కోటా విడుదల చేసే అవకాశం లేకపోవడంతో దుకాణాల ముందు నో స్టాక్ బోర్డ్ పెట్టాల్సిన పరిస్థితి తతెత్తుతోందని డీలర్లు వెల్లడిస్తున్నారు. ఈ రేషన్ బియ్యం వచ్చిన వెంటనే లబ్ధిదారులు పెద్ద ఎత్తున క్యూలో ఉంటున్నారు. 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో తూకం వేసి ఇస్తుండటంతో కొద్దిసేపటికే నిల్వలు అయిపోతున్నాయి. ఇదే సమయంలో రవాణా ఇబ్బందులు కూడా ఉంటున్నాయి. నిండుకున్న బియ్యం స్థానంలో కొత్తవి తీసుకురావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న వాహనాలు, అదే హమాలీ కార్మికులతో 3 నెలల బియ్యం రవాణా చేయాల్సి వస్తోందని, దీంతో చౌకధరల దుకాణాలను వర్గీకరించి రోజుకో ప్రాంతానికి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇలా చేస్తుండటంతో ముందుగా రేషన్ బియ్యం నిల్వలు నిండుకున్న దుకాణాలకు 3 రోజులు అవుతున్నా రావడం లేదని తెలుస్తోంది. దీంతో లబ్దిదారులు ఆ రేషన్ దుకాణాల వద్దకు వచ్చి నో స్టాక్ బోర్డు చూసి వెనుదిరుగుతున్నారని సమాచారం.

చౌకధరల దుకాణాలను అద్దెకు తీసుకునే సమయంలో వారి కోటా సామర్థ్యానికి అనుగుణంగా దుకాణాలను అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వం 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో పంపిణీ చేపడుతుండటంతో రేషన్ దుకాణాలు సరిపోవడం లేదని డీలర్లు అంటున్నారు. సాధారణంగా రేషన్ బియ్యం తీసుకునేందుకు చాలా వరకు మహిళలు, వృద్ధులు చౌకదరల దుఖాణాలకు వస్తుంటారు. ఈ క్రమంలో వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని రేషన్ దుకాణాల వద్ద తప్పనిసరిగా తాగునీరు, నీడ కోసం టెంట్ తదితర కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా చాలా వరకు రేషన్ డీలర్లు సౌకర్యాల కల్పన చేయడం లేదు. చాలా చోట్ల కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవడంతో రేషన్ బియ్యం కోసం వచ్చిన లబ్దిదారుల గొంతెండుతోంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 17,170 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య కోటి మార్కును దాటి సుమారు 1.01 కోట్లకు చేరుకుంది. వీటిల్లో 99.36 లక్షల కార్డులు ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 3.25 కోట్ల మంది లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారు. ఇదిలా ఉండగా, 3 నెలల బియ్యాన్ని ఒకేసారి తీసుకునేందుకు లబ్దిదారులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున వత్తిడిని తట్టుకునేందుకు రేషన్ దుకాణం దారులు టోకెన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం టోకెన్ తీసుకుంటే సాయంత్రం లేదా మరుసటి రోజు బియ్యం అందించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఒకవైపు బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్య, కొద్దిసేపటికే బియ్యం నిల్వలు అయిపోతున్న సమస్యను తీర్చేందుకు టోకెన్ సిస్టమ్‌నే ఎంచుకున్నారు. అయితే ఈ విధానం వల్ల లబ్దిదారులందరికీ బియ్యం అందించేందుకు సమయం సరిపోదని, వచ్చే నెల 15వ తేదీ వరకైనా పొడిగించాలని రేషన్‌దుకాణాల యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎక్సైజ్ కమిషనర్ తిట్ల దండకం

>> ఆయన కారణంగా తాను ఆసుపత్రి పాలైనట్లు ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో సోమిరెడ్డి పోస్ట్ చేయడంతో తెలంగాణ ఉద్యోగుల జెఎసి కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హరికిరణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు పెన్‌డౌన్‌కు సైతం సిద్ధమైనట్లు తెలు స్తోంది. శుక్రవారం ఎక్సైజ్ కమీషనర్ కార్యాలయంలో జరిగిన సంఘటన ఆలస్యంగా బయటకు వచ్చింది. సోమిరెడ్డి కానిస్టేబుల్ ట్రాన్స్‌ఫర్ అంశంలో కమిషనర్ ఆఫీస్‌కు వెళ్లినప్పుడు నిజామా బాద్ కమీషనర్ హరికిరణ్ దూషించినట్లు సిబ్బంది చర్చించు కొంటున్నారు. సోమిరెడ్డిసోషల్ మీడియాలో తనగోడును ఇలా వివరించారు. "నన్ను దుర్భాషలాడటంతో ఆమాటలు తట్టుకోలేక తాను కిందపడిపోయాయని దీంతో తనను స్నేహితులు ఆసుపత్రి లో చేర్పించినట్లు తెలిపారు. తాను చాలా ఆవేదనకు గురైనట్లు, ఉద్యోగం కూడా చేయనని బాధపడుతూ సోషల్ మీడియాలో సోమిరెడ్డి పోస్టుచేశారు. నా మేలుకోరే ఉన్నతాధికారుల ప్రోత్సా హంతో ఇన్నాళ్ళు నెట్టుకొచ్చాను. వారికి ఎప్పటికీ రుణపడి ఉం టాను. ఇక నేను ఈ శాఖలో హరికిరణ్ వద్ద ఇమడ లేనని పూర్తిగా అర్థం అయింది. చేయని తప్పుకి వెధవ, ఇడియట్ అన్నప్పుడు నాలో సున్నిత మనస్తత్వం ఆ మాటను స్వీకరించలేకపోయింది. నేను ఒక్కటే మాట ఎదురు చెప్పాను. ఇలాంటి మాట అనొద్దు సార్ అని మాత్రమే. నేను ఎదురు చెప్పిన ఆ మాటకు కమిషనర్ ఈగో హర్ట్ అయిందనుకుంటా. ఎవరు ఎన్నడు ఎదురు చెప్పి ఉండరు కదా! 10 నిమిషాలు పైగా నన్ను దుర్భాషలాడుతూ, నిందిస్తూ నాకు సంబంధం లేనివి చదివాడు". జీవితంలో ఎన్నడు ఎదుర్కోని ఘోర అవమానం చేశాడు. అదే గదిలో నలుగురు అధికారులు సిబ్బంది ఉన్నారు. వారి ముందు ఆ విపత్కర పరిస్థితి చాలా మానసిక వ్యథకు గురి చేసింది. అయినా తట్టుకున్నాను. బయటకు వచ్చి విషయం మిత్రులకు, అధికారులకు చెప్పాను. అలాఎలా మనల్ని అంటాడని అందరికీ చెప్పాను. ప్రశ్నిద్దాం అనిచెప్పాను. కమిషనర్ అవమానించినదాని కన్నా కూడా అన్యాయాన్ని ప్రశ్నిద్దాం అన్నప్పుడు ఆలోచనలో పడ్డ అధికారుల మిత్రుల భయం, మౌనం నన్ను బాగా కలచివేసింది. అక్కడే కుప్పకూలిపోయాను. మిత్రులు హాస్పిటల్‌కు చేర్చారని తర్వాత తెలిసింది. వారికి నా కుటుంబం తరపున కృతజ్ఞతలు. ఆరేయ్, ఒరేయ్, ఇడియట్, యూస్ లెస్ ఫెలో ఇలా చాలా అవమానకరమైన పదాలతో తిట్టినా, దూషించినా ఇన్నాళ్లు నెట్టుకొస్తున్న అధికారులకు, మిత్రులకు ఇతర అధికారులకు నమస్కారం, నేను పెరిగిన వాతావరణంలో అత్యాభిమానంతో బ్రతకడమే జీవితం అని నమ్మాను. ఆకలితోనైనా చస్తాం కాని ఆత్మాభిమానం వదులుకోలేం. అన్న కాళోజీ మాటలు యాది చేసుకుంటూ చేతకాని చావలేని, చైతన్యం చచ్చిపోయిన శాఖలో 30సంవత్సరాలు పనిచేసినందుకు సిగ్గుతో తలదించుకుంటున్నాను, నా కుటుంబ సభ్యులతో చర్చించాను. ఆత్మాభిమానం కన్నా ఉద్యోగం ముఖ్యం కాదని తలచి శాఖను వీడి వెళ్లాలని భాధతో నిర్ణయించుకున్నాను. ఇన్ని సంవత్సరాలు నాతో ప్రయాణం చేసిన, నాకు సహకరించిన ఉన్నతాధికారులకు మిత్రులకు, సిబ్బందికి కృతజ్ఞతలు. ఈ పోస్టు ఎంతో మానసిక సంఘర్షణకు లోనై పెడుతున్నాను" అంటూ రాసుకొచ్చారు.

**ఆంధ్రా అధికారి తిట్ల దండకంతో తెలంగాణ ఉద్యోగులకు గుండె పోట్లు: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

ఆంధ్రా అధికారి తిట్ల దండకం తో తెలంగాణ ఉద్యోగులకు గుండె పోట్లు వస్తున్నాయనీ, అబ్కారిశాఖ డిసి సోమిరెడ్డిని అకారణంగా తిట్టిన కమీషనర్‌పై చర్యతీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ డిమాండ్ చేశారు. బిసి ఎస్‌సి, ఎస్‌టిలను కులం పేరుతో ఈ ఆంధ్రా అధికారి అధికారి దూషిస్తున్నాడనీ విమర్శించారు.

**ఇడియట్ అనే అధికారం కమీషర్‌కు ఎక్కడిది : తెలంగాణ ఉద్యోగుల జెఎసి లచ్చిరెడ్డి**

సోమిరెడ్డి చేయని తప్పుకి ఇడియట్" అంటూ ఉన్నత స్థాయిలో ఉన్న కమిషనర్ మాట్లాడే అధికారం ఎక్కడదని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ప్రశ్నించారు. కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది ఏదైనా తప్పు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకునే అధికారం ప్రతి అధికారికి ఉంటుందని గుర్తు చేశారు. కానీ, నోరు పడేసుకోని ఉద్యోగులను అవమానపరుస్తూ, భయభ్రాంతులకు గురి చేసే పద్ధతి మంచిది కాదన్నారు. తోటి అధికారి అని కూడా చూడకుండా పరుష పదజాలంతో దూషించి, అవమాన పర్చిన ఆబ్కారీ శాఖ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## దక్షిణాదిపై కేంద్రం వివక్షను తిప్పికొడతాం

>> ఆయన ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో పెడుతుందని తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం 100 రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు 200 కోట్ల రూపాయలు కేటాయించామని వివరించారు. ప్రపంచంతో పోటీపడే స్థాయిలో పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్లో పౌష్టికా ఆహారం అందించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు జూన్ 2వ తేదీ నుంచి పోషకాలతో కూడిన అల్పాహారాన్ని అమలు చేస్తామని తెలిపారు. కుల వృత్తుల భవనాలకు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నమన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిభా పూలే జయంతి రోజునే కాకుండా అనునిత్యం స్మరించుకోవాలన్నారు. రాష్ట్ర తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. మహనీయుల చరిత్ర తెలుసుకోవాలని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిభా రావు పూలే అని కీర్తించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ , బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు లేవని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు ఐక్యంగా ఉన్నారని, బీసీ ఉద్యమం బలంగా ఉందన్నారు. విహెచ్ మంత్రి అయ్యే అవకాశం ఉన్నప్పటికీ బీసీ కొట్లాట వల్లే పక్కన పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల కోసం విహెచ్ అనేక పదవి త్యాగాలు చేశారని పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, కమిటీ ఛైర్మన్ వి. హనుమంత రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రకారం రూ . 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా జరగనున్న కులగణనలలో బీసీల పేరు తీసివేయడం సరైంది కాదన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ.. ఈ నెల 16న దేశ రాజధాని డిల్లీలో ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. ధర్నాలో రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాలని కోరడం జరిగిందన్నారు. ధర్నాకు దాదాపు 16 వేల మంది మహిళలు తరలి రావాలని పిలుపునిచ్చారు. నగరంలోని నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం పక్కనే జ్యోతి రావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ వైస్ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిభా రావు పూలేకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. పూలే ఆశయాలను భావితరాలకు తెలియడానికి పాఠ్యపుస్తకాలలో ఆయన జీవిత చరిత్ర చేర్చాలని కోరారు. అదే విధంగా బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు సంజీవరెడ్డి, రాందాస్ నాయక్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రులతో రాష్ట్ర గవర్నర్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్11:** కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా లను శనివారం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఢిల్లీలో కలిశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గా శ్రివ ప్రతాప్ శుక్లా బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రులను కలిశారు. అనంతరం కేంద్రమంత్రులతో గవర్నర్ రాష్ట్ర పరిస్థితులపై చర్చించారు.



మహారాష్ట్రలోని సతారా జిల్లా సురూర్ వద్ద శనివారం జరిగిన వ్యవసాయ జానపద ఉత్సవం 'బగడ్ యాత్ర'లో అదుపు తప్పి పరుగులు తీస్తున్న ఎద్దులను నియంత్రిస్తున్న ప్రజలు




మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# వికసించని 'శాంతి'

>> తొలిరోజు నాలుగు గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరాన్ తన ప్రధాన డిమాండ్ స్తంభించిన ఆస్తులు, నిధులు విడుదలచేయాలని, హర్మూజ్ మాదేనని చెపుతూ లెబనాన్ దాడులు నిలిపివేయాలని డిమాండ్లుపెట్టింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికాఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా ముందు మరోసారి కొత్త షరతులు ముందు పెట్టింది ఇరాన్. ముఖ్యంగా నాలుగు షరతులపై రాజీ లేదని ఇరాన్ ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. కాల్పుల విరమణతో పాటు తాజా షరతులు కూడా ముఖ్యమే అని వెల్లడించింది. ఇక అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాలకు విందు ఏర్పాటు చేశారు పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్. చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని, ఆశాజనకమైన ఫలితాలు వస్తాయని పాక్‌ప్రధాని వెల్లడించారు. అయితే ఇరాన్‌పెట్టిన కొత్తషరతులతో మళ్లీ చర్చలకు బ్రేక్‌పడింది.

హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అంగీకరించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఫ్రీజ్ చేసిన ఆస్తులను విడుదల చేయాలని కోరింది. ఓవైపు చర్చలు జరుగుతున్న సమయంలో హర్మూజ్ జలసంధి దగ్గర అమెరికా నౌకలు రావడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ అభ్యంతరం తరువాత అమెరికా నౌకలు వెళ్లిపోయాయి.

ఖతార్‌తో సహా వివిధ దేశాల్లో 11 లక్షల కోట్ల ఇరాన్ నిధులను ఫ్రీజ్ చేశారు. స్తంభింపచేసిన నిధులన్నీ విడుదలచేయాలని ఇరాన్ డిమాండ్‌చేసింది. తమ డిమాండ్లపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తమ ఖాతాలను డీఫ్రీజ్ చేయాలన్నది ప్రధాన డిమాండ్ అని ఇరాన్ ప్రతినిధి బృందం చెబుతోంది. లెబనాన్‌తో సహా పశ్చిమాసియాలో కాల్పుల విరమణ అమలు చేయాలని ఇరాన్ డిమాండ్ చేసింది. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని కోరింది. అయితే ఇరాన్ డిమాండ్లకు అంగీకరించే ప్రసక్తే లేదని వైట్‌హౌస్ తేల్చిచెప్పింది. మా దగ్గర అందరికంటే ఎక్కువ ముడిచమురు, గ్యాస్ ఉందని, అన్ని దేశాల నుంచి నౌకలు తమ వైపు వస్తున్నాయని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ విఫలదేశమని మండిపడ్డారు. తొలుత ఇరాన్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్. తరువాత అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వం లోని ప్రతినిధి బృందంతో పాక్ ప్రధాని సమావేశమయ్యారు. ఇరాన్ ప్రతిపాదనలను అమెరికా ప్రతినిధి బృందానికి ఇచ్చారు షాబాజ్ షరీఫ్. తరువాత త్రైపాక్షిక చర్చలు జరిగాయి.

ఈ చర్చలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. అమెరికా ప్రతినిధి బృందానికి ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వం వహిస్తున్నారు. ఇరాన్ ప్రతినిధి బృందానికి ఆ దేశ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వం వహిస్తున్నారు. 15 పాయింట్ల అజెండాతో ముందుకొచ్చింది అమెరికా. అంతకు మించిన పాయింట్లతో ఇరాన్ చర్చలకు రెడీ అయ్యింది.

అణ్వాయుధాలు విడనాడాలి, జలసంధిని తెరవాలంటోంది అమెరికా. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తేయాలని, హర్మూజ్ జలసంధిపై సార్వభౌమాధికారం కావాలంటోంది ఇరాన్. మిడిల్ ఈస్ట్ నుంచి అమెరికా బలగాలు వెనుదిరగాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ విడనాడాలంటూ అమెరికా కండిషన్ పెట్టింది. అమెరికా హార్మూజ్ జలసంధిని తెరవాలి అంటుంటే జలసంధిపై ఇరాన్‌సార్వభౌమాధికారం తమకే ఉండాలంటున్నది. మరో రెండురోజులపాటు చర్చలు కొనసాగే అవకాశం ఉంది.

# మహిళా రిజర్వేషన్‌లో ఒబిసి వాటా ప్రకటించాలి

## లక్నోలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం

**హైదరాబాద్,ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్‌లో ఒబిసి కోటను ప్రకటించి బిసి దామాషాజనాభానిష్పత్తికి అనుకూలంగా అత్యధిక సీట్లు పొందేలా చట్టసవరణచేయాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్‌చేశారు . శనివారం లక్నోలోని ఇందిరా గాంధీ ప్రతిష్ఠాన్‌లో కాంగ్రెస్ ఒబిసి విభాగం అధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా అందులో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. తెలంగాణలో కుల గణన నిర్వహించినందుకు , బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి , అభివృద్ధికి ప్రజా పాలన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఏఐసిసి ఓబిసి సెల్ నేతలు సత్కరించారు. తెలంగాణలో వెనుకబడిన తరగతులు బడుగు బలహీన వర్గాలకు ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.సమావేశంలో తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం సామాజిక న్యాయానికి చేసిన కుల గణనపై చర్చించారు.రాజకీయ విద్య ఉద్యోగాలు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి శాసనసభ లో తీర్మానం చేశామని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్లలో ఒబిసి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ తన ఒబిసి సెల్‌ను ఉత్తరప్రదేశ్‌లో బలోపేతం, సామాజిక న్యాయంపై ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లులో ఒబిసి వాటాలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ సదస్సును జరిగింది.

# రేపటి నుంచి 18 దాకా రాష్ట్రవ్యాప్తంగా అరైవ్.. అలైవ్

**హైదరాబాద్,ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ కొత్తగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సోమవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. అన్ని సర్కారీ విభాగాల సమన్వయంతో దీనిని పక్కాగా నిర్వహించేందుకు పోలీసు శాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను డిజిపి శివధర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అరైవ్ అలైవ్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఆయా ప్రాంతాలలో వున్న నేతలు, మేధావులు, వృత్తి నిపుణులను, విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేస్తారు. రోడ్డు భద్రతను పాటించే విషయంలో, హెల్మెట్లు సీటు బెల్టుల వాడకంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తారు. దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటిగా గణాంకాలు చెబుతుండడంతో దీనిని తగ్గించేందుకు పోలీసు శాఖ నిర్ణయించి ఇందులో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని చేపట్టింది.

# రేపు దోస్త్ -2026 నోటిఫికేషన్ విడుదల

## జారీ చేయనున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2026-27 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)- 2026 నోటిఫికేషన్‌ను రేపు(సోమవారం) విడుదల చేయనున్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో 130 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతో పాటు సుమారు 850 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో 2026-27లో డిగ్రీలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఆదివారం ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సోమవారం డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించిన దోస్త్-2026 నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో 4.56 లక్షల సీట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది సుమారు 2.56 లక్షల సీట్లు భర్తీ అవుతున్నాయి.

# జాతీయ రహదారిపై ప్రమాదం

## లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

### 16 మందికి గాయాలు

**కోదాడ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** కోదాడ పట్టణ బైపాస్ జాతీయ రహదారి 65పై శనివారం తెల్లవారుజామున భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి ఏలూరు వైపు వెళ్తున్న ఇంటర్సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, లారీని వెనక నుండి బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాద ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో 16 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సు ప్రధాన ద్వారం తెరుచుకోనందున ప్రయాణికులు అత్యవసర ద్వారం నుండి బయటకు వచ్చారు. క్షతగాత్రులను వెంటనే స్థానికులు, పోలీసులు కలిసి 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా లారీని ఢీకొనడంతో ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. జరిగిన సంఘటనపై వివరాలను పరిస్థితిని సమీక్షించారు. పూర్వాపరాలను తెలుసుకున్నారు. ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన ఈ-సిగరెట్ల ముఠా.

# టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన ఇ-సిగరెట్ల ముఠా

## రూ.33.03 లక్షల ఎలక్ట్రానిక్ సిగరెట్ల జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ధూమపాన ప్రియులను మత్తులో ముంచెత్తే ఈ సిగరెట్లు (ఎలక్ట్రానిక్ సిగరెట్లు) మరోసారి భారీగా పట్టుబడ్డాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీటిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులు అరెస్టు కాగా మరో వ్యక్తి వీరి నుండి 33 లక్షల మూడు వేల రూపాయల విలువ చేసే 999 ఎలక్ట్రానిక్ సిగరెట్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాల ను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ శనివారం మీడియాకు వెల్లడించారు. నాంపల్లికి చెందిన మహమ్మద్ అసాద్ రజా అలియాస్ అర్హాన్ (30), ఉప్పర్‌పల్లికి చెందిన వినీత్ మంత్రి (33). ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్ (36)లు కొంతకాలంగా హైదరాబాద్‌లో నిషేధించబడ్డ ఎలక్ట్రానిక్ సిగరెట్లను అమ్ముతున్నారు. సిగరెట్లు తాగే అలవాటువున్న వారిలో కొందరు మత్తు కోసం వీటిని ఉపయోగిస్తుంటారు. ఢిల్లీకి చెందిన అంకిత్ అనే వ్యక్తి నుంచి ఎలక్ట్రానిక్ సిగరెట్లను వీరు కొనుగోలు చేసేవారు. తమకు బాగా తెలిసిన వారికి మాత్రమే వీటిని ముగ్గురు అ మ్ముతున్నారు. ఫోన్‌లలో ఆర్డర్లు తీసుకుని ఆనక ర్యాపిడో ద్వారా సరుకును వీరు పంపుతున్నారని తేలింది. సరుకు పంపడానికి ముందు 9700975150 ద్వారా నగదును ఫోన్ పే ద్వారా తీసుకునేవారు. నిందితులు నాంపల్లి పరిసరాలలో ఎక్కువగా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడ నిఘా వుంచగా శుక్రవారం రాత్రి పట్టుబడ్డారు. నిందితుల నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు 999 ఎలక్ట్రానిక్ సిగరెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# తమిళనాడులో కాంగ్రెస్ గెలుపునకు బహుముఖ వ్యూహం

## చెన్నైలో పార్టీ పరిశీలకులతో మంత్రి ఎన్.ఉత్తమ్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** తమిళనాడులో ఈ నెల 23న జరగనున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు బహుముఖ వ్యూహం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు అనుసరించాల్సిన విధి విధానాలను రూపొందించి ఎన్నికల బరిలో విజయం సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. తమిళనాడు,పుదుచ్చేరి రాష్ట్రలలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకుడిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియమించిన విషయం విదితమే

. ఆరుసార్లు శాసనసభ్యుడిగా లోకసభ సభ్యుడిగా ఒక మారు ఎన్నికకావడంతో పాటు పి.సి.సి అధ్యక్షుడిగా పనిచేసిన అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న ఏ.ఐ సి.సి పెద్దలు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సీనియర్ పరిశీలకుడిగా స్టార్ క్యాంపెయన్‌గా నియమిస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.తమిళనాడు రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణా రాష్ట్రం నుండి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లను స్టార్ క్యాంపేయనర్ లూగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. అందులో భాగంగా శనివారం రోజున చెన్నై కేంద్రంలో నియోజకవర్గ స్థాయి పార్టీ పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార వ్యూహం, సమన్వయం తో పాటు పార్టీ సంస్థాగత పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై తనతో పాటు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ముఖుల్ వాస్నిక్, ఖాజా మోహినోద్దీన్‌లతో కలసి సమీక్షి ంచినట్లు ఆయన తెలిపారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి అవసరమైన మార్గదర్శనం గురుంచి నియోజకవర్గ స్థాయి పరిశీలకులతో చర్చించినట్లు ఆయన తెలిపారు.

నియోజకవర్గ పార్టీ యంత్రాంగాన్ని రాష్ట్ర స్థాయి నాయ కత్వంతో సమన్వయం చేయడం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్ ఫూలే

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చైతన్యపరిచిన నేత

## కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్, బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం, మహాత్మా జ్యోతిరావు పూలె అని కేంద్ర హోంశాఖ సహాక మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలె కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆరోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారు. దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు జ్యోతిబా పూలె. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పూలెను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుంది. సతీమణి సావిత్రీబాయి పూలెతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జ్ఞా...నాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావుపూలె అన్నారు.

స్వాతంత్రంరాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు చేసిన క్రుషి చిరస్మరణీయం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలె ఆశయాలకు, స్ఫూర్తిగా భిన్నంగా పాలన కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉంది. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఏళ్ల తరబడి ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమైతున్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా లేకుండా చేస్తోంది. ఇకనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలన్నారు.

# ఎలక్ట్రానిక్స్ తయారీలో గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

## ఆ దిశగా రాష్ట్రంలో ఎకో సిస్టం అభివృద్ధి

## కోటి టివిలను ఉత్పత్తి చేసిన హైదరాబాద్ కంపెనీ రేడియంట్

## ప్రత్యేకంగా అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రం(గ్లోబల్ హబ్)గా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. కేవలం ఉత్పత్తుల అసెంబ్లింగ్ మాత్రమే పరిమితం కాకుండా, విడిభాగాల తయారీ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు అవసరమైన పూర్తిస్థాయి ఎకో సిస్టంను అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. శనివారం సచివాలయంలో కోటి(10 మిలియన్లు) టెలివిజన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న హైదరాబాద్‌కు చెందిన రేడియంట్ అప్లయన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధుల్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రేడియంట్ సంస్థ సాధించిన ఈ ఘనత తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ్త కీలక పాత్ర పోషించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆ దిశగానే గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఓవైపు ఎలక్ట్రానిక్స్ తయారీలో టాప్ గ్లోబల్ ప్లేయర్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తూనే మరోవైపు వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీపై దృష్టి సారించామన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సరళతర వాణిజ్య విధానాలతో పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెజల్యూట్ గ్రూప్ ఛైర్మన్ రమీందర్ సింగ్ సోయిన్, డైరెక్టర్ మణికందన్, లీగల్ అండ్ ఐపీఆర్ హెడ్ శుభజిత్ సాహా, అడ్మినిస్ట్రేషన్ హెడ్ నోయెల్ రాబిన్ సన్ తదితరులు పాల్గొన్నారు.




# థాయ్‌లాండ్‌లో చిక్కిన మోస్ట్‌వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ సాహిల్‌చౌహాన్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** భారత్‌లో అనేక దోపిడీలు, హత్యలకు పాల్పడి కొన్నేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్ స్టర్ సాహిల్ చౌహాన్ థాయ్‌లాండ్‌లో పట్టుబడ్డాడు. విదేశాల్లో కూడా ఇతనికి బలమైన నెట్‌వర్క్ వుందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలంగా థాయ్‌లాండ్‌లో వుంటూ అక్కడి నుంచి భారత్‌లో నేరకలాపాలు సాగిస్తున్న సాహిల్ చౌహాన్ కోసం జాతీయ దర్యాప్తు సంస్థతో పాటు ఢిల్లీ, హరి యాణా పోలీసులు గాలిస్తున్నారు. హరియాణాకు చెందిన బడా గ్యాంగ్‌స్టర్ కౌశల్ చౌదరి ముఠాలో కీలకంగా వున్న సాహిల్ చౌహాన్ వ్యవస్థీకృత నేరాలు చేయడంలో ఆరితేరాడు. ఆయుధాల అమ్మకాలు, సుఫారి హత్యలు చేయించడంలో సాహిల్ నిష్ణాతుడుగా పేరొందాడు. ఇతనిపై ఢిల్లీ, హర్యానాలో అనేక కేసులున్నాయి. కౌశల్ చౌదరి ఏడాది క్రితం అరెస్టయి హరియాణా జైల్లో వున్నాడు. కౌశల్‌చౌదరి అరెస్టయిన తరువాత సాహిల్ చౌహాన్ థాయ్‌లాండ్ పారిపోయాడు. ఇతను థాయ్‌లాండ్‌లో వున్నట్లు సమాచారం అందగానే దీనిపై విదేశాంగ శాఖకు ఎన్ఐఎతో పాటు ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల పోలీసులు వివరాలు అందించి అతన్ని థాయ్‌లాండ్ నుంచి బహిష్క రించే విధంగా చూడాలని కోరారు.

విదేశాంగ శాఖ దీనిపై థా యలాండ్ దేశానికి అభ్యర్థన చేసింది. భారత విదేశాంగ శాఖ అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్న థాయ్‌లాండ్ సర్కారు సాహిల్ చౌహాన్‌ను దేశం ను ంచి బహిష్కరించింది. దీని తరువాత సాహిల్ చౌహాన్‌ను భారత్‌కు తెచ్చేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక పోలీసు బృందం శనివారం ఉదయం థాయ్ లాండ్‌కు వెళ్లింది. అనంతరం సాహిల్ చౌహాన్‌ను అదుపులోకి తీసుకుని శనివారం రాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి తీసుకు వచ్చారు. అక్కడి నుంచి హరియాణా రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భద్రత మధ్య విచారణ నిమిత్తం రహస్య ప్రాంతానికి తరలించారు. విదేశాల్లో తలదాచుకున్న సా హిల్ చౌహాన్‌ను భారత్‌కు రప్పించడం దర్యాప్తు సంస్థల విజయంగా నిపుణులు చెబుతున్నారు.



గ్యాంగ్‌స్టర్ సాహిల్ చౌహాన్

# మహిళా రిజర్వేషన్లలో బిసి సబ్‌కోటా కోసం

# అన్ని పార్టీల నేతలను కలుస్తా

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** కేంద్రంలోని బీజేపీ పాలకులకు బీసీలంటే భయం లేకపోవటంతోనే మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా పెట్టలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం జాగృతి ఎంత కమిట్ మెంట్ తో ఉద్యమం చేసిందో బీసీ సబ్ కోటా కోసం అంతే కమిట్ మెంట్ తో పనిచేస్తుందని తేల్చిచెప్పారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే రెండు వందల జయంతి సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కల్వకుంట్ల కవితతో పాటు జాగృతి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ ఉపకోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా పూలేనే మళ్లీ పుట్టారా అనే స్థాయిలో తమ పోరాటం ఉంటుందన్నారు. దేశంలో మహిళ రిజర్వేషన్ బిల్లు రావటంలో జాగృతి ఉద్యమమే కీలకం అన్న విషయాన్ని మనమంతా సగర్వంగా చెప్పుకోవాలన్నారు. అంతటితో ఆగకుండా బీసీలకు ఉపకోటా వచ్చే వరకు పోరాడుదామన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరగనున్న నేపథ్యంలో అవసరమైతే ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. బీసీ కోటా కోసం అన్ని పార్టీల నాయకులతో మాట్లాడుతామని అన్నారు. అధికార బలం ఉందని బీసీ కోటా లేకుండా బిల్లు పాస్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీసీ కోటా వచ్చే వరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేయాల్సిన పూలే గారి విగ్రహం విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జాగృతి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అసెంబ్లీ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పూలే జయంతి నాటికి కూడా విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేశారే తప్ప పూలే విగ్రహం మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతి రోజు నాటికైనా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# మరణించిన మినాబ్ చిన్నారుల ఫొటోలతో నిండిన విమానం

## ఇస్లామాబాద్ చర్చలకు వచ్చిన ఇరాన్ బృందానికి 'మినాబ్-168' పేరు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ఇరాన్, అమెరికా నేతల మధ్య ఇస్లామాబాద్‌లో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు ఇరాన్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం పాకిస్థాన్ పయనమైంది. స్పీకర్ ఘాలిబఫ్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ఫోటో పోస్టు చేశారు. ఈ విమానంలో నా తోటి ప్రయాణికులు వీళ్లే అని ఆ పోస్టుకు కామెంట్ ట్యాగ్ చేశారు. మినాబ్ 168 అని రాశారు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దళాలు ఆకస్మికంగా దాడి చేసిన రోజున మినాబ్‌లో ఉన్న ఓ పాఠశాలపై కూడా బాంబుల వర్షం కురిసింది. ఆ ఘటన వల్ల ఆ స్కూల్‌లో ఉన్న సుమారు 168 మంది చిన్నారులు మృతిచెందారు. ఆ హృదయవిదారకర ఘటనను స్మరిస్తూ ఘాలిబఫ్ చేసిన పోస్టు అందర్నీ కలచివేస్తున్నది. ఇస్లామాబాద్ చర్చలకు వస్తున్న ఇరాన్ బృందానికి మినాబ్ 168ని ఆయన పేరు పెట్టారు. ఇక మినాబ్ ఘటనను గుర్తు చేసేలా విమానంలోని ముందు వరుసలో దాడి వల్ల ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల ఫోటోలు, స్కూల్ బ్యాగ్‌లు, పువ్వులు పెట్టారు. యుద్ధం మిగిల్చిన అవశేషాలు అన్న రీతిలో ఆ ఫోటోలో ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ ఘాలిబఫ్ పోస్టు చేసిన ఫోటోను దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ కూడా రీట్వీట్ చేసింది. మినాబ్ చిన్నారులను తాము ఎన్నటికీ మరవబోమన్నారు.

# సబ్బండ వర్గాల అభ్యున్నతే మా సంకల్పం

## మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఒక గొప్ప మేధావి ఆలోచనలు నిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయని, అలాంటి ఒక నిరంతర చైతన్యం అక్షరమే ఆయుధంగా సామాజిక సమానత్వమే లక్ష ్యంగా పోరాడిన తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. వ్యవస్థలో పైకి కనిపించే మార్పు కంటే, మనుషుల ఆలోచనా తీరు మారడమే నిజమైన సామాజిక విప్లవం అని నమ్మి, ఆ దిశగా చివరి శ్వాస వరకు కృషి చేసిన ఆ మహనీయుని సేవలను ఈ జయంతి సందర్భంగా స్మరించుకుంటూ, నివాళులు అర్పిస్తున్నాను అన్నారు. పూలే వెలిగించిన ఆ చైతన్య దీపాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలోని మన ప్రజా ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకుని... ఆయన చూపిన బాటలో ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు విద్య, ఆర్థిక సాధికారతను అందిస్తూ, ఆలోచనల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వం తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు.

# బడుగుల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు పూలే

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** బడుగుల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు మహాత్మపూలే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు.శనివారం గాంధీ భవన్ లో మహాత్మా జ్యోతి బాపూలే 199 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్మా జ్యోతి బాపూలే జయంతి వేడుకలు టిపిసిసి ఒబిసి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒబిసిచైర్మన్ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర కన్వీనర్లు డాక్టర్. కేతూరి వెంకటేష్ డాక్టర్. జూలూరు ధనలక్షి ్మ పాల్గొన్నారు.వీర్లపల్లి మాట్లాడుతూ వెనకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన సంఘసంస్కర్త అని అన్నారు.

# ప్రమాదవశాత్తు ఆశ్రమ విద్యార్థి మృతి

## మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

## ఆదివాసీ సంఘాల నాయకుల డిమాండ్

**జైనూర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానపటార్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల చెందిన నాలుగో తరగతి విద్యార్థి దుర్వా అన్వేష్ (10) ప్రమాదవశాత్తు శనివారం మృతి చెందారు. జైనూర్ క్లస్టర్ ఏటిడిఓ శ్రీనివాస్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థుల వసతి గృహంలో విద్యార్థులు నిద్రిస్తున్న బెడ్డుకు ఉయ్యాల కట్టుకొని ఆడుతుండగా ప్రమాదవశాత్తు శుక్రవారం సాయంత్రం కిందపడ్డాడు. ఆగదిలో ఉన్న బాక్స్ కు తగలడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆ విద్యార్థిని హుటాహుటీగా జైనూర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి అశోక్ తెలిపారు. ఈ విషయం తెలియగానే గ్రంధాలయశాఖ మాజీ చైర్మన్ కనకయ్య యాదవ్, ఆదివాసి నాయకులు ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థి మృతి కి కారణాలు తెలుసుకొని అ విద్యార్థి మృతి పట్ల ప్రగడ సానుభూతి తెలియజేస్తూ ఐటిడిఏ పరంగా విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతోపాటు పదిలక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆదివాసీ నాయకులు ఆస్పత్రి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఏటిడిఓ మాట్లాడుతూ విద్యార్థి కుటుంబానికి తగు న్యాయం చేస్తామని, వారి డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పలువురు కలిసి అధికారులకు అందజేశారు. జైనూర్ ఎస్సై రవికుమార్ ప్రమాదం జరిగిన స్థలంకు చేరుకొని మృతికి గల కారణాలను మృతుని కుటుంబ సభ్యులు, ఆశ్రమ పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# ఖజానాకు రూ.వెయ్యి కోట్లు సమీకరణ

## 23న 15 ఎకరాల భూముల వేలం

**హైదరాబాద్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు నిమిత్తం అవసరమైన నిధులను సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యమ్నాయ మార్గాలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా భూముల వేలం ద్వారా రూ.1,000 కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం ఉస్మాన్‌నగర్‌లోని విలువైన భూములను వేలం వేయడానికి సర్కార్ సిద్ధమవుతోంది. ఈ బాధ్యతలను టీజీఐఐసీకి అప్పగించగా, ఈ సంస్థ ఈ నెల 23న ఈ వేలంను నిర్వహించనుంది. ఉస్మాన్‌నగర్‌లోని సర్వే నెం.30లో ఉన్న 10.09 ఎకరాలుచ, 5.72 ఎకరాల విస్తీర్ణం గల రెండు బహుళ ప్రయోజన భూములను వేలం వేయనుంది. ఎకరాకు సగటున రూ.70 కోట్ల చొప్పున సుమారు 15 ఎకరాల భూమిని విక్రయించడం ద్వారా దాదాపు రూ.1,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. టీజీఐఐసీ ఎకరాకు రూ. 39 కోట్ల కనీస రిజర్వ్ ధరను, ఎకరాకు రూ.25 లక్షల కనీస బిడ్ పెంపును నిర్ణయించింది. దీనికిఇ సంబంధించి ఈ నెల 22న ప్రీబిడ్ సమావేశం జరగనుంది. ఈ భూముల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుందని అంచనా. ఈ భూములు ప్రధానమైన ప్రదేశంలో ఉండగా, కీలక అభివృద్ధి కేంద్రాలకు అనుసంధానించబడి ఉన్నాయి. ఇవి నియోపోలిస్ నుండి కేవలం 10 నిమిషాలు మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుండి 15 నిమిషాల దూరంలో ఉండటం వలన, పెట్టుబడిదారులకు వీటి ఆకర్షణ మరింత పెరుగుతుంది. కాగా అక్టోబర్ 2025లో రైదుర్గ్‌లో 18.67 ఎకరాల విక్రయం ద్వారా రికార్డు స్థాయిలో రూ.3,135 కోట్లు ఆర్జించింది.

అమరావతి నిర్మాణానికి భారీగా నిధులు అవసరం ఉంది. లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా. రాజధాని నిర్మాణానికి ప్రజల సొమ్ము రూపాయి కూడా వెచ్చించమని ప్రభుత్వం చెబుతుంది.. ఇది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి పెంచే అవకాశాలున్నాయి. అక్కడ భూములు అమ్మివ్యయం చేస్తారనే కథనాలు ఉన్నాయి. అలాగే కేంద్రం నుంచి రాజధాని నిర్మాణానికి సరైన సహకారం విషయంలో భోళాగానే ఉందని చెప్పాలి, ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ద్వారా రూ.వేలకోట్లు రుణ సహకారం అందించే దిశలో కార్యాచరణ చేపట్టింది. కేంద్ర ఆర్థిక ప్రణాళికలో నిధుల కేటాయింపు సంతృప్త స్థాయిలోనే కేటాయించింది. ఇక కృష్ణా నది ఒడ్డున అమరావతి నిర్మాణం వల్ల వరద ముంపు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే రిజర్వాయర్లు, ఇతరత్రా నిర్మాణాలతో అమరావతిని వరద ముంపు లేని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెప్తోంది. ఆ దిశలో చర్యలు చేపట్టింది. నగరం నిర్మాణ పనులు వేగవంతం చేసే దిశలో ఇప్పుడు ప్రభుత్వం ముందుకు వడి, వడిఅడుగులు వేస్తోంది. రాజధాని మహా అద్భుత నగరంగా, అజరామరంగా నిలిపేందుకు ప్రభుత్వం భారీగా పెట్టుబడులను రాబడుతుంది. మరో పక్క ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతుంది. అమరావతిని నవనగరాల మణిహారం మారుస్తానంటుంది కూటమి ప్రభుత్వం. ఈ క్రమంలో ఆధునీక సాంకేతిక రంగంలో అపూర్వ ఆవిష్కరణగా పేర్కొనే క్వాంటం కంప్యూటస్ వ్యాలీ అమరావతి సాక్షాత్కరించబోతుంది. ప్రధాన ఆర్థిక సంస్థలకు చిరునామా అవతరించనున్నది. స్వర్ణాంధ్ర-27, పేదరికనిర్మూలన పీ-4 పథకాలను అమలు చేస్తూనే. పీపీపీ విధానంలో అమరావతిని ప్రజాభాగస్వామ్యంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్ళామని సీఎం చంద్రబాబు అంటున్నారు.

# ఇక రాజధానిగా అమరావతి

**విజయకుమార్ ఘంటా**

దేశవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా కేంద్రం ప్రకటించింది. అమరావతికి చట్టబద్ధత కల్పించింది. ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024 జూన్ 2నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసినట్లు గెజిట్లో పేర్కొంది. ఏపీ అసెంబ్లీ మార్చి 28వ తేదీ చేసిన తీర్మానం మేరకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)ని సవరించి అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తించింది. దానిపై ఈ నెల 1, 2 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో జరిగిన చర్చల్లో 35 మంది సభ్యులు సుమారు 260 నిమిషాలు చర్చించి మూజువాణీ ఓటు ద్వారా ఆమోదముద్ర వేశారు. పార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 కింద తన అధికారాలను అనుసరించి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి రాజముద్ర పడింది. సమున్నత శిఖరాల దిశగా వెళ్లేందుకు నాందిపడింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టపరమైన గుర్తింపు పొందింది. 2024 జూన్ 2 నుంచి అమరావతికి రాష్ట్ర రాజధాని హోదా దక్కింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014ని సవరిస్తూ కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిన బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఈ నెల 1, 2 తేదీల్లో ఆమోదించాయి. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. ఆ వెంటనే గెజిట్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం2026గా దానికి చట్ట రూపం ఇచ్చారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర శాసనసభ మార్చి 28న ప్రత్యేకంగా సమావేశమై తీర్మానం చేసింది. దాన్ని కేంద్రానికి పంపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)ని సవరించి, 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తింపునిస్తూ సవరణ బిల్లులో చేర్చింది. దానిపై ఈనెల ఒకటిన లోక్‌సభలో చర్చ జరిగింది. వైఎస్సార్సీపీ మినహా చర్చలో పాల్గొన్న పార్టీలన్నీ బిల్లుకు మద్దతు పలికాయి. అనంతరం మూజువాణి ఓటుతో బిల్లును దిగువసభ ఆమోదించింది. ఆ తర్వాత 2వ తేదీన రాజ్యసభలో బిల్లుపై చర్చించారు. ఇక్కడ కూడా వైఎస్సార్సీపీ మినహా చర్చలో పాల్గొన్న మిగిలిన పార్టీలన్నీ అమరావతికి మద్దతుగా నిలిచాయి. ఎగువసభ మూజువాణి ఓటుతో



ఆమోద ముద్ర వేసింది. పార్లమెంటు ఆమోదించిన ఆ బిల్లును కేంద్ర న్యాయశాఖ రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 కింద దఖలుపడిన అధికారాలను అనుసరించి ఆమె వెంటనే దానిపై సంతకంచేశారు. అనంతరం అమరావతి బిల్లు చట్టరూపం సంతరించుకున్నట్లు ప్రకటిస్తూ న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అమరావతి కిందికి సీఆర్డీ ఏ చట్టంకింద నోటిఫై చేసినప్రాంతాలన్నీ వస్తాయని చట్టంలో స్పష్టం చేశారు. ఈ అంశంపై భవిష్యత్తులో ఎలాంటి వివాదమూ తలెత్తకుండా తాజా చట్ట సవరణలో వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం2014 కింద నోటిఫై చేసిన రాజధాని ప్రాంతాలన్నీ కలిపి అమరావతి కిందికి వస్తాయని ఇందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇందులో ఏ మార్పులు చేర్పులు చేయాలన్నా పార్లమెంటు మాత్రమే చేయాల్సి ఉంటుంది. శాసనసభ చేసే సవరణలకు చట్టబద్ధమైన విలువ ఉండదు. ఈ పరిణామం తెలుగు ప్రజలు తమ ఆత్మగౌరవ ప్రతీకగా అభివర్ణిస్తే, అమరావతే రాజధానిగా ఉండాలనే నినాదంతో మూడేళ్ళు సుదీర్ఘ ఉద్యమం చేసిన ఆ ప్రాంత మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేసారు. వినూత్న ప్రయోగాలకు వేదిక అమరావతిని నిలిపి 2047 నాటికి అమరావతిని విశ్వ నగరాల్లో ఒక్కటిగా నిలపాలన్న కూటమి ప్రభుత్వ ఆకాంక్షకు అమరావతి శాశ్వత రాజధాని కావడం ఏ స్థిరమైన, దృఢ సంకల్పంగా నిలిచింది. అమరావతి అంటే హరితనగరం, సాంకేతిక రాజధానిగా, నూతన విజ్ఞానగని, పర్యాటక ప్రదేశంగా నిలపాలన్న సీఎం చంద్రబాబు స్వప్నాలు కార్యరూపం దాలుస్తున్నాయి. అందుకే ఆయన అమరావతి చట్టబద్ధత మాట వినగానే ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. అమరావతి రైతులతో సతీసమేతంగా పండుగ చేసుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఈ నగరానికి రెండు పర్యాయాలు నిర్మాణపనులు ప్రారంభించిన చారిత్రక శిలఫలకం సమీపంలో మోకరిల్లి నమస్కరించారు. అమరావతి ఏపీ రాజధానిగా శాసనం ద్వారా ఏర్పడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతోషాన్ని వ్యక్తం చేసారు. అమరావతిలో కృతిమ మేధో నగరాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఐటి మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి కొత్త వెలుగు వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బిజెపి, జనసేన, సీపీఐ, సీపీఎం పార్టీలు అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని స్వాగతించాయి. రాష్ట్రంలో ప్రత్యర్థి పక్షం రాజధానిగా అమరావతిని అంగీకరిస్తునే 'మావిగన్' నగరమంటూ ఓ ప్రతిపాదన తెచ్చింది. అమరావతికి చట్టబద్ధతను కల్పించే బిల్లును ఇటు శాసనసభలో, అటు పార్లమెంటులో ఆ పార్టీ వ్యతిరేకించింది. శాసనసభకు హాజరుగాని ఆపార్టీ అమరావతి బిల్లు ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లోను వాకౌట్ చేసింది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి ఎంపిక, కృష్ణానది ఒడ్డున 33,000 ఎకరాలకు పైగా రైతుల భూసమీకరణ, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళికలు, ఆపై రాజకీయ మార్పులతో 3 రాజధానుల ప్రతిపాదనల వివాదాలు, చివరకు 2026లో ఏపీ శాశ్వత రాజధానిగా అమరావతికే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదలచేయడంతో సాగిన సుదీర్ఘ ప్రస్థానం అమరావతికి చట్టబద్ధత కల్పించబడటంతో ముగిసింది. అమరావతి మొదటి దశలో భాగంగా 45,000కోట్ల విలువైన పనులు చేపడుతున్నారు. రోడ్లు, ఇళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల నిర్మాణం జరుగుతోంది. ఈపనులు నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించి స్థానికవ్యాపారాలకు ఊతమిస్తాయని ఆర్థిక నిపుణుల అంచనా. అమరావతిలో ఐకానిక్ భవనాలతో పాటుగా టూరిజం స్పాట్‌లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆలోచన. అదే జరిగితే పర్యాటక రంగంతో పాటుగా హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్ వంటి సేవల రంగం కూడా వృద్ధి చెందుతుంది. అమరావతి పూర్తి అయితే 15లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని, 35లక్షల మందికి నివాసం కల్పిస్తుందని అంచనా. శాసన సభ, హైకోర్ట్, సెక్రటేరియట్ సహా పలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటి కారణంగా కార్మికులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. అమరావతిలో ఏర్పాటుచేసే ఫైనాన్స్ సిటీ, ఎలక్ట్రానిక్స్ సిటీల ద్వారా కంపెనీలను ఆకర్షించాలని ప్రభుత్వ ప్రణాళిక. ఇవి ఏర్పాటైతే సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, డేటాఅనలిస్ట్‌లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ పెరుగుతుంది. ఇక అమరావతిలో ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్ అమృత యూనివర్సిటీ వంటి విశ్వవిద్యాలయాలు ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. బిట్స్, ఎస్ఎల్ఆర్ఐ పర్డ్యూ వంటిసంస్థలు కూడా రానున్నాయి. వీటి ద్వారా మరిన్ని ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. అమరావతి చారిత్రకంగా బౌద్ధ కేంద్రంగా, శాతవాహన రాజధానిగా ప్రసిద్ధి చెందింది. ఇది సాంస్కృతిక గుర్తింపును ఇవ్వటమే కాకుండా పర్యాటక అభివృద్ధికి ఈ చారిత్రక నేపథ్యం ఉపయోగపడుతుంది. అమరావతి రాజధాని నిర్మాణంతో అనేక ప్రయోజనాలున్నప్పటికీ కొన్నిసవాళ్లు ప్రభుత్వం ముందు ఉన్నాయి. రాజధాని నిర్మాణానికి వేలఎకరాల భూమిఅవసరం. ఇప్పటికే 33 వేల ఎకరాలను భూసమీకరణ చేశారు. కూటమి మళ్ళీ అధికారంలోకి వచ్చాక మళ్ళీ భూసేకరణ చేసారు. అమరావతిఎయిర్‌పోర్టు, అమరావతి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ సిటీ వంటి నిర్మాణాల కారణంగా అదనపు భూమి కావాల్సి ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇన్నివేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులకు పరిహారం, కౌలు చెల్లింపులు, పునరావాసం వంటి విషయాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ●

# ఈ మార్పు ఏవైపు!

కేరళం

**ఎ.వి.వి ప్రసాద్**

కొన్ని గంటల తరబడి క్యూలలో నిలబడి తమ 'పవిత్ర'మైన ఓటు వేసే ప్రజలే దేశ భవిష్యత్తుకు న్యాయ నిర్ణేతలనుకుంటే.. ఆ ప్రజాస్వామ్య ప్రక్రియ ఈ ఎన్నికల్లో మరింతగా సాఫల్యమైందనే చెప్పాలి. ఐదు అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికల్లో గత గురువారం తొలి అంకం ముగిసింది. కేరళం, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఒకే దఫాలో పోలింగ్ పూర్తయింది. ఇంకా రెండు అసెంబ్లీలు తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తవుతుంది. ప్రచార సరళి, పార్టీలు కురిపిస్తున్న 'ఉచితాల' వర్షం పక్కన పెడితే, మొదటి అంకంలో అద్భుతంగా కనిపించే అంశం అత్యధికంగా పెరిగిన ఓట్ల శాతం. రాజకీయ పార్టీలే ఆశ్చర్యపోయేంతగా ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాలు పెరగడం ఒక కొత్త మార్పుకు బాటలు వేసినట్లుగా కనిపిస్తోంది. సాధారణంగా 50 నుంచి 65 శాతం మధ్య పోలింగ్ నమోదు కావడం చూస్తూంటాం. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో 70శాతానికి చేరుతాయి. అయితే గత గురువారం (9, ఏప్రిల్) పోలింగ్ జరిగిన మూడు రాష్ట్రాల్లో అత్యధికంగా ఓట్ల శాతాలు నమోదు కావడం గమనించవలసిన విషయం. సాధారణ పోలింగ్ జరిగితే అదే పార్టీ అధికారంలో కొనసాగవచ్చనీ, శాతాలు అధికంగా పెరిగితే ప్రభుత్వాలు మారవచ్చనీ అంటూంటారు. అయితే ప్రతిసారీ అలాగే జరుగుతుందనుకోవడానికి లేదు. ఓటు హక్కు పొందిన యువత గణనీయంగా పెరగడం, వారు అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడంవల్ల కూడా శాతాలుగణనీయంగా పెరిగే అవకాశంఉంటుంది. అంతేకాక పార్టీలు అసాధారణ రీతిలో కురిపించిన 'ఉచిత పథకాల' వెల్లువ కూడా ఓటర్లను పోలింగ్ బూత్‌ల వైపు ఎక్కువగా నడిపిస్తూంటుంది. దక్షిణాదిన రెండు అసెంబ్లీలకు, ఈశాన్యంలోని అసోంకు పోలింగ్‌జరగగా, కేరళంలో అత్యధికంగా 78శాతం ఓటింగ్ రికార్డు కావడం ఒక కొత్త మార్పుగా భావించాలి. అంతకు ముందు 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 74 శాతం ఓట్లు పోల్ కాగా, ఈసారి మరో 4శాతం పెరిగింది. వరుసగా గత నాలుగైదు ఎన్నికలను పరిశీలిస్తే, కేరళంలో ఓటింగ్ శాతం అధికంగా పెరగడమే కనిపిస్తుంది. దానికి ప్రధాన కారణం ఓటరు చైతన్యమే. అక్షరాస్యత అధికంగా ఉండే కేరళలో ఓటరు చైతన్యం కూడా అధికం కావడంతో ఈసారి అది గొప్ప మేజిక్ చేసిందనే చెప్పాలి. 1982 నుంచి ఇంతవరకు 70శాతం పైగా పోలింగ్ నమోదు కావడం ఒక్క కేరళలోనే కనిపిస్తుంది. మిగిలిన రాష్ట్రాల్లో హెచ్చు తగ్గులు ఉండొచ్చు కానీ కేరళలో మాత్రం ప్రతి పర్యాయం పెరుగుతూ ఇప్పుడు 78 శాతానికి చేరింది. 2016లో గరిష్ఠంగా 77శాతం నమోదు కాగా, పురుషులు, మహిళా ఓట్ల నిష్పత్తి కూడా అదే స్థాయిలో పెరగడం విశేషంగా చెప్పాలి. మహిళా ఓటర్లలో కూడా రాజకీయ చైతన్యం అధికం కావడం, పార్టీల కేడర్ వ్యవస్థ కూడా బలంగా వేళ్లానుకోవడం అందుకు మరి కొన్ని కారణాలుగా చెప్పవచ్చు.



క్యూలో ఓటర్లు

ప్రపంచంలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది (1951)కూడా కేరళలోనే. కమ్యూనిస్టు కురువృద్ధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో 1950 దశకంలోనే కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. 1980నుంచి లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), యుడిఎఫ్‌లు ప్రధాన కూటములుగా చెరోసారి ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. కానీ 2016నుంచి ట్రెండ్ మారినట్లు కనిపిస్తోంది. పినరై విజయన్ నాయకత్వంలో వరుసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ఎల్డీఎఫ్ ఇప్పుడు మూడోసారి రావాలని ఆరాటపడుతోంది. అత్యధిక శాతం పోలింగ్ నమోదు కావడం ఆ ఫ్రంట్‌లో మరిన్ని ఆశలు పెంచుతోంది. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీకిమిగిలిన రెండింటి కంటే అధికంగా దాదాపు 90 శాతం ఓట్లు నమోదు కావడం ప్రజాస్వామ్య ప్రక్రియ ఎంతగా వికసించిందో చెబుతోంది. ఇక్కడ కూడా 1980 తర్వాత నుంచి ప్రతి ఎన్నిక లోను 80 శాతంపైగా ఓటింగ్ నమోదు కావడం గమనించవలసిన అంశం. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.రంగస్వామి తొలుత కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితం ఆరంభించి తర్వాత సొంత పార్టీ 'ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్‌తో ముందుకు సాగినా, తర్వాత బిజెపి వైపు మొగ్గ చూపారు. 2021లో బిజెపి మద్దతుతో ప్రభుత్వాన్నిఏర్పాటు చేసి మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో తిరిగి విజయంసాధిస్తే ఆయననాలుగోసారి సిఎం కాగలుగుతారు. ఈశాన్య రాష్ట్రమైన అసోంలో కూడా ఈసారి అత్యధికంగా దాదాపు 86శాతం ఓట్లు నమోదుకావడం విశేషం. సాధారణంగా 70శాతానికి కొంచెం అటు ఇటుగాఉండే అసోంలో2016లో అత్యధికంగా 85శాతం ఓట్లు నమోదుకాగా, 2021లో అది 82శాతానికితగ్గింది. అది ఈసారి మరో మూడుశాతం పెరగడం విశేషం. బిజెపి నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ఇప్పటిదాకా రెండుసార్లు ప్రభుత్వాలను ఏర్పాటు చేయగా, మొదటిసారి శర్వా నంద్ సోనోవాల్, రెండోసారి హిమంత విశ్వశర్మ ముఖ్యమంత్రులయ్యారు. అసెంబ్లీలోని మొత్తం 126 సీట్లలో ఎన్డీయేకు 2016లో 86సీట్లు వచ్చాయి. వాటిలో బిజెపికి 60సీట్లు రాగా, అసోం గణపరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ పూర్తి మద్దతు ఇచ్చాయి. 2021లో ఎన్డీయే బలం 75కు తగ్గింది. ఈసారి బిజెపికి అంతకు మించిసీట్లు పెరిగితే ఘన విజయం సిద్ధిస్తుంది. వరుసగా మూడోసారిప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకొంటున్న బిజెపికి తాజా ఎన్నికల్లో మహిళల మద్దతు కూడాఅనూహ్యంగా పెరిగింది. ఈమూడు అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లశాతం కూడాఅధికంగానే ఉంది. పుదుచ్చేరిలో మహిళా ఓట్లు91శాతం నమోదుకాగా, అసోంలో 86శాతం, కేరళలో81శాతం నమోదయ్యాయి. పార్టీల'ప్రజాకర్షక'పథకాలే అందుకు ప్రధాన కారణం కావొచ్చు. ఏదిఏమైనా ఈసారిఎన్నికలు ఎన్నో విశేషాలను ఆవిష్కరిస్తు న్నాయి. అయితే పార్టీల, వాటి నాయకుల అసలు జాతకాలు తెలియాలంటే మే 4దాకా వేచి ఉండవలసిందే. ●

# విద్యార్థి వీసాలు ఇక గగనమే!

ఆస్ట్రేలియా

**గన్ని మోహన్**

విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవాలని లేదా మరింతగా ఉన్నతస్థాయి కొలువులకోసం ప్రయత్నించే భారతీయ వృత్తినిపుణులు, అంతర్యాతీ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందగోరే విద్యార్థులకు అగ్రరాజ్యాలుగా భాసిల్లుతున్న దేశాలు ఆంక్షలు మరింతగా పెంచాయి. ఫలితంగా భారతీయ వృత్తినిపుణులకు గానీ, ఉన్నత విద్యకోసం వెళ్లే విద్యావంతులకుగానీ వీసాలు రావడం గగనంగా మారింది. అమెరికా, బ్రిటన్, కెనడా అదేబాటలో ఇపుడు ఆస్ట్రేలియా కూడా భారతీయ విద్యార్థులపై ఆంక్షలు మరింతగా పెంచింది. దీనితో విదేశీ చదువులు గగన కుసుమంగా మారుతాయన్న సందేహాలు భారతీయ విద్యార్థుల్లో పెరిగిపోయాయి. ఈ ఒక్క ఏడాదిలోనే ఆస్ట్రేలియాలో నేపాల్, బంగ్లాదేశ్, భారత్ నుంచి వచ్చే విద్యార్థులకు వీసాలనున తిరస్కరించింది. 2025 వీసా అనుమతులతో పోలిస్తే ఇప్పుడు ఆస్ట్రేలియాలో కొత్తసంవత్సరంలో నిష్కర్షగా తిరస్కరిస్తోంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 32.5శాతంగా ఉంది. గడచిన 20ఏళ్లలో అత్యంత గరిష్టస్థాయిలో వీసాలు తిరస్కరణకు గురవుతున్నాయి. గత ఏడాది కేవలం 15.5శాతం మాత్రమే తిరస్కరిస్తే ఈసారి మరింతగా పెరిగింది. దక్షిణాసియా దరఖాస్తులే ఎక్కువగా అంటే 60.2శాతం తిరస్కరణకు లోనవుతున్నాయి. 47.2శాతం నేపాల్, బంగ్లాదేశ్ 40శాతం అయితే భారతీయ విద్యార్థుల వీసాలు 40శాతం చైనా కేవలం3శాతం మాత్రమే తిరస్కరిస్తున్నారు. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలు చేపట్టిన కఠిన కార్యాచరణ ఇప్పుడు ఈ చిన్న దేశానికి సైతం ఎగబాకాయి. కారణాలు కూడా అనేకం కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఆస్ట్రేలియాలో ఇళ్ల అద్దెలు భారీగా పెరిగిపోయాయి. జనసాంద్రతకు అనుగుణంగా అక్కడ ఇళ్లు దొరికే పరిస్థితులు కష్టంగా ఉంది. పేయింగ్ గెస్ట్ తరహాలోనే ఉందామనుకున్నా వారికి సవాలక్ష ఆంక్షలు ఎదురవుతున్నాయి. దీనికితోడు ఆస్ట్రేలియన్లలో కూడా స్వదేశీ భావం మరింతగా పెరుగుతోంది. విదేశీయుల రాకతో తమకు ఇటు విద్యారంగంలోను, అటు ఉపాధిరంగంలోను గండిపడుతున్నదన్న భావన వారిలో పెరిగిపోతోంది. అందువల్లనే అక్కడి పాలకులు కొత్త వీసా విధానం పేరిట ఆంక్షలు పెంచినట్లు తెలుస్తోంది. గత ఏడాది 5.68 లక్షలమంది వలసజీవులున్నట్లు అంచనా. తిరస్కరణకు కారణాలు కూడా ఎక్కువగానే చూపుతున్నారు. ఫైనాన్స్, డాక్యుమెంటేషన్ వంటి వాటిని పరిశీలించడంతోపాటు అక్రమ పద్ధతులు అవలంభించడాన్ని కట్టడిచేయడానికేనని చెపుతున్నారు. అదేవిధంగా కెనడాలో కూడా ప్రస్తుతం కొనసాగించింది. అందులోను భారత్‌లోని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్‌ల విద్యార్థులకు ఎక్కువ తిరస్కరిస్తున్నారు. డంకీ రూట్‌లో వస్తున్నారన్న అనుమానాలు పెరిగిపోయాయి. ఇక్కడకు వచ్చినవారు వీసా దుర్వినియోగం చేస్తున్నారన్న అనుమానాలే వారిలో పెరిగాయి.



పాస్‌పోర్టు వీసా

మొత్తంగా వలసలను 50శాతం కట్టడి చేయాలని నిర్ణయించుకున్న ఆసీస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ దిశగా ముందు భారత్‌పైనే ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది. దీనికితోడు విదేశీయులకు ఇళ్లు అద్దెకు దొరకడం కూడా కష్టంగానే ఉంది. సొంత ఇళ్లున్న యజమానులు 67శాతం ఉంటే అద్దెకున్నవారు 31శాతంగా ఉన్నారు. ఎక్కువ శాతం పేయింగ్ గెస్ట్‌లగా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నా ఆస్ట్రేలియాలో ఇళ్లకొరత కూడా ఎక్కువగానే ఉంది. అందువల్లనే ఇప్పుడు అమెరికాను కాదని ఎక్కువగా ఎంచుకుంటున్న దేశాలు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లే ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో బ్రిటన్ ఉన్నా వీసా ఫీజులు అమెరికా తరహాలోనే పెంచేసింది. జనసాంద్రతకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరక్కపోవడంతో అక్కడ ఇళ్ల సమస్య కూడా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం హోబర్ట్, అడిలైడ్ నగరాల్లో మాత్రమే కొంతమేర అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. జీవన వ్యయం కూడా అక్కడ విపరీతంగా పెరిగింది. అద్దెకు ఇళ్లు ఇచ్చే మార్కెట్ అత్యంత సంక్లిష్టంగా ఉంది. అత్యధిక డిమాండ్ నెలకొంటున్నది. అందువల్లనే ఇప్పుడు ఆస్ట్రేలియాకు వెళ్లి చదువుకోవాలన్నా, వృత్తినిపుణులు ఉన్నత కొలువులకు వెళ్లాలన్నా అక్కడ ఇళ్ల సమస్యనే వారిని అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా కొన్ని భారత రాష్ట్రాల నుంచి వచ్చే వీసాలు అడ్డదారుల్లో వస్తున్నట్లు ఆస్ట్రేలియా అనుమానిస్తోంది. భారత్‌లో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆస్ట్రేలియాలో ఉన్నత చదువులకు వెళ్లాలన్నా భారతీయ విద్యార్థులకు కష్టాలే ఎదురవుతున్నాయి. ఇతర బంగ్లాదేశ్, నేపాల్ దేశాల తరహాలోనే ఇప్పుడు భారత విద్యార్థులకు కూడా ఆస్ట్రేలియాలో డంకీరూట్‌లు వెతికితే అమెరికా తరహా డిటెన్షన్లు తప్పేటట్లు లేదు. ఉన్నత చదువుల్లో ప్రపంచ ర్యాంకుల్లో ఎనిమిదో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల విద్యార్థులతోపాటు ఇప్పుడు వృత్తి నిపుణులకు కూడా సమస్యలు తప్పడంలేదు. కంపెనీలు ఆహ్వానిస్తే తప్ప వెళ్లేందుకు సుముఖత కూడా వ్యక్తం చేయడంలేదు. ఎందుకంటే అమెరికా తరహాలోనే దేశం ఫస్ట్ నినాదం అనేది చాపకిందనీరులా విదేశాల్లో విస్తరిస్తోంది. అందువల్లనే ఇప్పుడు ఆస్ట్రేలియా వంటి దేశాలు వీసాలపై ఆంక్షలు పెంచాయని తెలుస్తోంది. ఉన్నత చదువుల్లో కొనసాగుతూనే అక్కడ పార్ట్‌టైమ్ కొలువులు చేసుకోవడం అనేది భారతీయులకు అలవాటు. కష్టపడి పనిచేయడం అనేది భారతీయుల నరాల్లోనే ఉంది. అయితే ఇప్పుడు వీసా దుర్వినియోగం కట్టడి చేయడం కోసం చదువుకునే విద్యార్థులు ఇలా పార్ట్‌టైమ్ చేయడానికి వీలులేదన్న ఆంక్షలు విధించాలని కూడా పరిశీలిస్తున్నాయి. మొత్తంగా చూస్తే ఇప్పుడు భారతీయ వీసాలపైనే ఎక్కువగా అగ్రరాజ్యాలు కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నాయి. ఆ జాబితాలో ఇప్పుడు ఆస్ట్రేలియా కూడా చేరిందనడంలో ఎలాంటి సందేహంలేదు. ●

# అమెరికా సామ్రాజ్యవాదం కాగితపు పులి!

**బొల్లిముంతసాంబశివరావు**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి తర్వాత అమెరికా, ఇరాన్‌ను అనేక విధాల బెదిరించింది, బెదిరిస్తున్నది. ముఖ్యమైన నాయకులు మరణించినా, ఏమాత్రం భయపడని ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ దాడులను ఎదుర్కొంటూ, ప్రతి దాడులు చేస్తున్నది. శత్రువుకి ఊహించని నష్టాలు కలుగజేస్తున్నది. అమెరికా యుద్ధంలో ఇరుక్కుని బయటపడలేక గిలగిలాకొట్టుకుంటూ ఉంది. అమెరికా ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్లో రెండువేలకుపైగా ప్రజలు మరణించగా, వేలాదిమంది గాయపడ్డారు. అయినా ఇరాన్ ప్రజలు ఐక్యంగా అమెరికాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాదం పశ్చిమాసియాపై ఆధిపత్యం చెలాయించి, ఆప్రాంతంలో ఉన్న ఆయిల్, ఇతర సహజవనరులను తరలించుకుపోవడం ధ్యేయంగా పెట్టుకుంది. అందుకోసం ఈ దురహంకార ఇజ్రాయిల్ పెంచిపోషించి అరబ్ దేశాలపైదాడులు చేయిస్తున్నది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి, గాజాలో నరమేధం అందులో భాగమే. తన ప్రయోజనాలను వ్యతిరేకించే దేశ ప్రభుత్వాలను కూల్చి తన అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. అందులో భాగమే సిరియాలో అసద్ ప్రభుత్వ కూల్చివేత, ఇరాక్‌పై సైనికదాడి జరిపి సద్దాంహుస్సేన్కు మరణశిక్ష, లిబియాలో గఢాఫీహత్య. తన పెంపుడు బిడ్డ ఇజ్రాయెల్‌కు ఆయుధాలుసప్లయి చేసి లెబనాన్, యెమనూ భూభాగాలను ఆక్రమించేలా చేసింది. అరబ్ దేశాలపై సైనిక దాడులు, పాలకప్రభుత్వాల కూల్చివేత లేకాకుండా, అనేక దేశాల్లోతన సైనికస్థావరాలు ఏర్పాటు చేసుకున్నదిఅమెరికా. ఖతార్ ఆల్ ఉదీద్‌ఎయిర్బేస్ ఏర్పాటు చేసింది. ఇది మధ్య ప్రాచ్యంలో అతిపెద్ద అమెరికా సైనికస్థావరం. ఇది (అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం). బెహ్రైయిన్లో అమెరికానేవల్ఫోర్సెస్ సెంట్రల్కమాండ్ 5వ ఫ్లీట్ప్రధాన కార్యాలయం ఉంది. కువైట్లో అరిఫ్జన్ క్యాంపు. ఇక్కడ వేలాది మంది అమెరికా సైనికులు, ఆయుధాలు ఉన్నాయి. సౌదీఅరేబియా దేశంలో ప్రిన్సుల్తాన్‌ఎయిర్బేస్నిర్మించింది. యునైటెడ్ అరబ్‌ఎమిరేట్స్‌లో ఆల్ధఫ్రా ఎయిర్బేస్, ఇరాక్లో ఐక్య అల్ అసద్ ఎయిర్బేస్లు ఏర్పాటు చేసింది. ఇవిగాక ఇంకా అనేక సైనిక స్థావరాలున్నాయి. ఈ స్థావరాలను తన ఆధిపత్య విధానాలను వ్యతిరేకిస్తున్న ఇరాన్‌పై దాడిచేయడానికి, పశ్చిమ ఆసియాలో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటానికి అమెరికా ఏర్పాటు చేసినవే. పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన దాదాపు 50వేలమంది సైనికులున్నారు. 5వ నౌకాదళం బహ్రైయిన్లో ఉండగా, బహ్రైయిన్, ఖతార్లో 28 వేల మంది సైనికులున్నారు. ఖతార్ సైనిక కేంద్రఖర్చులో సహరాజ్యాలు సుమారు 650, మిలియన్ల అమెరికా డాలర్లు భరిస్తున్నాయి. ఈస్థావరాలనుంచే అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తున్నది. అమెరికా కుట్రలు, దాడులురెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా, సోవియెట్ యూనియన్ రెండు బలమైన రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ఈ రెండుదేశాలు పరస్పర వ్యతిరేక విధానాలు కలిగిఉన్నాయి. అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచఆధిపత్య దురాక్రమణ విధానాలు అవలంబిస్తే, స్టాలిన్ నాయకత్వాన ఉన్న సోవియెట్ యూనియన్ అమెరికా యుద్ధవిధానాలను వ్యతిరేకించి వెనుకబడిన దేశాలకు, ప్రపంచ ప్రజలకు బాసటగా ఉంది. స్టాలిన్ జీవించి ఉన్నంతకాలం ఈవైరం కొనసాగుతూవచ్చింది. ఇతర దేశాల్లో రాజకీయ పరిణామాల మార్పును ప్రభావితం చేయడానికి లేదా మార్చడానికి అమెరికా అనేక చర్యలు చేపట్టింది. ఇవి ప్రత్యక్ష సైనికదాడుల నుంచి రహస్యనిఘా కార్యకలాపాలు, ఆర్థికఆంక్షలు, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం వరకు ఉన్నాయి. ఐసన్హోవర పరిపాలనలో రహస్య నిఘా కార్యక్రమాలు అమెరికా ప్రధాన విధానంగామారింది. సైన్యాలను పంపడానికి బదులుగా, ఇతరదేశాల్లో సైనికతిరుగుబాట్లు లేదా అన్నదానిపై సీఐఏ ఆధారపడింది. 1950లో ఉత్తరకొరియాపై దాడి చేసింది. 1960 దశకంలో కెన్నడీ, జాన్సన్ అధ్యక్షుల పాలనలో ఇతరదేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాలు పెరిగాయి. సోవియట్యూనియన్లో కృశ్చెవు ముందుకు తెచ్చిన శాంతియుత సహజీవనం, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ వల్ల జరిగిన అనేక పరిణామాలు గమనించాలి. క్యూబాపైజరిగిన బేఆఫ్పిగ్స్ దాడి (ఏప్రిల్ 1961లో అమెరికా నిఘా సంస్థ సిఐఎ మద్దతుతోక్యూబన్ ప్రవాసులు ఫిడేల్ కస్ట్రోకమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చి వేయడానికి కెన్నడి అధ్యక్షతన దండయాత్రని బేఆఫ్పిగ్సా దాడి



అంటారు. ఈదాడి మూడురోజుల్లోనే విఫలమైంది) అంతేకాకుండా విప్లవాత్మక ప్రభుత్వాలను కూలద్రోయడానికి చేసే రహస్య సైనిక చర్యలు జరిగాయి. 1970 దశాబ్దంలో నిక్సన్ అధ్యక్షకాలంలో జోక్యంతరచుగా బహిరంగ యుద్ధం కంటే, రహస్య అస్థిరత సృష్టించడం రూపంలో ఉండేది. వియత్నాం యుద్ధంలో కమ్యూనిస్టుల పోరాటానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష సైనిక జోక్యంచేసుకుంది. 1973లో చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని పడగొట్టించడం, సైనిక నియంతపినోచెట్ను అధికారంలో కూర్చోబెట్టడం జరిగింది. 1980లోరీగన్ అధ్యక్షతన ప్రాక్సీ ఘర్షణలు( రెండు ప్రధాన దేశాలు తమసొంత సైన్యాలను నేరుగా యుద్ధంలోకి దింపకుండా, వేరేదేశాల తిరుగుబాటుదారుల, మిలీషియాదళాల ద్వారా తమశత్రువులపై జరిపే పరోక్షదాడి) పరాకాష్టగా నిలిచాయి. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా తన దుష్టపన్నాగాలను ఎక్కువ చేసింది. జార్జిబుష్కాలంలో 1989లో పనామాపైదాడి, 1991లోఇరాక్‌పైగల్ఫ్ యుద్ధంజరిగాయి. క్లింటన్కాలంలో సోమాలియా హైతి, కొసావోలో తిరుగుబాట్లు జరిగాయి. బైడెన్, ట్రంప్ పాలనలో ఆఫ్ఘనిస్తాన్పై యుద్ధం జరిగింది. నేడు ఇరానెపై ప్రత్యక్షదాడి ప్రారంభించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధానికి కొన్ని నాటోదేశాలు, యూరప్ దేశాలు మద్దతు నిరాకరించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా మొదలైన దేశాలు యుద్ధంలో పాల్గొనమని చెప్పాయి. ఈయుద్ధం తమది కాదని భావించాయి. స్వీడన్ అమెరికా విమానరాకపోకలకు అనుమతి నిరాకరించి తన గగనస్థలాన్ని మూసివేసింది. రష్యా, చైనా, ఉత్తర కొరియా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. నాటో చీఫ్ మార్క్రుట్టే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను సమర్థించారు. మరికొన్ని దేశాలు అమెరికాకు మద్దతు ప్రకటించాయి. యుద్ధంలో పాల్గొనమని చెప్పిన బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా భారత గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాయి. ఐక్యరాజ్యసమితి పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు ఆపాలని తీర్మానం చేసిందే కాని, ఒకసార్వభౌమదేశం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్దాడులు ఖండించడంగాని, ఆపాలనిగాని మాత్రం తీర్మానం చేయలేదు. దీన్ని గమనిస్తే ఐక్యరాజ్యసమితి, అమెరికా ప్రయోజనాలను ఏవిధంగా కాపాడుతుందో అర్థం అవుతుంది. ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమాన్ని పూర్తిగా వదులుకోవడం, ఇరాన్ అణుశుద్ధిని నిలిపి వేయ డం, ఇప్పటికే శుద్ధిచేసిన యురేనియం నిల్వలను అంతర్జా తీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం, హోర్ముజ్జలసంధిని నిరంతరం తెరిచి ఉంచడం, ఇరాన్లోని అణుకేంద్రాలను ధ్వంసం చేయడం వంటివి అమెరికా ప్రతిపాదనల్లో ముఖ్య మైనవి. వెంటనే తమపై దాడులు పూర్తిగా ఆపివేయడం, ఇక ముందు ఎలాంట దాడులు చేయమని గ్యారంటీ ఇవ్వడం, దాడులవల్ల ఇరాన్‌కి జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించడం, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా స్థావరాల మూసివేత, ఇరాన్ క్షిపణుల తయారీపై ఆంక్షలు విడనాడటం, హర్ముజ్జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని అధికారికంగా గుర్తించడం ఇరాన్ ప్రతిపాదనలో ముఖ్యమైనవి. పెద్దఎత్తున అణ్వాయుధాలతో ప్రపంచాన్ని భయపెడుతున్న అమెరికా, అణ్వాయుధ కార్యక్రమాన్ని వదులుకోమని ఇరాన్ చెప్పడం దాని ఆధిపత్య విధానాలకు నిదర్శనం. ఇరాన్ వల్ల అణ్వాయుధ ప్రమాదం ఉందని చెప్పే అమెరికా ముందుగా తన వద్ద ఉన్న అణ్వాయుధాలను నాశనం చేయాలి. తాను మాత్రం అణ్వాయుధాలు కలిగి ఉంటాను, అణ్వాయుధాల పరీక్షలు జరుపుతూనే ఉంటాను, ఇరాన్ మాత్రం తయారు చేయకూడదని చెప్పడం అమెరికా ద్వంద్వనీతికి నిదర్శనం. అణ్వాయుధాల తయారీ అనుమానాలతో ఇరాన్‌పై దాడి చేసిన అమెరికా, పెద్దఎత్తున అణ్వాయుధాలు కలిగి ప్రపంచానికి ప్రధానశత్రువుగా ఉన్న తనపై అన్నిదేశాలు కలసి దాడి చేయడం సరైందే గదా! అలాచేస్తే అమెరికా పరిస్థితి ఏమిటి. ఇరాన్ ప్రతిపాదనలు న్యాయంగా ఉన్నాయి. దాడి ప్రారంభించింది అమెరికా, ఇజ్రాయిల్ కాబట్టి ఇరాన్‌కు పూర్తి నష్ట పరిహారం చెల్లించాలి. ఈ కాగితపు పులిని ప్రపంచ ప్రజలు ముక్కల ముక్కలుగా చించిపారేయాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి పవనాలు వీస్తాయి. ●

# ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేశాం

## ఇక ప్లాన్ బి అవసరంలేదు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి చర్చలు ఇవాళ పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఈ చర్చలు విఫలమైతే తమ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్లాన్ బీ వంటిది ఏదీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా దెబ్బతీశామని, అందుకే ప్లాన్ బీ అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్చల కోసం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీలతో కూడిన ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. వారికి పాకిస్థాన్ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ స్వాగతం పలికారు. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. పారిస్ నుంచి బయలుదేరే ముందు వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. వారు మాతో ఆడుకోవాలని ప్రయత్నిస్తే, మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండదని స్పష్టం చేశారు. గత కొన్ని వారాలుగా క్షిపణి దాడులతో అట్టుడికిన గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ అమలవుతోంది. ఈ ప్రశాంత వాతావరణంలోనే చర్చలు జరుగుతున్నప్పటికీ, అమెరికా తన బలగాలను పశ్చిమాసియాలో మరింతగా మోహరించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. చర్చలకు ముందే ఇరు దేశాలు తమ తమ డిమాండ్లతో ముందుకు వచ్చాయి. అమెరికా 15 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించగా, ఇందులో ఇరాన్ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని, సైనిక పరిమితులను అంగీకరించాలని షరతులు విధించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ 10 పాయింట్ల ప్రణాళికను పంపింది. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, హార్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అమెరికా గుర్తించాలని కోరింది. ఇరాన్ సైన్యం ఓడిపోయింది. వారి వద్ద కొన్ని క్షిపణులు, పరిమిత తయారీ సామర్థ్యాలు మాత్రమే ఉన్నాయి. మా సైన్యం అద్భుతంగా పని చేసింది. వారిని గట్టిగా దెబ్బతీశామని ట్రంప్ విలేకరులతో అన్నారు. మరోవైపు వచ్చే వారం లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య కూడా చర్చలు జరగనుండటం ఈ ప్రాంతంలో దౌత్యపరమైన ప్రయత్నాలకు సూచికగా నిలుస్తోంది.

**ఇరాన్‌కు చైనా రహస్యంగా ఆయుధ సరఫరా:** అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల వేళ అమెరికా తన నిఘా వర్గాలను ఉటంకిస్తూ చైనాపై సంచలన ఆరోపణలు చేసింది. డ్రాగన్ కంట్రీ ఇరాన్‌కు రహస్యంగా విమాన విధ్వంసక క్షిపణులను సరఫరా చేస్తోందని ఆరోపించింది. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికా నిఘా వర్గాల ప్రకారం చైనా నుంచి ఇరాన్‌కు మ్యాన్‌ప్యాడ్స్ అందుతున్నాయి. భుజంపై నుంచి ప్రయోగించే ఈ క్షిపణులు తక్కువ ఎత్తులో ప్రయాణించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను సులభంగా కూల్చివేయగలవు. అంతర్జాతీయంగా విమర్శలు రాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను నేరుగా కాకుండా మూడో దేశం ద్వారా ఇరాన్‌కు చేరవేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ సమయాన్ని ఇరాన్ తన ఆయుధ సంపత్తిని తిరిగి సమకూర్చుకోవడానికి ఉపయోగించుకుంటోందని అమెరికా అనుమానిస్తోంది. ఒకవేళ యుద్ధం మళ్లీ మొదలైతే ఈ క్షిపణులు అమెరికా విమానాలకు పెను ముప్పుగా మారతాయని ఆందోళన చెందుతోంది. ఈ ఆరోపణలను చైనా ఖండించింది. తాము ఏ దేశానికీ ఆయుధాలు సరఫరా చేయడం లేదని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ పరిణామాలతో ఇస్లామాబాద్ చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చైనా తన వైఖరి మార్చుకోకపోతే, వచ్చే నెలలో జరగాల్సిన ట్రంప్ జిన్‌పింగ్ భేటీపైనా ప్రభావం పడే అవకాశం ఉందని చైనా అంచనా వేస్తోంది.

# మమత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రం ఇస్తాం

## బిజెపి ప్రభుత్వం రాగానే యుసిసి అమలు: ప్రధాని మోడీ



**తూర్పుబర్ధమాన్(బెంగాల్),ఏప్రిల్ 11:** పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈరోజు మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమన్నారు. బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. అలాగే అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి పౌరశిక్షాస్మృతి అమలు చేస్తామన్నారు. యుసిసి అమలుతో అక్రమచొరబాట్లు కట్టడి అవుతాయని ఆయన భరోసా ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు. అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.



అమెరికా, ఇరాన్ చర్చల సందర్భంగా

## ఇస్లామాబాద్‌లో భారీ భద్రత

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** మధ్య ఆసియా యుద్ధం వేళ అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు జరుగుతున్న పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్ ఉన్నతస్థాయి భద్రతను పాక్ సమకూర్చింది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తన బృందంతో ఇస్లామాబాద్‌కు రాగా ఇరాన్ తరఫున ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి తన బృందంతో చేరుకున్నారు. ఇరుదేశాల ప్రతినిధులకు పాక్ తరఫున ఘన స్వాగతం లభించింది. ఇస్లామాబాద్ లోని పాక్ అధ్యక్షుడి భవనం వేదికగా చర్చలు మొదలు కాగా ఇందుకోసం ఇస్లామాబాద్‌లో పది వేల మంది కమాండోలతో భద్రతను ఏర్పాటు చేశారు. పాక్ మిలటరీతో పాటు స్థానిక పోలీసు విభాగాల నుంచి కూడా కొందరు సాయుధులను భద్రత కోసం వినియోగించారని అక్కడి మీడియాలో వార్తలు వచ్చాయి. ఇస్లామాబాద్‌లో రెండు రోజుల నుంచి పహారా కొనసాగుతోంది. ఇరు దేశాల ప్రతినిధులు విడిది చేసిన హోటళ్లతో పాటు దాని చుట్టుపక్కన మార్గాలలో పూర్తిగా ఆంక్షలు విధించారు. అమెరికా బృందంలో జెడి వాన్స్‌తో పాటు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు కుష్నర్ తో పాటు యుఎస్ తరఫున పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ వుండడం చర్చల్లో వీరిద్దరు పాల్గొనబోతున్నట్లు పాక్‌తో పాటు యుఎస్ మీడియాలో వార్తలు వచ్చాయి, అమెరికా బృందం ఇస్లామాబాద్‌లోని నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌కు చేరుకోగా అక్కడ పాక్ త్రివిద దళాల తరఫున వా రికి వందనం లభించింది. కాగా అమెరికా బృందానికి నాయకత్వం వహించిన జెడి వాన్స్ వచ్చిన యుఎస్ ఎయిర్‌ఫోర్స్ సి 32ఏ విమానానికి పాక్ గగనతలంలో ఎఫ్ 16తో పాక్ భద్రత కల్పించింది. యుఎస్ బృందం ప్రయాణించిన విమానం ఇరాన్ గగన తలాన్ని వాడకుండా ప్రత్యామ్నాయ మార్గంలో పాక్‌కు వచ్చింది. పాక్‌కు పొరుగు దేశమైన ఇరాన్ బృందం నేరుగా ఇస్లామాబాద్‌కు చేరింది.

# ఆర్టెమిస్ సురక్షితంగా తిరిగిరాక

## అంతరిక్ష యాత్రలలో కొత్త అధ్యాయం

## భవిష్యత్తులో చంద్రునిపై మనిషిని దించే ప్రయోగం



**న్యూయార్కు, ఏప్రిల్ 11:** అర్ధ శతాబ్దం తర్వాత చంద్రుడి చెంతకు మానవులను తీసుకెళ్లిన ఈ యాత్ర నలుగురు వ్యోమగాములతో కూడిన ఓరియన్ క్యాప్సూల్‌ను సురక్షితంగా భూమికి చేర్చింది. ఈ విజయంతో అంతరిక్ష యాత్రల చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయానికి నాసా శ్రీకారం చుట్టింది. గంటకు 40,000 కిలోమీటర్ల భీకర వేగంతోను సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రతలో సగానికి సమానమైన 2,760 డిగ్రీల సెల్సియస్ వేడితో పయనించిన ఈక్యాప్సూల్ సురక్షితంగా భూమికి చేరింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తీవ్ర ఉత్కంఠకు గురి చేసిన ఈ క్లిష్టమైన ఘట్టాన్ని దాటుకుని, ఆర్టెమిస్2 యాత్ర చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. భూ వాతావరణంలోకి పునఃప్రవేశం అత్యంత ప్రమాదకరమైనది. హైపర్‌సోనిక్ వేగంతో దూసుకొస్తున్న ఓరియన్ క్యాప్సూల్‌ను వేడిగాలుల ప్లాస్మా కవచంలా చుట్టుముట్టింది. ఈ సమయంలో హ్యూస్టన్‌లోని మిషన్ కంట్రోల్ రూమ్‌లో సూది పడినా వినపడేంత నిశ్శబ్దం నెలకొంది. ఆరు నిమిషాల కమ్యూనికేషన్ బ్లాక్‌అవుట్ తర్వాత, మిషన్ కమాండర్ రీడ్ వైస్‌మన్ గొంతు రేడియోలో "హలో హ్యూస్టన్, ఓరియన్ భూమికి తిరిగివచ్చింది అని వినిపిం చగానే, కంట్రోల్ రూమ్ మొత్తం హర్షధ్వానాలు, చప్పట్లతో దద్దరిల్లింది. తమ వారి కోసం ఎదురు చూస్తున్న వ్యోమగాముల కుటుంబ సభ్యులు ఆనందబాష్పాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. 1960-70ల నాటి అపోలో యాత్రల్లో కేవలం శ్వేతజాతి అమెరికన్ పురుషులు మాత్రమే పాల్గొనగా, ఆర్టెమిస్2 భిన్నత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ యాత్ర ద్వారా చంద్రుడి కక్ష్యలోకి వెళ్లిన తొలి మహిళగా క్రిస్టినా కోచ్, తొలి నల్ల జాతీయుడిగా విక్టర్ గ్లోవర్, తొలి అమెరికాయేతర వ్యోమగామిగా కెనడాకు చెందిన జెరెమీ హాన్సెన్ చరిత్ర పుటలకెక్కారు. కేవలం సాంకేతిక విజయం మాత్రమేకాదని మానవ సమానత్వపు ముందడుగు అని నాసా అభివర్ణించింది. 1970 నాటి అపోలో13యాత్ర నెలకొల్పిన భూమికి 4,00,171కి.మీ. దూర ప్రయాణ రికార్డును బద్దలుకొట్టి, ఆర్టెమిస్2 సరికొత్త మైలురాయిని నెలకొల్పింది. ఈ యాత్ర కేవలం చంద్రుడిని చుట్టి రావడం మాత్రమేకాదు. భవిష్యత్తులో చంద్రుడిపై మనిషిని దించే ఆర్టెమిస్3 యాత్రకు అవసరమైన ఓరియన్ క్యాప్సూల్‌పనితీరు, లైఫ్‌సపోర్ట్ సిస్టమ్స్, నావిగేషన్ వంటి కీలక సాంకేతికతలను పరీక్షించడానికి ఇది ఒక ప్రయోగశాలగా ఉపయో గపడిందని, ఈ విజయం ఆర్టెమిస్ తరానికి ఆరం భం మాత్రమే. మనం కలిసికట్టుగా నక్షత్రాలకు ప్రయాణిస్తామని నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ ఉద్వేగంగా ప్రకటించారు. 2030 నాటికి చంద్రుడిపై స్థావరం ఏర్పాటుచేయాలని చైనా వంటి దేశాలు పోటీపడుతున్న తరుణంలో ఆర్టెమిస్2 విజయం అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంతో కీలకం. ఈ గెలుపు, భవిష్యత్తులో చంద్రుడిపై శాశ్వతమానవ స్థావరాల ఏర్పాటుకు, అక్కడి నుంచి అంగారకు డిపైకి ప్రయాణించడానికి బలమైన పునాది వేసింది.



## చర్చల తరుణంలో హార్మూజ్‌ను దాటిన తొలి గ్యాస్ ట్యాంకర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హార్మూజ్ జలసంధిని దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్‌గా జగ్ విక్రమ్ నిలిచింది. ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్ గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరింది. సురక్షితంగా హార్మూజ్ జలసంధిని దాటింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జలసంధిని దాటిన ఈ నౌక మధ్యాహ్నానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించింది. ఈ గ్యాస్ ట్యాంకర్ 20 వేల టన్నుల ఎల్పీజీని తీసుకురానుంది. జలసంధిని దాటడానికి అనుమతి కోసం జగ్ విక్రమ్ వారం రోజులకుపైగా గల్ఫ్ జలాల్లో ఎదురుచూసినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. ఈ ట్యాంకర్ ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యానికి చెందినదిగా తెలుస్తున్నది. మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని, త్వరలో అవి కూడా ఇదే మార్గం గుండా భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. ఆ 15 నౌకల్లో ఒకటి ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్‌లు, ఒక ఎల్ఎన్‌జీ ట్యాంకర్, ఒక రసాయన ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్‌లు, మూడు ఇతర నౌకలు ఉన్నట్లు తెలుస్తున్నది.

## అమెరికా ఉపాధ్యక్షుడి విమానానికి ఎఫ్-16 విమానాల రక్షణ



**ఇస్లామాబాద్; ఏప్రిల్ 11:** ఇరాన్‌తో శాంతిచర్చల కోసం పాకిస్తాన్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ బృందానికి ఎఫ్ 16 యుద్ధవిమానాలు రక్షణగా నిలిచాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల దృష్ట్యా అమెరికా నుంచి వాన్స్ బృందానికి రక్షణగా పాక్ తమ ఎఫ్ 16 యుద్ధ విమానాలను పంపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి రెండు వారాలు విరమణ ప్రకటించిన ఇరాన్, అమెరికా చర్చలకు సిద్ధమయ్యాయి. ఇరాన్ ప్రతినిధులతో దౌత్యపరమైన చర్చల కోసం యూఎస్ఏ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో కూడిన బృందం శుక్రవారం రాత్రి అమెరికా యుద్ధ విమానం బోయింగ్ లో పాకిస్థాన్ బయల్దేరింది. వాన్స్ టీమ్ ప్రయాణిస్తున్న విమానానికి రక్షణగా పాక్ తమ ఎఫ్16 యుద్ధ విమానాలను పంపింది. ఏకంగా ఐదు విమానాలు ఎస్కార్ట్‌గా ఉండి బోయింగ్‌సి 32ఎను సురక్షితంగా ఇస్లామాబాద్‌కు తీసుకొచ్చాయి.

## ఇరాన్‌పై దాడిచేయాలని ఒత్తిడిచేసిన నెతన్యాహు

### అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** ఇరాన్‌పై దాడి చేయాలని అమె రికాపై ఇజ్రాయెల్ ప్రధాని నెత న్యహూ అనేకసార్లు వత్తిడి చేసినట్లు అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ సంచలన వ్యాఖ్యలుచేసారు. అమెరికా మాజీ అధ్యక్షులపైన కూడా గతంలో ఒత్తిడి జరిగినట్లు ఆయన చెప్పారు. కానీ నెత న్యహూ ప్రెజర్‌కు ట్రంప్ ఒక్కరే ఒప్పుకున్నారని తెలిపారు. ద బ్రీఫింగ్ విత్ జెన్ సాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్య లు చేశారు. నెతన్యహూతో అనేక సార్లు చర్చలు జరిపానని, ఆ సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని అమెరికాపై వత్తిడి తెచ్చేవారని, ఇరాన్‌పై మిలిటరీ చర్యలు తీసుకోవాలని అమెరికాను కోరేవారన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయాలన్న ఆకాంక్ష నెత న్యహూలో ఉన్నట్లు కెర్రీ పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడి అంశం గురించి గతంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతోనూ నెతన్యహూ నేరుగా చర్చించినట్లు చెప్పారు. కానీ ఆ ప్రతిపాదనను ఒబామా వ్యతిరేకించినట్లు కెర్రీ తెలిపారు. ఒబామా తిరస్కరించారు.. జో బైడెన్ తిరస్కరించారు ప్రెసిడెంట్ జార్జ్ బుష్ తిరస్కరించారు. పెసిడెంట్ ట్రంప్ మాత్రమే ఇరాన్‌పై దాడులకు అంగీకరించినట్లు కెర్రీ తెలిపారు. ఇరానీ ముఖ్య నేతలను హతమార్చి, అధికార మార్పిడిచేసి, ఇరాన్ మిలిటరీని ధ్వంసం చేయాలన్న ఆలోచన నెతన్యహూకు ఉన్నట్లు ఆయన చెప్పారు. గతంలో ఇజ్రాయెల్ , అమెరికా అధికారులతో జరిగిన చర్చల సమయంలో నెతన్యహూ ఇవే ప్రతిపాదనలు చేసినట్లు కెర్రీ పేర్కొన్నారు.



## పార్కింగ్ ప్రాంతంలో ల్యాండ్ అయిన మంత్రి హెలికాప్టర్

**ముంబై, ఏప్రిల్ 11:** ఒక మంత్రికి ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణించిన హెలికాప్టర్ నిర్దేశించిన హెలిప్యాడ్‌ను దాటి వెళ్లింది. సమీపంలోని వాహనాల పార్కింగ్ స్థలంలో అది ల్యాండ్ అయిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఛగన్ భుజ్‌బల్ శనివారం పూణే జిల్లాలో పర్యటించారు. ఖాన్వాడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. మంత్రి ఛగన్ భుజ్‌బల్ ప్రయాణించిన హెలికాప్టర్ హెలిప్యాడ్‌ను దాటి వెళ్లింది. హెలికాప్టర్ రోటర్ల వల్ల గాలిలోకి దుమ్ము ఎగజిమ్మింది. దీంతో పైలట్‌కు ఏమీ కనిపించకపోవడంతో ల్యాండింగ్ ప్రదేశాన్ని దాటించాడు. గోడ అవతల ఖాళీగా ఉన్న వాహానాల పార్కింగ్ స్థలంలో ఆ హెలికాప్టర్‌ను ల్యాండ్ చేశాడు. ఈ సంఘటన వల్ల ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మరోవైపు పోలీస్ అధికారులు వెంటనే ఆ హెలికాప్టర్ వద్దకు చేరుకున్నారు. తప్పుగా ల్యాండింగ్ చేసిన విషయాన్ని పైలట్‌కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ హెలికాప్టర్‌ను నిర్దేశిత హెలి ప్యాడ్‌కు తరలించి ల్యాండ్ చేశారు. ఈ సంఘటన వల్ల ఏర్పడిన అంతరాయం తర్వాత మంత్రి ఛగన్ భుజ్‌బల్ తన కార్యక్రమాలను కొనసాగించారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబాకు తీవ్రగాయాలు

### ముఖం, కాలిన గాయాలకు చికిత్స తీసుకుంటున్న ఖమేనీ



**దుబాయ్, ఏప్రిల్ 11:** అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో ఇరానీ కొత్త సుప్రీంనేత మొజ్తాబా ఖమేనీ గాయపడ్డ విషయం తెలిసిందే. అయితే అతనికి ముఖానికి, కాళ్లకు తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. మొజ్తాబా ముఖం పూర్తిగా దెబ్బతిన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 28వ తేదీన టెహ్రాన్‌పై జరిగిన వైమానిక దాడిలో ఇరాన మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందగా అదే దాడిలో మొజ్తాబా ఖమేనీ గాయపడ్డారు. యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇరానీ సుప్రీంనేతగా బాధ్యతలు తీసుకున్న మొజ్తాబా ఖమేనీ ఇంకా గాయాలు నుంచి కోలుకుంటున్నట్లు అతనికి సన్నిహితంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు తెలిపారు. దాడిలో మొజ్తాబా ముఖం చాలా వరకు దెబ్బతిన్నదని, అలాగే ఓ కాలుకు తీవ్ర గాయమైనట్లు ఆ ముగ్గురు వెల్లడించినట్లు తెలుస్తోంది. గాయాల నుంచి కోలుకుంటున్న 56 ఏళ్ల మొజ్తాబా ఆ వ్యక్తుల ప్రకారం మెంటల్‌గా చాలా షార్ప్‌గా ఉన్నట్లు తెలిసింది. సీనియర్ అధికారులతో మొజ్తాబా ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్నట్లు తెలిసింది. నిర్ణయాత్మక అంశాల్లోనూ అతను తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌అమెరికా దళాలతో జరుగుతున్న యుద్ధంతో పాటు వాషింగ్టన్ ప్రతినిధులతో జరుగుతున్న శాంతి చర్చలను కూడా మొజ్తాబా అడిగి తెలుసుకుంటున్నట్లు చెబుతున్నారు. సుప్రీంనేతగా ఎన్నికైన మొజ్తాబా ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మళ్లీ పరిపాలన కొనసాగిస్తారా లేదా అన్న అంశం అస్పష్టంగానే ఉంది.

## మొజ్తబా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు..

### ఛాన్స్ వస్తే ట్రంప్‌ను హత్యచేయడానికి వెనుకాడరు: ఇయాన్ బ్రెమ్మర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** అమెరికా, ఇరాన్ ఇరు దేశాల మధ్య అస్థిరంగా కొనసాగుతున్న కాల్పుల విరమణ అంత సులభం ఏమీ కాదని అనేక అంశాలు దీనికి అడ్డుతగిలే ప్రమాదం ఉందని ప్రముఖ అంతర్జాతీయ రిస్క్ అనలిస్ట్, యూరేషియా గ్రూప్ వ్యవస్థాపకుడు ఇయాన్ బ్రెమ్మర్ హెచ్చరించారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారని, ఇదే శాంతి ప్రక్రియకు అతిపెద్ద సవాలుగా మారవచ్చని బ్రెమ్మర్ అభిప్రాయపడ్డారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో తన తండ్రి అలీ ఖమేనీతో పాటు కుటుంబ సభ్యులను కోల్పోయిన మోజ్తాబా ప్రతీకారం తీర్చుకోవాలనే బలమైన ఆకాంక్షతో ఉన్నారని తెలిపారు. అవకాశం వస్తే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి ఆయన ఒక్క క్షణం కూడా ఆలోచించరు. ఆయన కేవలం హేతుబద్ధంగా కాకుండా ప్రతీకారం, ఆగ్రహంతో నిర్ణయాలు తీసుకుంటున్నారని బ్రెమ్మర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చలు విఫలమవడానికి మరికొన్ని కారణాలను కూడా ఆయన వివరించారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం మొత్తాన్ని తొలగించాలని అమెరికా పట్టుబట్టడం, లెబనాన్‌లోని హెజ్బొల్లా వంటి తమ అనుకూల గ్రూపులకు ఇరాన్ మద్దతు ఆపాలని షరతు పెట్టడం వంటివి ప్రతిష్టంభనకు దారితీయవచ్చన్నారు. ఇరాన్‌లోని స్థానిక మిలిటరీ కమాండర్లపై కేంద్ర నాయకత్వానికి పూర్తి నియంత్రణ ఉందా అన్నది కూడా సందేహమేనని తెలిపారు.

## రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదరింపులు



**చెన్నై, ఏప్రిల్ 11:** తమిళ సినీ పరిశ్రమకి చెందిన ఇద్దరు అగ్ర నటుల ఇళ్లలో బాంబులు పెట్టినట్లు వచ్చిన సందేశం చెన్నై నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి శనివారం వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్ పోలీసులకు ముచ్చెమటలు పట్టించింది. పోయెస్ గార్డెన్‌లోని సూపర్ స్టార్ రజనీకాంత్ నివాసంలో, అల్వార్‌పేటలో ఉన్న హీరో ధనుష్ నివాసంలో బాంబులు అమర్చామని, ఏ క్షణమైనా పేలవచ్చని ఆ బెదిరింపు మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ సమాచారం బయటకు రావడంతో ఒక్కసారిగా అభిమానుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి రంగంలోకి దిగారు. ఇద్దరు నటుల నివాసాల వద్దకు చేరుకున్న భద్రతాదళాలు సుమారు గంటన్నరపాటు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించాయి. ఇంటి లోపల, గార్డెన్ ప్రాంతం, పరిసరాల్లో అణువణువూ గాలించారు. కానీ ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలుకానీ, అనుమానాస్పద వస్తువు కానీ లభించలేదు. చివరకు అది ఒక ఫేక్ మెయిల్ అని అధికారులు నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే ఎవరో ఆకతాయిలు ఈ పనికి ఒడిగట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలోనూ విజయ్, అజిత్ వంటి ప్రముఖుల ఇళ్లకు ఇలాంటి బెదిరింపులు ఎదురైన సందర్భాలు ఉన్నప్పటికీ ఈసారి నేరుగా డీజీపీ కార్యాల యానికే మెయిల్ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈమెయిల్ పంపిన వ్యక్తి ఎవరు ఏ ఐపీ అడ్రస్ ద్వారా ఈ మెయిల్ పంపారనే కోణంలో సైబర్ క్రైమ్ విభాగం ఆరా తీస్తోంది. తప్పుడు సమాచారంతో ప్రజలను, పోలీసు యంత్రాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ముందుజాగ్రత్త చర్యగా రజనీ కాంత్, ధనుష్ నివాసాల వద్ద అదనపు భద్రతను ఏర్పాటుచేశారు.

## నిర్బంధపు నమాజ్ ఫిర్యాదుపై ఏడుగురు అరెస్టు

**నాసిక్, ఏప్రిల్ 11:** మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ మల్టీనేషనల్ ఐటీ కంపెనీలో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. ఉద్యోగినులపై లైంగిక వేధింపులు, మానసికంగా హింసించడం, బలవంతంగా నమాజ్ చేయించడం, బీఫ్ తినిపించడం, మత మార్పిడికి యత్నించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ఈ కేసుకు సంబంధించి కంపెనీ అసిస్టెం ట్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) సహా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 2022 నుంచి 2026 మధ్య కాలంలో ఈ దారుణాలు జరిగినట్లు 8 మంది మహిళా ఉద్యోగినులు ఫిర్యాదు చేశారు. ఉద్యోగ భద్రత పేరుతో మభ్యపెట్టి, తమ ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించారని ఆరోపించారు. వీరితో పాటు మరో పురుష ఉద్యోగి కూడా తన మత విశ్వాసాలను కించపరిచారంటూ ఫిర్యాదు చేయడం గమనార్హం. బాధితుల ఫిర్యాదుల మేరకు 2026 మార్చి 26 నుంచి పోలీసులు మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్) సందీప్ మిట్కే నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు.

అరెస్ట్ అయిన ఏడుగురిలో హెచ్‌ఆర్ మేనేజర్‌ను ఏప్రిల్ 13 వరకు పోలీస్ కస్టడీకి, మిగిలిన ఆరుగురిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు పంపింది. మరో ఐదుగురిని ప్రొడక్షన్ వారంట్‌పై కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ తీవ్రంగా స్పందించారు. బాధితులను బలవం తంగా నమాజ్ చేయించి, బీఫ్ తినిపించారని, ఈ ఫిర్యాదులపై సీనియర్ ఉద్యోగులు చర్యలు తీసుకోనందున వారిపైనా కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఇది కేవలం ఒక్క కంపెనీకే పరిమితం కాదని, కార్పొరేట్ సంస్థల్లో ఇదో పెద్ద రాకెట్ అయ్యుండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించి, పోలీసుల తక్షణ చర్యను ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్ ఆదేశాల మేరకు కంపె నీలో లైంగిక వేధింపుల నివారణ (పోష్) చట్టం అమలుపై విచారణ ప్రారంభమైంది.

సుమారు 300మంది ఉద్యోగులున్న ఈ కంపెనీలో మరిన్ని అరెస్టులుజరిగే అవకాశం ఉందని పోలీసులు భావి స్తున్నారు. సిట్ బృందం అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసింది.






జ్యోతిరావుపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఎంపీ శ్రీ మల్లు రవి కూడా పాల్గొని పూలే చిత్రపటానికి అంజలి ఘటించారు. అణగారిన వర్గాల సామాజిక న్యాయం, మహిళా విద్య కోసం జ్యోతిరావు పూలే చేసిన విశేష కృషి అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సామాజిక సాధికారత కోసం పూలే స్ఫూర్తితో తెలంగాణలో సమగ్ర కుల గణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ వంటి అనేక నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

# అణగారిన వర్గాల అభివృద్ధికి జ్యోతిరావుపూలే అవిరళ కృషి

## జయంతిలో బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** దేశంలోని అణ గారిన వర్గాల అభివృద్ధికి జ్యోతిబా పూలే ఎంతో కృషి చేశారని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ కొనియాడారు. శనివారం మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి ఉత్సవాన్ని బీసీ కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ జి. నిరంజన్ ఇతర అధికారులు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనం గా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబాపూలే అణగారిన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వారి సారధ్యంలో విద్య అన్ని వర్గాల వారికి చేరాలని తన సతీమణి సావిత్రి బాయ్ పూలేతో రాత్రి బడులు నడిపించారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా ఇండ్ల జాబితా తయారీ జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఏ విధంగా గణిస్తున్నారో అలాగే ఓబిసిల గణన కొరకు కూడా అప్లికేషన్‌లో ప్రత్యేక కాలం చేర్చాలని నిరంజన్ డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం చట్టం చేయడంతో .. 33 శాతంలో మహిళా ఓబీసీలకు ఎంత శాతం ఉండనున్నదని తెలియాల్సిన అవసరం ఉందన్నారు. జనగణనలో కులగణన ప్రస్తుత భారత దేశంలో ఎంతో అవసరమని, ఆ వివరాలు తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేయడంలో వివిధ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడానికి ఉపయోగపడుతుందని నిరంజన్ అన్నారు.




బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# రేవంత్ సర్కార్‌ది భూఅరాచకం!

## ముఖ్యమంత్రి కుటుంబానిదే రియల్ దందా..

## నిప్పులు చెరిగిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ అరాచక పాలన సాగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం మొత్తం భూదందాల చుట్టూనే తిరుగుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని బొంగుళూరు సమీపంలోగల ప్రమిద గార్డెన్స్‌లో జరిగిన ప్రజాప్రతినిధుల సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కెటిఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నుండి రంగారెడ్డి జిల్లా మాడ్గుల వరకు రేవంత్ కుటుంబం భూములు కొనుగోలు చేస్తూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనకే పొలిటికల్ ఫ్యూచర్‌లేని రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ కడతాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఫార్మాసిటి చుట్టూ సీఎం అను చరులు భారీగా భూములు కొనుగోలు చేశారని వారి లబ్ధి కోసమే ఈ ప్రాజెక్టు డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. అంబానీ జూపార్క్ ఏర్పాటు కోసం ఎకరానికి రూ.2 కోట్ల విలువ చేసే దాదాపు 3,000 ఎకరాల ప్రభుత్వ భూమిని కట్టబెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్య మంత్రికి నల్లమల అడవులు మిస్ అవుతున్నట్లు అనిపిస్తోంది.. అందుకే సిటీలో జూపార్క్ పెడతానంటున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కోహెడలో పండ్ల మార్కెట్ కోసం 178 ఎకరాలు కేటాయిస్తే, ఇప్పుడు ఆ భూములను కాజేసి మార్కెట్‌ను గుట్టల్లోకి పంపాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, రంగా రెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీచైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శికి ఇచ్చిన ఎన్ఐఎ నోటీసు ఉపసంహరించుకోవాలి

## వామపక్ష పార్టీల డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు ఇచ్చిన ఎన్ఐఏ నోటీసును ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. రంగారావును తనకు సంబంధం లేని కేసులో విచారణకు రావాలని కోరుతూ ఎన్ఐఏ నోటీసు ఇవ్వడాన్ని వామపక్ష పార్టీలుగా తీవ్రంగా ఖండించాయి. కేసు విషయంలో విచారించడానికి ఈ నెల 22న మాదాపూర్ కార్యాలయానికి హాజరుకావాలని కోరుతూ నోటీసు పంపిందని, వాస్తవానికి ఈ కేసుతో సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీకిగానీ, రంగారావుకుగానీ ఎలాంటి సంబంధం లేదని వామపక్ష పార్టీల నేతలు అన్నారు.

అయితే ఈ కేసు నంబరును పరిశీలించగా గాదె ఇన్నయ్యకు సంబంధించిన కేసు అని స్పష్టమైందని, గాదే ఇన్నయ్యను అరెస్టు చేస్తున్న విషయంలో పోలీసులు, రాజ్యం, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలనీ, ఎవరికైనా ముందస్తు నోటీసులూ, ముందస్తు సమాచారం ఇవ్వాలనీ, ఎలాంటి సమాచారం లేకుండా ఇష్టానుసారంగా పోలీసులు అరెస్టు చేయడం సరియైనది కాదనీ, చట్టబద్ధంగా వ్యవహరించాలనీ, ఆ సందర్భంగా పోటు రంగారావు పత్రికా ముఖంగా కోరారు. సంఘటనను ఖండించారు. అంతకుమించి ఆ విషయంతో పోటు రంగారావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయనకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్‌వాడకం కుటుంబానికి చేటు

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ (సికిందరాబాద్), ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** డ్రగ్స్ వాడకం వలన వ్యక్తి గత జీవితంతోపాటు సామాజిక జీవితాన్ని కోల్పోతామని, ఉజ్వలమైన భవిష్యత్తు కూడా నాశనమవుతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గాంధీ దవాఖాన సైకియాట్రి విభాగంలో 20 బెడ్లతో ఏర్పాటు చేసిన నూతన డ్రగ్స్ డీఅడిక్షన్ కేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో శనివారం గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని ఆడిటోరియంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అలవాటుగా మారే ఔషధ దుర్వినియోగంపై అవగాహనా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడిన వారి కోసం రాష్ట్రంలో 35 డీఅడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చేశామని అన్నారు. వారికి స్క్రీనింగ్, కౌన్సిలింగ్, చికిత్స అందించి వారిని సాధారణ స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నా డ్రగ్స్ వినియోగం పెరుగుతుండడం బాధాకరమని అన్నారు. డ్రగ్స్ అమ్మడం, వాడడం నేరమని వైద్య విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. వ్యాస రచన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

**వార్షికోత్సవ సదస్సులో..**

గాంధీ హాస్పిటల్‌లో జరిగిన ఫోరెన్సిక్ మెడిసిన్ వార్షిక సదస్సులో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఫోరెన్సిక్ వైద్యులు అంకితభావంతో పని చేస్తున్నారని, వారి పని సాంకేతికతతో పాటు



డ్రగ్స్ అమ్మమని, వాడమని ప్రమాణం చేయిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మానవత్వం, సహనం అవసరమయ్యే బాధ్యతాయుతమైన సేవ అని మంత్రి కొనియాడారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం, సిగాచీ ఫ్యాక్టరీ ఘటనల సమయంలో ఫోరెన్సిక్ బృందాలు విశేష సేవలు అందించాయని మంత్రి గుర్తు చేశారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 37 పీజీ సీట్లు ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని సీట్లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

# బిఆర్ఎస్ వలలో చిక్కుకున్న జీవన్‌రెడ్డి

## సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాపై విమర్శలు : ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** రాజ్యసభకు వెళ్లే అవకాశం రాలేదని బిఆర్ఎస్ వలలో జీవన్ రెడ్డి చిక్కుకున్నారని నాగర్ కర్నూల్ ఎంపి డా.మల్లు రవి ఆరోపించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని విడిచి రాజకీయ శత్రువైన బిఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి వెళ్లడం బాధగా ఉందనీ అన్నారు. తెలంగాణలో మళ్లీ కెసిఆర్ ఎందుకు రావాలో జీవన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్, హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక భూమిక పోషించిన నాయకుడు జీవన్ రెడ్డి ఇటీవల కెసిఆర్‌ను కలిశారనీ, త్వరలోనే జగిత్యాలలో సభ పెట్టి ఆయన సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరతారని వార్తలు వస్తున్నాయి. రాజకీయాల్లో పార్టీ మారడం అత్యంత సహజమైన విషయం. కెసిఆర్‌పై ఉప ఎన్నికల లో ఎంపిగా పోటీ చేసినప్పుడు ఆయనకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని బరిలో నిలిపింది. కేవలం 10 వేల ఓట్ల తేడాతోనే జీవన్ రెడ్డి ఓడిపోయారు. ఆ విషయాన్ని ఆయన మర్చిపోయారు. కానీ కరీంనగర్ ప్రజలు అసలే మర్చిపోలేదని అన్నారు., ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ గా, మంత్రిగా నిబద్ధతతో పని చేశారు. పెత్తందారి వ్యవస్థకు దొరల వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేశారు. మీ నాన్న కూడా దొరల గడీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఉన్నారని చెబుతుంటారు. అత్యంత సాధారణంగా మీరు జీవించారు.

కాంగ్రెస్ విధానం కూడా సెక్యులరిజం, సోషలిజం, ఇంక్లూజివ్ గ్రోత్, సోషల్ జస్టిస్. ఇది కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం. ఈ మూల సిద్ధాంతాలకు అనుకూలంగా మీరు ఒక వ్యక్తిగా పెరిగి కాంగ్రెస్ పార్టీకి మీకు ఒక గుర్తింపును తీసుకొచ్చారనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చాలా ఏళ్లు పనిచేసిన సీనియర్ నాయకుడు డి.శ్రీనివాస్ కూడా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. రాజ్యసభ ఎంపి ఇచ్చినప్పటికి ఎలాంటి గుర్తింపు లేకుండా రాజకీయ జీవితాన్ని ఎలా గడిపారో ప్రజలందరికీ తెలుసు. టిడిపి నుంచి వెళ్లిన నాగం జనార్ధన్ రెడ్డి ఇంకా చాలామంది నాయకులు బిఆర్ఎస్ లో చేరారనీ గుర్తుచేశారు. కేవలం చేరిన ఒక్కరోజే పండగ రోజు.. ఆ తర్వాత అన్ని దండగ రోజులే ఈ విషయాన్ని జీవన్ రెడ్డి గుర్తుంచుకొని మాట్లాడితే మంచిదనీ హితవుచెప్పారు. ఇప్పటివరకు మీరు ప్రజల మనిషి అని, ప్రజల కోసం పోరాటం చేసిన నాయకుడని మేమందరం భావించామనీ అన్నారు.. కానీ నియంతృత్వ పార్టీలోకి వెళ్లే మీరు కరీంనగర్ జిల్లాలోని ఎస్‌సిబిసి, ఎస్‌టిలు, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారు.

**రైల్వే బోర్డు ఛైర్మన్‌తో భేటీ..**

శనివారం ఉదయం రైల్వే బోర్డు ఛైర్మన్‌తో భేటీ అయినట్టు ఎంపి మల్లు రవి చెప్పారు. డోర్నకల్–గద్వాల నూతన రైల్వే లైన్ గురించి చర్చించినట్టు వెల్లడించారు. ఈ లైన్‌కు సంబంధించిన ఎలైన్‌మెంట్ డిపిఆర్ గురించి చర్చించినట్టు వివరించారు.

ఈ కొత్త లైన్ గురించి రైల్వే బోర్డు మీటింగ్ పెట్టి, రిపోర్టు తయారుచేసి క్యాబినెట్‌కు పంపాలని మల్లు రవి ఛైర్మన్‌ను కోరారు. అలాగే.. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఈ రైల్వే లైన్ మంజూరు అయ్యేలా చూడాలని ఛైర్మన్‌ని కోరినట్టు మల్లు రవి వివరించారు.

# సమసమాజ దార్శనికుడు మహాత్మా జ్యోతిరావుపూలే: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్11:** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవిత కాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమసమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారు జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు.

తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.

సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు.

# ఔట్‌సోర్సింగ్ జీతాల్లో కోతల్లేవ్

## మంత్రి అజహరుద్దీన్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న 5 వేల మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల్లో ఎలాంటి కోతలు ఉండబోవని రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకుబ్ పాషా మైనా రిటీ విద్యా సంస్థల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేసిన ప్రకటనను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తెలి పారు. ఆ సిబ్బంది పూర్తికాలం జీతం చెల్లించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి, శాఖ కార్యదర్శి షఫిఉల్లాను ఆదేశించారు. సంబంధిత శాఖలు, సంస్థలతో సమన్వయం చేసుకుని పూర్తికాలం వేతనంతో పాటు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఈపీఎఫ్, ఈఎస్ఐ లబ్ది పునరుద్ధరణ చేస్తూ వారి ఆర్థిక స్థిరత్వాన్ని, గౌరవాన్ని కాపా డాలని ఆదేశించారు. మైనారిటీల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపించే ఎలాంటి విధానాలను, కార్యచరణను ప్రభుత్వం అనుస రించబోదని ఆయన స్పష్టం చేశారు.

# మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మక నిర్ణయం

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మహిళా 33శాతం రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో తీసుకువచ్చి మహిళల ప్రాధాన్యాన్ని మరింతగా చాటిచెప్పారని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ అన్నారు. శనివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డికె అరుణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల నుండి పెద్దల వరకు మహిళలకు గౌరవం కల్పించే అనేక కార్యక్రమాలను మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందని, నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా మహిళలకు రాజకీయాల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. 2029 ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం జరుగుతున్నాయని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడినా, గత ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూపలేదు. కానీ ప్రధాని నరేంద్ర మోడీ అన్ని పార్టీలను సమన్వయం చేసి ఈ బిల్లును తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. ఈ బిల్లు అమలు అయితేనే దాని సార్థకత ఉంటుందని, అందుకే అన్ని పార్టీల ఎంపిలు పార్టీలు అతీతంగా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని నేను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇది కేవలం ఒక చట్టం కాదు, కోట్లాది మహిళల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక. దేశ రాజకీయాల్లో కొత్త యుగానికి నాంది పలికే బిల్లు ఇది అన్నారు. మరోవైపు మన తెలంగాణ రాష్ట్రంలోనే మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ బిల్లు అమలైతే, డిలిమిటేషన్ తర్వాత తెలంగాణలో పార్లమెంట్ స్థానాలు పెరిగి, దాదాపు 9 మంది మహిళలు పార్లమెంట్‌కు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 273 మంది మహిళలకు అవకాశం లభిస్తుందన్నారు.

# స్కాలర్‌షిప్‌లు, ఫీజుబకాయిలు తక్షణమే చెల్లించాలి

## నిరసన ర్యాలీలో ఎంపి ఆర్.కృష్ణయ్య



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద వేలాది మంది విద్యార్థులతో కలసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడు తూ ఎంతో ముఖ్యమైన స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కీల్‌ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదన్నారు. పేద విద్యార్థుల కోసం ఈ స్కీములు పెట్టిన తరువాత, గ్రామాలలోని వ్యవసాయ కూలీల పిల్లలు సైతం మెడిసిన్, ఇంజనీరింగ్, పీజీ వంటి ఉన్నత విద్యలు చదువుతున్నారని, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారం భమయిందని గుర్తు చేశారు. సమాజంలో వచ్చిన గుణాత్మకమైన మార్పును ఆహ్వానించవలసిన ప్రభుత్వం, పేద విద్యార్థులు చదువుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఫీజు బకాయిలు చెల్లించక పోవటం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని, విద్యార్థులు ఉద్యోగాలకు వెళ్లాలన్నా, ఉన్నత చదువులు చదువు కోవాలన్నా, సర్టిఫికెట్లు లేకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 14లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 8వేల కోట్లు తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వ భూములు వేలం వేయ కుండా హాస్టళ్లు, గురుకులాల స్వంత భవనాలు కట్టడానికి వినియోగించాలని, 100 బీసీ హాస్టళ్లు, 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ర్యాలీలో బీసీ విద్యార్థి సంఘం నేతలు పగిళ్ల సతీష్, నీల వెంకటేష్, అనంతయ్య, చంద్రశేఖర్‌గౌడ్, శివకుమార్‌యాదవ్, మోడీ రాందేవ్, అఖిల్ ముదిరాజ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌దే మహిళా రిజర్వేషన్ ఆలోచన

## పిసిసి అధికార ప్రతినిధి లింగంయాదవ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్ ఆలోచన కాంగ్రెస్‌దని టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్ అన్నారు. శనివారం గాంధీభవన్ డాక్టర్ లింగం యాదవ్ మాట్లాడుతూమహాత్మ జ్యోతి రావు పూలే ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. మహిళల అభివృద్ధి కోసం పెద్ద పీట వేసింది ప్రజా ప్రభుత్వం అన్నారు. టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సైతం కమిటి లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినారని తెలిపారు. ఒబిసి లో మహిళ కోట ని పెట్టాలని మోడీ ని డిమాండ్ చేశారు. జనగణన లో కులగణన చేసి మహిళ రిజర్వేషన్ ఇచ్చి ఇందులో బిసి మహిళ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. మహాత్మ జ్యోతి రావు పూలే ఆశయాలకు అనుగుణంగా మోడీ సర్కార్ పాలన చేస్తే బిసి మహిళ రిజర్వేషన్ కల్పించాలి. రాష్ట్రంలో మహిళలకు తగిన ప్రాధాన్యత, కోట ఇస్తుంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది.



నూతన భవన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# డిసెంబరులోగా నూతన సాంస్కృతిక, సంగీత నాటక అకాడెమీ

## సిసిఆర్‌టిలో భవనం నిర్మాణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఈ సంవత్సరం డిసెంబరు లోపు నూతన సాంస్కృతిక, సంగీత నాటక అకాడమీ పనులు పూర్తి చేసి అకాడమీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని సిసిఆర్‌టిలో నూతనంగా నిర్మిస్తున్న సాంస్కృతిక కేంద్ర సంగీత నాటక అకాడమీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనులపై వివరాలు వాకబు చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలో ఉన్న సిసిఆర్‌టీలో రవీంద్ర భారతి తరహాలో సాంస్కృతిక సెంటర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నేడు నగర వాసులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రవీంద్ర భారతి ఏకైక సెంటర్ ఉందని, పెరుగుతున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నిధులు 23కోట్ల రూపాయలతో సిసిఆర్‌టిలో నూతన భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం చివరి నాటికి, డిసెంబరులో భవన నిర్మాణం మొత్తం పూర్తి చేసి నగర ప్రజలకు, కళాకారులకు నూతన సాంస్కృతిక, సంగీత నాటక అకాడమీని అంకితం ఇస్తామని అన్నారు. ప్రస్తుతం పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

# ఏజెన్సీలో రూ.54.90 కోట్లతో తునికాకు సేకరణ

## 50 ఆకుల కట్టకు రూ.4 ఇవ్వాలని గిరిజనుల డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఏజెన్సీలో గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ.54.90 కోట్లతో బీడీ ఆకు (తునికాకు) సేకరించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 30 జిల్లాలో, 37 డివిజన్లలో ఆకు సేకరణ చేయనుంది. కాళేశ్వరం సర్కిల్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ మంచిర్యాల్ సర్కిల్, బాసర సర్కిల్, రాజన్న సర్కిల్, భద్రాద్రి సర్కిల్, చార్మినార్ సర్కిల్ పరిధిలోని 104 యూనిట్లలో 1.22లక్షల స్టాండర్డ్ బ్యాగ్‌లను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒక్కో స్టాండర్డ్ బ్యాగ్ కు రూ.3,300 చెల్లించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు గాను టీజీఎఫ్డీసీ ద్వారా బీడీ ఆకు సేకరణ, అమ్మకాలు జరిపించనుంది. కాగా ప్రభుత్వ నిర్ణయంతో ఆదివాసీలకు రెండు నెలల సరిపడా ఉపాధి లభించనుంది. బీడీ ఆకు సేకరణను గతంలో ఆదివాసీలు రెండో పంటగా భావించేవారు. కాలం మారుతున్న తరుణంలో బీడీ ఆకును మూడో పంటగా ఆదివాసీలు భావిస్తున్నారు. గిరిజన పల్లెల్లో విద్యార్థులు, వృద్ధులు, రైతులకు బీడీ ఆకుల సేకరణ ద్వారా ఉపాధి లభిస్తుంది. గతంలో బీడీ సేకరణను గుత్తేదారులు టెండర్ల ద్వారా దక్కించుకొనేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం బీడీ ఆకుల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ముందు కు రావడంతో, కాంట్రాక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి, వాటిఇ యూనిట్లను దక్కించుకుంటున్నారు. ఇదే సమయంలో తునికి ఆకు కూలీలకు ఒక కట్టకు 4 రూపాయలు పెంచి ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే 2020 నుండి పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు. తునికి ఆకు సేకరణ ములుగు జిల్లాలో గిరిజనులు గిరిజనేతరులు అత్యధికంగా చేస్తారని ప్రతి కుటుంబానికి ఒక పంటగా భావిస్తారు. 50 ఆకుల కట్టకు మూడు రూపాయల 70 పైసలు ఇస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.4 చెల్లించాలని చెబుతున్నారు. తునికాకు బోనస్ గతంలో 2016 నుండి 2021 వరకు 200 కోట్ల రూపాయలు విడుదల చేస్తే ఆ డబ్బులు తునికాకు సేకరించిన గిరిజనులకు అందలేదని, వెంటనే బోనస్ అందించాలని అంటున్నారు.

# సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లతో చర్చలు జరపాలి: జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** విద్యుత్ ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తక్షణమే జేఏసితో చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలన్నారు. రాష్ట్రంలోని విద్యుత్ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు, అన్‌మ్యాన్డ్ వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు న్యాయమైన హక్కుల కోసం అనేకసార్లు నిరసనలు తెలియజేసినా యాజ మాన్యాలు మొండిగా వ్యవహారిండంతో తప్పని పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుండి నిరవధిక సమ్మెకు దిగారన్నారు. విద్యుత్ సరఫరా కోసం ప్రాణాలకు తెగించి పని చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిరక్ష్య వైఖరిని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆర్టిజన్స్ పోరా టాలకు మద్దతును ఇస్తున్నామని, వారి విద్యార్హతల ఆధారంగా వెంటనే కేడర్ మార్పు చేపట్టాలన్నారు. 2019 స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేసి, వెంటనే పాత ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, అన్‌మ్యాన్డ్ వర్కర్లను తక్షణమే ఆర్టిజన్లుగా గుర్తించి విలీనం చేసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. డిసెంబర్ 4, 2016 కట్ ఆఫ్ తేదీ కంటే ముందు నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ, విజిలెన్స్ క్లియరెన్స్ ఉన్నవారిని బేషరతుగా విద్యుత్ సంస్థ ల్లోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టిజన్లకు 2026 పీఆర్‌సీని వెంటనే వర్తింపజేసి, పీస్ రేట్ కార్మికులకు జీవో నం. 11 ప్రకారం తక్షణమే కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

## కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరనున్న జీవన్‌రెడ్డి

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** జగిత్యాలలో బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సన్నహాలు చేస్తుంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం జగిత్యాలలోనీ జీవన్ రెడ్డి నివాసానికి చేరుకొని బి ఆర్ఎస్ పార్టీలో చేరాలని ఆహ్వానించాడు. దీంతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి శుక్రవారం ఎర్రబెల్లిలోని ఫామ్ హౌస్ కి వెళ్లి మాజీ సీఎం కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరడంతో పాటు పలు విషయాలపై చర్చించి జగిత్యాలలో ఈనెల 20న భారీ బహిరంగ సభ పెట్టాలని తెలిపాడు. దీంతో మాజీ సీఎం కేసీఆర్ఈనెల 20 బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని సభ ఇన్చార్జిగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎమ్మెల్సీ ఎల రమణ దావ వసంత సురేష్ తుల ఉమాను ఇన్చార్జిలుగా నియమించారు. దీంతో శనివారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్సీ ఎల్ రమణ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు దావసంత సురేష్ జగిత్యాల ఐదు ప్రాంతాలలో పరిశీలించారు మొదట గొల్లపల్లి రోడ్డు వివేకానంద స్టేడియం ధర్మపురి రోడ్డులోని ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంతం మోతే గ్రామ సమీపంలోని వ్యవసాయ భూములలో ధరూర్ లోనే గీత విద్యాలయ గ్రౌండ్ జగిత్యాల మండలం లక్ష్య యంపూర్ వ్యవసాయ భూములలో బహిరంగ సభకు స్థలాలను పరిశీలించారు. ఈ సభకు లక్ష మందిని తరలించాలని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుండి జనాలను తరలించాలని సన్నాహాలు చేస్తున్నారు.

# బావిలో పడి ఇద్దరు బాలికలు మృతి

**గూడూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఈత కోసం వెళ్లిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందిన విశాద సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మట్టెవాడ శివారులోని మారుమూల అటవీప్రాంతంలో ఉన్న నేలవంచ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనతో గ్రామంలో ఒక్కసారిగా విశాదం అలుముకుంది. వివరాలిలా ఉన్నాయి. నేలవంచ గ్రామానికి చెందిన కత్తుల అశోక్ కూతురు కత్తుల శ్రీజ (9), పెనుక రవి కూతురు పెనుక చైత్ర(9)లు శనివారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వారు ఎంత సేపటికి ఇంటికి రావపోవడంతో చీకటి పడిన తర్వాత కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా బాలికలు శ్రీజ, చైత్రలు మృతి చెందినట్లు గుర్తించారు. వారిని వెంటనే బావి నుండి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

# ఏరోపోనిక్ పద్ధతిలో కుంకుమపువ్వు సాగు

## నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్

**హైదరాబాద్, ఏప్రిల్11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏరోపోనిక్ పద్ధతిలో కుంకుమపువ్వు సాగు మంచి ఫలితాలు ఇస్తోందని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయభాస్కర్ తెలిపారు. కృత్రిమ నియంత్రిత వాతావరణంలో కుంకుమపువ్వు సాగు చేయడం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే కొత్త పద్ధతులకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ మద్దతు ఇస్తుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు, తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఏరోపోనిక్ కుంకుమపువ్వు ల్యాబ్‌ను హైదరాబాద్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలు, ఆవిష్కరణల వినియోగంతో అగ్రికల్చర్, హార్టికల్చర్ అనుబంధ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తుందన్నారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో ఉష్ణోగ్రత, కృత్రిమ సూర్యకాంతి, గాలిలో తేమను నియంత్రిస్తూ కుంకుమపువ్వు సాగు చేయవచ్చని వివరించారు. త్వరలో పూర్తి స్థాయిలో ఏరోపోనిక్ కుంకుమ పువ్వు సాగు యూనిట్ ఖర్చును తెలియజేస్తామని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, సెన్సార్ ఆధారిత సాగు వంటి సాంకేతికతలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కుంకుమ పువ్వు ప్రాజెక్టు పరిశోధకుడు ప్రొఫెసర్ పెడిగం సైదయ్య, యూనివర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా, అసోసియేట్ డీన్ డాక్టర్ వీణ జోషి, నాబార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందువులంతా మరింత ఐక్యం కావాలి

## కేశవ స్ఫూర్తి కేంద్రాన్ని ప్రారంభించిన

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** హిందువులను సంఘటితం చేసేందుకే స్వయం సేవక్ సంఘ్‌ను కేశవ్ బలీరాం హెడ్గేవార్ స్థాపించారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందువులంతా మరింత ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కందకుర్తి దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షి ంచారు. నిజామాబాద్ జిల్లా త్రివేణి సంగమం కందకుర్తి గ్రామంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పర్యటించారు. ఈ సందర్భంగా కేశవ్ స్ఫూర్తి కేంద్రంలో ప్రతిష్టించిన ఆర్ఆర్ఎస్ వ్యవస్థాపకులు కేశవరావు బలిరాం పంత్ హెగ్డేవార్ విగ్రహం, భారత మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుష్పాలతో నమస్కరించారు. స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీలను పరిశీలించారు. విజిటర్ బుక్‌లో సందేశం రాశారు. స్ఫూర్తి కేంద్రాన్ని ప్రతి ఒక్క హిందువు సందర్శించాలని భగవత్ విజ్ఞప్తి చేశారు. చరిత్రను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలకులను భారత్ నుంచి తరిమికొట్టాలని హెగ్డేవార్ తపన పడ్డారని, ఆ కల నెరవేరిందని మోహన్ భగవత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ పెద్దలు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సత్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్‌బిఐ సూత్రప్రాయ అంగీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశాల్లో భారత్ కీలక స్థానంలో వుండడం తెలిసిందే. పట్టణ ప్రాంతాలు మొదలుకుని గ్రామీణ ప్రాంతాల వరకు 70 నుంచి 80 శాతం చెల్లింపులు నగదు రహితంగా (డిజిటల్ పేమెంట్స్) జరుగుతున్న ట్లు ఓ అధ్యయనంలో తేలింది. అయితే ఇదే సమయంలో డిజిటల్ పేమెంట్స్‌లో సైబర్ నేరగాళ్లు చొరబడి మోసాలకు దిగుతున్న ఘటనలూ పెరిగిపోతుండడం అన్ని వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ పేమెంట్స్ భద్రతా ప్రమాణాలను మరింత పెంచేందుకు సైబర్ సెక్యూరిటీ ని పుణులు చేసిన సిఫార్సులను ఆర్‌బిఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను కూడా ఆర్‌బిఐ ఖరారు చేసింది. డిజిటల్ పేమెంట్స్‌లో ఖాతాదారులకు పూర్తి భద్రతతో పాటు నియంత్రణ కల్పించేలా ఏర్పాటైన ప్రతిపాదనపై ప్రజలు, సంబంధిత వర్గాలు మే ఎనిమిదవ తేదీలోగా తమ అభిప్రాయాలు తెలపాలని ఆర్‌బిఐకి కోరింది.

# గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి కార్యక్రమాలు

## మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి

## కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ వర్నాలి

**హైదరాబాద్, ఏప్రిల్11, ప్రభాతవార్త:** గిరిజన ప్రాంతాలలో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ వర్నాలి దేకా అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల బలోపేత చర్యలపై కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని మాసాబ్ టాంక్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది.

రెండు రాష్ట్రాల్లో ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలలో తేడాలు, నిధుల వినియోగ విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా కేంద్ర డైరక్టర్ వర్నాలి మాట్లాడుతూ ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలన్నారు. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు.

గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషలలో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, మరియు ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో నూరుశాతం ఎస్సెస్సీ ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని తెలిపారు.

అంతేకాక, గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాల అభివృద్ధిపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పద్ధతులను గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయడానికి మధ్య మే నెలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సంతోష్, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ డైరక్టర్ డాక్టర్ వేమూరి సముజ్వల, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరక్టర్ హేమలత, ఇరు రాష్ట్రాల ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, ఉప ప్రాజెక్టు అధికారులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాలకు ప్రతిరూపం మోడీ పాలన

## 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుతో నవశకానికి నాంది డా. కె. లక్ష్మణ్



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఎంపి డా. కె.లక్ష్మణ్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్11, ప్రభాతవార్త:** నాడు మహాత్మా జ్యోతిరావుపూలే ఏ సామాజిక మార్పు కోసం పరితపించారో, నేడు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ ఆశయాలను అక్షరాలా అమలు చేస్తూ మహిళల సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని బిజెపి రాజ్యసభ సభ్యులు, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పూలే చిత్రపటానికి పూలమాల అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే దార్శనికతతోనే మహిళా విద్యకు పునాది పడిందని లక్ష్మణ్ గుర్తుచేశారు. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం ముందుకు వెళ్తుందనే బలమైన నమ్మకంతో జీవించిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని కొనియాడారు. అంటరానితనం, స్త్రీలపై ఉన్న సామాజిక కట్టుబాట్లను ఎదురించి, తన సతీమణి సావిత్రిబాయి పూలేకు విద్యను అందించి, 1848లోనే బాలికల కోసం దేశంలో తొలి పాఠశాలను స్థాపించిన ఘనత జ్యోతిబా పూలేకు చెందుతుందని పేర్కొన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో జ్ఞాన సంపద అందరికీ చేరాలని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల మహిళలు విద్యావంతులు కావాలని ఆయన ఆకాంక్షించారు. మహాత్మా జ్యోతిబా పూలే కలలను సాకారం చేస్తూ, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌కల్పించే నారీశక్తి వందన్ అధినియమ్‌ను మోడీ ప్రభుత్వం చారిత్రాత్మకంగా తీసుకువచ్చిందని లక్ష్మణ్ తెలిపారు. ఇది కేవలం రాజకీయ సంస్కరణ మాత్రమే కాకుండా, సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు దక్కాల్సిన రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా ఇందులో ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా నిజమైన సామాజిక న్యాయాన్ని మోడీ ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును దశాబ్దాల పాటు అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలదని లక్ష్మణ్ విమర్శించారు. 1996 నుండి 2010 వరకు అనేకసార్లు ఈ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరిగినప్పటికీ, కాంగ్రెస్ తన మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ వంటి మిత్రపక్షాల అడ్డంకుల వల్ల బిల్లు ముందుకు సాగలేదని అన్నారు. పార్లమెంటులోనే బిల్లును చింపివేసి మహిళలను అవమానించిన పార్టీలతో కాంగ్రెస్ ఇప్పటికీ కలిసి నడుస్తోందని విమర్శించారు. మహిళా హక్కుల పట్ల కాంగ్రెస్‌కు ఎప్పుడూ చిత్తశుద్ధి లేకుండా, కేవలం ఓట్ల రాజకీయమే వారి లక్ష్యంగా మారిందని ఆరోపించారు.

గత 11 సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం మహిళల అభివృద్ధి నుంచి మహిళా నేతృత్వంలోని అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లిందని డా.కె. లక్ష్మణ్ తెలిపారు.

# యుద్ధ దుస్తుల్లో ఒకరికి.. సూటుబూటుతో మరొకరికి

## పాక్ ఆర్మీచీఫ్ అసిమ్‌మునీర్ భిన్న స్వాగత దృశ్యాలు వైరల్

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** యుద్ధంతో ఉద్రిక్తతలు పెంచిన అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించింది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇరాన్ నేతలు ఆ దేశానికి చేరుకున్నారు. అయితే పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కాకుండా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఇరు దేశాల ప్రతినిధులకు స్వాగతం పలకడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబాఫ్, ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ నేతృత్వంలోని 71 మంది సభ్యుల ప్రతినిధి బృందానికి అసిమ్ మునీర్ స్వాగతం పలికారు. యుద్ధ దుస్తులైన కంబాట్ డ్రెస్‌లో ఆయన కనిపించారు. కొన్ని గంటల తర్వాత అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం నూర్ ఖాన్ వైమానిక స్థావరానికి చేరుకున్నది. ఈ సందర్భంగా అసిమ్ మునీర్ సూటు, బూటు ధరించి వారికి స్వాగతం పలికారు. ఇరాన్, అమెరికా ప్రతినిధుల స్వాగతం సమయంలో అసిమ్ మునీర్ ఇలా విభిన్న డ్రెస్‌లో కనిపించడం, ప్రోటోకాల్‌ను పాటించకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు జేడీ వాన్స్‌ను కలిసిన సందర్భంగా నల్ల సూటు ధరించిన అసిమ్ మునీర్, తనను తాను రాజనీతిజ్ఞుడిగా చూపించుకునేందుకు ప్రయత్నించినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం సందర్భంగా కూడా మునీర్ సూటు ధరించారు. తనకు అత్యంత ఇష్టమైన ఫీల్డ్ మార్షల్ అని ట్రంప్ ఆయనను ప్రశంసించారు. అయితే 2024లో క్షిపణి దాడులు, సరిహద్దు ఘర్షణలతో ఇరాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అసిమ్ మునీర్ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్ ప్రతినిధులకు కంబాట్ డ్రెస్‌లో స్వాగతం పలికినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. అమెరికాతో దోస్తీ, ఇరాన్‌కు హెచ్చరిక సందేశాన్ని ఆయన ఇచ్చినట్లుగా అంచనా వేస్తున్నారు. పాక్ అధికార కేంద్రంలో తానే కీలకమన్న సందేశాన్ని ఆ దేశ ప్రజలతో పాటు ప్రపంచానికి కూడా అసిమ్ మునీర్ ఇలా తెలియజేసినట్లు రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

# ఆత్మను చంపుకొని కేసిఆర్ పంచకు చేరిన జీవన్‌రెడ్డి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్11, ప్రభాతవార్త:** జీవన్‌రెడ్డి ఆత్మను చంపుకుని కెసిఆర్ ను కౌగిలించుకున్నాడనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసరెడ్డి అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ జీవన్ రెడ్డి తన ఆత్మాభిమానాన్ని వదులుకున్నాడనీ విమర్శించారు. రాజకీయం గా నాలుగు దశాబ్దాల నుంచి అండగా నిలబడిన పార్టీని వదిలిపెట్టి కెసిఆర్ విష కౌగిలిలోకి జీవన్ రెడ్డి వెళ్లారనీ దుయ్యబట్టారు ఆయన విష కౌగిలిలో చిక్కుకుని బలై ఇప్పుడు కనిపించకుండా పోయిన సీనియర్ల నాయకులను జీవన్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలనీ కోరారు. కెసిఆర్ రాక్షస, అవినీతి పాలన పైన 10 ఏళ్ల పాటు అలుపెరగని పోరాటం చేశానని చెప్పుకుంటున్న జీవన్ రెడ్డి ని దేవుడు ఎలా కలిసి పనిచేయమని పంపిస్తాడు..? అని ఆయన నిలదీశారు. అవినీతి పరులు, నియంతలతో కలిసి పనిచేయమని ఏ దేవుడైనా చెపుతాడా..? రేవంత్ రెడ్డి పోవాలని కెసిఆర్ రావాలని ఈ రాష్ట్రంలో ఏ సామాన్యుడైనా అన్నాడా..? అని ప్రశ్నించారు. కెసిఆర్ అనే చీడ పురుగును తెలంగాణ ప్రజలు వదిలించుకున్నారని ఆయన భాష్యంచెప్పారు. పదేళ్ల నిరంకుశ పాలనకు చెరమగీతం పాడి ప్రజా పాలన తెచ్చుకున్నారనీ కెసిఆర్ , బిఆర్ఎస్ పార్టీ మాకు వద్దని గత రెండేళ్లలో జరిగిన ప్రతి ఎన్నికల్లో జనం తీర్పు ఇచ్చారనీ ఆయన తెలిపారు. కెసిఆర్‌కు ఇచ్చిన గుండు సున్నాలు, కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి వచ్చిన మార్కులు జీవన్ రెడ్డి కి తెలియవా..? ఈ రాష్ట్రానికి కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ వద్దే వద్దని ఆయన సొంత బిడ్డ కవితనే చెపుతోందనీ ఆయన తెలిపారు.

# ఎల్లారెడ్డిపేటలో ఎటిఎం మెషిన్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

## పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే సాహసం

## జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన

**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో దుండగులు బరితెగించారు. చిల్లర దొంగతనాలకు స్వస్తి పలికి ఏకంగా నగదుతో ఉన్న ఏటీఎం మెషిన్‌నే పెకిలించుకుని తీసుకెళ్లిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను లక్ష్యంగా చేసుకుని ఈ భారీ దోపిడీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డారు. గ్యాస్ కట్టర్లతో మెషిన్‌ను కట్ చేసే ప్రయత్నం చేయకుండా, ఏకంగా మెషిన్‌ను పెకిలించి ముందుగా సిద్ధం చేసుకున్న వాహనంలో ఎక్కించుకుని పరారయ్యారు. శనివారం ఉదయం ఏటీఎం షట్టర్ తెరిచి ఉండటం, లోపల మెషిన్ లేకపోవడాన్ని గమనించిన స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మెషిన్‌లో భారీ మొత్తంలోనే నగదు ఉన్నట్లు సమాచారం ఘటనపై సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ మహేష్ బిగితే సంఘటనా స్థలానికి చేరుకుని స్వయంగా పరిశీలించారు.

ఏటీఎం కేంద్రంలో భద్రతా లోపాలపై అధికారులను ఆరా తీశారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ మరియు ఫింగర్ ప్రింట్ నిపుణులు ఘటనా స్థలంలో కీలక ఆధారాలను సేకరించారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్పీ ప్రత్యేకంగా 5 బృందాలను రంగంలోకి దించారు. దుండగులు వాడిన వాహనం, వారు వచ్చిన మార్గాన్ని గుర్తించేందుకు పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పక్కా ప్లాన్‌తోనే ఈ దొంగతనం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇంతటి సాహసోపేతమైన చోరీ జరగడంపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కపల్లి గ్రామ శివారులో ఏ టి ఎమ్ మిషన్ ఆచూకీ లభ్యం..... దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు... ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఏటీఎం చోరీ ఉదంతం కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఎస్ బి ఐ ఏటీఎం మిషన్‌ను పెకలించి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అయితే, నిందితులు మిషన్‌లోని నగదుతో కూడిన లాకర్‌ను మాయం చేసి, మిగిలిన మిషన్ బాడీని అక్కపెల్లి గ్రామ శివార్లలోని బుగ్గరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి పక్కన పడేసి వెళ్లారు. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో జిల్లా ఎస్పీ మహేష్ బిగితే, సీఐ వెంకటేష్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు.



# సైబర్ మోసాల నివారణకు సైబర్ సెక్యూరిటీ నిపుణుల కీలక సూచనలు

డిజిటల్ పేమెంట్స్‌లో ఖాతాదారులు కొత్త వ్యక్తి పది వేల రూపాయల కు మించి నగదు బదిలీ చేస్తే సదరు లావాదేవీని గంట పాటు నిలిపివేసే విధంగా కొత్త విధానాలు రానున్నాయి. అనుమానాస్పద లావాదేవీలను వి నియోగదారులు సకాలంలో గుర్తించి రద్దు చేసుకునేందుకు వీలుగా గంట సమయం కేటాయించారు. తరచూ డిజిటల్ పేమెంట్స్ జరిపే వారికి కొత్త నిబంధనల వల్ల మరింత మేలు జరుగుతుందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు 70 ఏళ్లు పైబడిన వయో వృద్ధులతో పాటు దివ్యాంగుల ఖాతాదారులకు మరింత భద్రత కల్పించేందుకు ట్రస్టెట్ పర్సన్ (నమ్మకమైన వ్యక్తి) పేరిట కొత్త విధానాన్ని తీసుకువచ్చేందుకు సె క్యూరిటీ నిపుణులు చేసిన సూచనలకు ఆర్‌బిఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇందులో భాగంగా నగదు బదిలీ చేయాలనుకునేవారు 50 వేల రూపాయలకు మించి డిజిటల్ పేమెంట్స్ చేయాలంటే ముందుగా ఎంచుకున్న ట్రస్టెట్ పర్సన్ ఆమోదం తప్పనిసరి. సదరు వ్యక్తిని ట్రస్టెడ్ పర్సన్ జాబితా నుంచి తొలగించాలనుకుంటే 24 గంటల సమయం తీసుకోవాల్సి వుంటుంది. ఇక సైబర్ నేరగాళ్ల ఆగడాలను నిలువరించేందుకు తమ ఖా తాలో మోసం జరిగిందని ఖాతాదా రులకు అనుమానం వచ్చిన వెంటనే తదుపరి డిజిటల్ లావాదేవీలు జరగకుండా వుండేందుకు కిల్ స్విచ్ సదుపాయం అందుబాటులో రానుంది. మొబైల్ యాప్ లేదా హెల్ప్‌లైన్ నంబరు నుంచి ఈ సేవలను పొందేందుకు వీలుంటుంది.

కిల్ స్విచ్ బటన్‌ను వినియోగించడం ద్వారా యూపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలన్నీ వెంటనే ఆగిపోతాయి. ఇక బ్యాంకుల్లో కొత్త ఖాతా లు తెరిచినపుడు డిఫాల్ట్‌గా యూపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను కొంతకాలం ఆపివేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఖాతా దారుల అభ్యర్థన మేరకు ఈ సేవలను అందుబాటులోకి తేవాలని ఆర్‌బిఐ చెబుతోంది. ఇక సైబర్ నేరగాళ్లు తమ గోల్‌మాల్ వ్యవహారాలను మ్యూల్ ఖాతాల ద్వారానే నడుపుతుంటారనేది తెలిసిందే. తక్కువ టర్నోవర్ ఖాతాల్లోకి వచ్చే వార్షిక జమాలపై 25 లక్షల రూపాయల పరిమితి విధించాలని ఆ ర్‌బిఐ ప్రతిపాదించింది. అంతకు మించి ఖాతాల్లో లావాదేవీలు జరిగితే వాటిపై నిఘా వుంచాలని, అవసరం అయితే వీటిని బ్లాక్ చేసి, సదరు ఖా తాదారులపై విచారణ చేయాలని సైబర్ సెక్యూరిటీ నిపుణుల సూచనలను ఆర్‌బిఐ అంగీకరించింది. గడచిన పదేళ్ల కాలంలో డిజిటల్ లావాదేవీలు 38 రెట్లు పెరిగినట్లు ఆర్‌బిఐ నివేదిక చెబుతోంది. ఇదే సమయంలో సైబర్ నేరాలు కూడా పెరిగాయి.

2021లో 2.6 లక్షలుగా వున్న సైబర్ నేరా లు 2025 నాటికి 28 లక్షలకు పెరగడం గమనార్హం. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్ గణాంకాల ప్రకారం 2021లో సైబర్ నేరాల వల్ల జరిగిన నష్టం 551 కోట్ల రూపాయలు కాగా 2025లో ఇది 22,931 కోట్ల రూపాయలకు పెరిగింది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ లావాదేవీల్లో అక్రమాలను నిరో ధించేందుకు సైబర్ సెక్యూరిటీ నిపుణులు కీలక సూచనలు చేశారు.

# దేశ రాజధానిలో పెట్రోలు బైక్ రిజిస్ట్రేషన్ బంద్!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై పోరులో భాగంగా బీజేపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. నగరంలో పెట్రోల్ టూవీలర్ల వినియోగాన్ని దశలవారీగా తగ్గించే లక్ష్యంతో కొత్త ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పాలసీ ముసాయిదాను శనివారం విడుదల చేసింది. ఈ ముసాయిదా ప్రకారం 2028 ఏప్రిల్ 1 నుంచి దేశ రాజధానిలో కొత్త పెట్రోల్ టూవీలర్ల (బైకులు, స్కూటర్లు) రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపివేయనున్నారు. ముందుగానే, 2027 జనవరి 1 నుంచే కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించనున్నారు. 2030 నాటికి ఢిల్లీని పూర్తిస్థాయి ఈవీ నగరంగా మార్చడమే లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. ప్రజలను ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీ రాయితీలను ప్రకటించింది. మొదటి ఏడాదిలో ఈవీ టూవీలర్ కొనుగోలు చేసేవారికి రూ.30,000 వరకు సబ్సిడీ, రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వనున్నారు. అలాగే, పాత పెట్రోల్ వాహనాన్ని తుక్కుగా మార్చి కొత్త ఈవీ కొంటే అదనంగా రూ.10,000 ప్రోత్సాహకం అందిస్తారు. ప్రతి ఈవీ డీలర్ వద్ద పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ తప్పనిసరి చేయడంతో పాటు, ఇళ్ల వద్ద ఛార్జింగ్ పాయింట్ల కోసం సింగిల్ విండో విధానం తీసుకురానున్నారు. ప్రస్తుతం ఇది ముసాయిదా దశలోనే ఉంది. ఈ పాలసీపై ప్రజల నుంచి అభిప్రాయాలను 2026 మే 1 వరకు స్వీకరించి, ఆ తర్వాత ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఢిల్లీలో శీతాకాలంలో పెరిగే వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు 23 శాతం కారణమవుతున్నాయని అంచనా. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.



# సిరిసిల్ల మగ్గంపై 'బంగారు' అద్భుతం

## కేవలం 2 గ్రాముల గోల్డ్‌తో వెండి వెన్నెల చీరె

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** సిరిసిల్ల నేతన్న నైపుణ్యం మరోసారి విశ్వరూపం చూపింది. అగ్గిపెట్టెలో పట్టే చీర, ఉంగరంలో దూరే వస్త్రంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఈ గడ్డపై, తాజాగా మరో అద్భుత కళాఖండం ఆవిష్కృతమైంది. ప్రముఖ చేనేత కళాకారుడు, ఖినేనేత కళారత్నఖి అవార్డు గ్రహీత నల్ల విజయ్, కేవలం 2 గ్రాముల బంగారం, 2 గ్రాముల వెండిని ఉపయోగించి అత్యంత ఆకర్షణీయమైన ఖిబంగారు పూల చీరఖిను నేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు.

**25 రోజుల తపస్సు.. 85 వేల ఖర్చు**

హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త కోరిక మేరకు విజయ్ ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా కిలోల కొద్దీ బంగారం వాడితేనే భారీ డిజైన్లు వస్తాయి, కానీ విజయ్ తన మేధస్సుతో కేవలం 2 గ్రాముల బంగారాన్ని, రెండు గ్రాముల వెండి ని అత్యంత సన్నని తీగలుగా మార్చి, 5.5 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు కలిగిన చీరను రూపొందించారు. సుమారు 25 రోజుల పాటు అహర్నిశలు శ్రమించి, 85 వేల వ్యయంతో ఈ కళాఖండాన్ని తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా ఈ చీరను ఆవిష్కరించారు.

ఆట

# హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్ కింగ్

## భారీ స్కోరును ఊదేశారు □ ప్రియాన్స్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్, శ్రేయాస్ అర్ధసెంచరీలు



*భారీస్కోరు చేసినా సరిపోలేదు. పరుగుల పోటీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వెనకబడింది. రన్స్ తుఫానులో పంజాబ్‌దే పైచేయి అయింది. 220 పరుగుల స్కోరును కూడా ఉఫ్‌మని ఊదేసింది. యంగ్ డైనమైట్స్ ప్రియాన్స్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ సుడిగాలి ఆరంభానికి శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్ తోడవడంతో మరో ఏడు బంతులుండగానే అద్భుత విజయం అందుకుంది. తన అజేయ జైత్రయాత్రను పంజాబ్ కింగ్స్ కొనసాగిస్తూ మూడో విక్టరీ ఖాతాలో వేసుకుంది. భారీ స్కోరు చేసినా సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. మూడో పరాజయాన్ని మూటగట్టుకుంది.*

**న్యూచండీఘర్:** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మూడో ఓటమి ఎదురైంది. బ్యాటర్లు మెరిసినా.. బౌలర్ల వైఫల్యం హైదరాబాద్ కొంపముంచింది. ఆరెంజ్ ఆర్మీ నిర్దేశించిన 220 పరుగులు ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాన్స్ ఆర్య(20 బంతుల్లో 57), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(25 బంతుల్లో 51) ఆకాశమే హద్దుగా చెలరేగారు. పోటా పోటీగా బౌండరీలు, సిక్స్‌లు బాది లక్ష్యాన్ని కరిగించారు. తొలి వికెట్‌కు 6.2 ఓవర్లలోనే 99 రన్స్ జోడించారు. ఎట్టకేలకు ఈ ప్రమాదకరమైన ద్వయాన్ని శివాంగ్ కుమార్ విడదీశాడు. 16 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసిన ప్రియాన్స్‌ను వెనక్కి పంపాడు. మరో ఎండ్‌లో మిడాఫ్‌లో సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ప్రభ్‌సిమ్రన్‌ను తరువాతి ఓవర్లో బౌండరీ వద్ద క్లాసెన్ క్యాచ్‌తో శివాంగ్ అవుట్ చేశాడు. డేంజరస్ కాన్నోలి(11)ని సైతం ఔట్ చేసిన శివాంగ్.. హైదరాబాద్‌కు ఆశలు రేపాడు. వరుసగా మూడు ఓవర్లలో శివాంగ్ మూడు వికెట్లు తీశాడు.

కష్టాల్లో పడ్డ పంజాబ్ కింగ్స్‌ను శ్రేయాస్ అయ్యర్(33 బంతుల్లో 69 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. హర్షలే పటేల్ ఓవర్లో 6, 4, 6తో దుమ్మురేపిన శ్రేయాస్.. ఇషాన్ మలింగ ఓవర్లో 4, 6తో సన్‌రైజర్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. అర్ధసెంచరీ పూర్తి చేయడమే గాక 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో చివరి వరకు అజేయంగా నిలిచాడు. నేహాల్ వధేరా(14)తో కలిసి నాలుగో వికెట్‌కు వేగంగా 69 రన్స్ జోడించి గెలుపుకు బాటలు వేశాడు. శశాంక్ సింగ్(16)తో కలిసి మరో 7 బంతులుండగానే విజయం పూర్తిచేశాడు. అభిషేక్ బంతిని బౌండరీకి తరలించి శ్రేయాస్ విన్నింగ్ షాట్ ఆడాడు. దీంతో పంజాబ్ కింగ్స్ ఆరు వికెట్ల తేడాతో మూడో విజయం అందుకుంది.



సన్‌రైజర్స్ బౌలర్లలో శివాంగ్ కుమార్ మూడు వికెట్లు, హర్షలే దూబే ఓ వికెట్ పడగొట్టారు.

అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్(28 బంతుల్లో 74), ట్రావిస్ హెడ్(23 బంతుల్లో 38) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ విధ్వంసక బ్యాటింగ్‌తో విరుచుకుపడి 8 ఓవర్లలోనూ 120 పరుగులు అందించారు. వీరి మెరుపులతో సన్‌రైజర్స్ స్కోరు 250 అలవోకగా కొట్టేలా కనిపించింది. ఈ దశలో శశాంక్‌సింగ్ రెండు బంతుల తేడాతో అభిషేక్, హెడ్‌లను అవుట్ చేశారు. ఆ తర్వాత మిడిలార్డర్ ఒక్కసారిగా తడబడింది. ఇషాన్ కిషన్(27), అంకిత్ వర్మ(18), సలిల్ అరోరా(9) ధాటిగా ఆడడంలో విఫలమయ్యారు. హెన్రిచ్ క్లాసెన్(39) రాణించినా వేగంగా స్కోరు సాధించలేకపోయాడు. దీంతో హైదరాబాద్‌ను నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 219కే పరిమితమైంది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో శశాంక్ సింగ్, అర్షదీప్ సింగ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు.

### అభిషేక్ పాంచ్ పటాకా

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ... పంజాబ్ కింగ్స్ బౌలర్లపై చెలరేగాడు. 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఐపీఎల్ చరిత్రలో 20 లోపు బంతుల్లో 5 హాఫ్ సెంచరీలు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా అభిషేక్ శర్మ రికార్డు నెలకొల్పాడు.

అర్షదీప్ తొలి బంతికి కవర్స్ మీదుగా బౌండరీతో పరుగుల ఖాతా ఆరంభించిన అభిషేక్.. రెండో ఓవర్ వేసిన బార్ట్‌లెట్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో అలరించాడు. ఇక అర్షదీప్ మూడో ఓవర్‌లో నైతే చెలరేగి ఆడాడు. రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 24 రన్స్ సాధించాడు. అలాగే వైశాఖ్ స్పిన్ బంతుల్లోనైతే స్టాండ్స్‌లోకి పంపాడు. ఏకంగా నాలుగు సిక్స్‌లు బాది 24 రన్స్ పిండుకున్నాడు. ఇక బార్ట్‌లెట్ ఓవర్‌లో ఓ సిక్స్, చాహల్ ఓవర్‌లో ఓ సిక్స్‌తో అలరించిన అభిషేక్ 28 బంతుల్లో 74 రన్స్ చేశాడు. అందులో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉన్నాయి.

ఈ క్రమంలో 18 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన అభిషేక్‌కు ఇది అయిదో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ. అభిషేక్ శర్మ గతంలో 16 బంతుల్లో ఓసారి.. 18 బంతుల్లో రెండు సార్లు, 19 బంతుల్లో మరో రెండు సార్లు హాఫ్ సెంచరీలు బాదాడు. అభిషేక్ తర్వాతి స్థానంలో నికోలస్ పూరన్ 4 సార్లు ఈ ఫీట్ సాధించాడు. వైభవ్ సూర్యవంశీ అయితే ఈ సీజన్లో రెండుసార్లు కూడా 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీలు నమోదుచేశాడు. ఐపీఎల్‌లోనే వేగవంతమైన అర్ధశతకం రాజస్థాన్ ఓపెనర్ యశస్వీ పేరు మీద ఉంది. 2023లో అతడు కోల్‌కతాపై కేవలం 13 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేశాడు.

## సెంచరీతో మెరిసిన సంజూ

### చెన్నై గెలుపు బోణీ



**చెన్నై:** ఐపీఎల్2026లో తొలి సెంచరీ నమోదైంది. చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. తొలి మూడు మ్యాచ్‌లలో సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమైన సంజూ.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఢిల్లీ బౌలర్లను తన ట్రేడ్ మార్క్ షాట్లతో సంజూ ఉతికారేశాడు. కేవలం 52బంతుల్లోనే 15ఫోర్లు, 4 సిక్స్‌లతో 115 పరుగులతో అజేయంగా నిలిచాడు. సంజూ నాలుగో ఐపీఎల్ సెంచరీ మార్కును అందుకున్నాడు. తొలి వికెట్‌కు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(15)తో 62 రన్స్, రెండో వికెట్‌కు ఆయుష్ మాత్రే(36 బంతుల్లో 59)తో 113 రన్స్ జోడించాడు. చివర్లో శివమ్ దూబే 10 బంతుల్లో 20 రన్స్ సాధించాడు. దీంతో సీఎస్‌కే 20 ఓవర్లలో 2 వికెట్లకు 212 పరుగుల భారీ స్కోరు చేసింది.

213 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు రాహుల్(18)తో కలిసి నిస్సాంక(41) 61 పరుగుల శుభారంభం అందించాడు. ఆ తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. సమీర్ రిజ్వీ(6), అక్షర్(1), డేవిడ్ మిల్లర్(17) నబీ(4) విఫలమయ్యారు. స్లాగ్ ఓవర్లలో ట్రిస్టన్ స్టబ్ ఒంటరిపోరాటం చేశాడు. అర్ధ సెంచరీతో రాణించాడు. చెన్నై సూపర్‌కింగ్స్ ఎట్టకేలకు గెలుపు బోణీ చేసింది.

## ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు

| | |
|---|---|
| లక్నో సూపర్ జెయింట్స్ V/S గుజరాత్ టైటాన్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు |
| ముంబై ఇండియన్స్ V/S ఆర్సీ బెంగళూర్ | రాత్రి 7.30 గం.లకు |

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ తలపడతాయి. ముకుల్ చౌదరి మ్యాచ్ ఫినిషింగ్‌తో గెలుపు జోష్‌లో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్... సొంతగడ్డపైనా అదే జోరు కొనసాగించాలని చూస్తోంది. మరోవైపు ఒకే మ్యాచ్ నెగ్గిన గుజరాత్ టైటాన్స్ గెలుపుపై ఫోకస్ పెట్టింది.

రెండో మ్యాచ్ వాంఖడే స్టేడియం వేదికగా రాత్రి 7.30 గంటలకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడతాయి. ఇరుజట్ల లోనూ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి స్టార్‌ఆటగాళ్లు ఉండడంతో మ్యాచ్ ఉత్కంఠ రేపుతోంది. రెండు జట్లు కూడా తమ చివరి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడాయి.

## ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆయుష్



**నింగ్బో:** అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన భారత యువ సంచలనం ఆయుష్ శెట్టి ఫైనల్లోకి దూసుకెళ్లి సంచలనం సృష్టించాడు. చైనాలోని నింగ్బో వేదికగా జరుగుతోన్న ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్లో నంబర్‌వన్ ప్లేయర్ కున్లావుత్ వితిద్సర్న్(థాయ్‌లాండ్)కు షాకిచ్చాడు. తొలి సెట్‌ను 10–21తో చేజార్చుకున్న ఆయుష్.. ఎక్కడా నిరుత్సాహ పడకుండా విజయం సాధించేవరకూ పోరాడాడు. హోరాహోరీగా సాగిన తరువాతి రెండు సెట్లను 21–19, 21–17 తేడాతో ఆయుష్ గెలిచాడు. గంటా 15 నిమిషాల పాటు సెమీస్‌జరిగింది. ఈ క్రమంలో ఆయుష్ ఓ అరుదైన ఘనతను సాధించాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరిన రెండో భారత షట్లర్‌గా నిలిచాడు. 1965లో దినేశ్ ఖన్నా మొదటిసారి భారత్ తరఫున ఫైనల్‌కు చేరారు. ప్రి క్వార్టర్‌లో, క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో మేటి ఆటగాళ్లను ఓడించారు. ఫైనల్లో చైనాకు చెందిన రెండో సీడ్ షియాక్‌తో తలపడతాడు. ఒకవేళ ఫైనల్‌లోనూ ఆయుష్ షెట్టి గెలిచి టైటిల్ సాధిస్తే మాత్రం రికార్డు సృష్టిస్తాడు. ఈ ఘతన సాధించిన తొలి భారత షట్లర్‌గా నిలుస్తాడు.

# ఐదుశాతం పెరిగిన అసెట్ కంపెనీల షేర్లు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల షేర్లు ఈ వారాంతంలో ఐదుశాతానికి పైగా పెరిగాయి. కెనరా రెబోకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ షేర్లు ఎక్కువ లాభపడ్డాయి. 265 రూపాయలవద్ద ట్రేడ్ అయి 4.2శాతం ఎగబాకాయి. హెచ్‌డిఎఫ్‌సి ఎఎంసి షేర్లు కూడా 4 శాతంపెరిగి రూ.2611కి చేరాయి. అలాగే నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ కపెనీ షేర్లు 3.9శాతంపెరిగి రూ.945కి చేరాయి. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఎఎంసి 3.6 శాతం పెరిగి 1003కి చేరింది. యుటిఐ అసెట్‌మేనేజ్ మెంట్‌కంపెనీ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ అసెట్‌మేనేజ్‌మెంట్‌పెనీ షేర్లు కూడా నిలకడగా కొనసాగాయి. రూ.314వద్ద సానుకూలధోరణిలోనే ట్రేడ్ అయ్యాయి. మూచువల్‌ఫండ్స్ అసోసియేషన్ ఆంఫీ డేటా ప్రకారం ఈక్విటీ మూచువల్‌ఫండ్స్‌లోకి పెట్టుబడులు 56శాతంపెరిగి 40,450 కోట్లు ఒక్కనెలలోనే వచ్చినట్లు తేలింది.

ఫిబ్రవరిలో అయితే 25,977 కోట్లువచ్చాయి. వార్షిక పద్ధతిలో అయితే పెట్టుబడులు 61శాతం పెరిగాయి. ఫ్లెక్సీక్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోనే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. విదేశీ పెట్టుబడుల విత్‌డ్రాలు ఉన్నప్పటికీ ఆంఫీ గణాంకాలు చూస్తే ఈక్విటీల్లో ఇన్వెస్టర్లకు నమ్మకం పెరిగిందని గ్లోబలకేపిటల్‌ప్రతినిధి గౌరవ్ శర్మ అన్నారు. పెట్టుబడుల విత్‌డ్రాల్లో ఎఫ్‌ఐఐలు ఆసక్తిచూపించినపుడు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు అండగా నిలిచారని అన్నారు. హెచ్‌డిఎఫ్‌సి ఎఎంసి అయితే స్వల్ప వ్యవధిలోనే 15శాతం పెరిగింది. నిప్పన్‌లైఫ్ ఎఎంసి కూడా పటిష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సిప్ పెట్టుబడులు కూడా 32,087కోట్లకుపెరిగాయి. డివిడెండ్ రాబడులు, ఇఎల్‌ఎస్‌ఎస్ ఫండ్స్ కొంతమేర విత్‌డ్రాలు న్నప్పటికీ గోల్డ్ ఈటిఎఫ్‌లకు 2266 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఆర్థికసంవత్సరం చివరికి ఆంఫీ నిర్వహణ ఆస్తులు మొత్తం 73.73 లక్షల కోట్లుగా ఉన్నాయని, ఫిబ్రవరిలో ఉన్న 82.03 లక్షలకోట్లకంటే తగ్గినట్లు ఆయన తెలిపారు.

# 19 నెలల్లో 725 రెట్లు పెరిగిన షేర్లు

## అవకతవకలపై సెబీ దర్యాప్తు □39 మంది వ్యక్తులు, సంస్థలపై వేటు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ఆర్‌ఆర్‌పీ సెమికండక్టర్ లిమిటెడ్ సంస్థల ట్రేడింగ్‌లో జరిగిన అవకతవకలకు సంబంధించి దర్యాప్తునిర్వహించిన సెబీ 39 మంది వ్యక్తులు, సంస్థలను ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ చేయకుండా నిలిపివేసింది. అంతేకాకుండా అనుచిత లబ్ధిని పొందారన్న ఆరోపణలు రుజువు కావడంతో రూ.2 కోట్లు జరిమానా కూడా విధించింది కంపెనీ షేరు ధరలు ఒక్కసారిగా అనూహ్యరీతిలో పెరగడమే ఈ అనుమానాలు, విచారణలకు తావిచ్చింది.

2024 ఏప్రిల్‌లో రూ.15 ఉన్న షేరు ధరలు 2025 అక్టోబరునాటికి రూ.10,887.10కి ఎలా పెరిగాయన్న అంశంపై విచారణచేసింది. అంటే 725 రెట్లు కేవలం 19 నెలల్లోనే పెరగడంపై సెబీ దృష్టిసారించింది. ఈకాలంలోనే కంపెనీ తన తొలి గుర్తింపు జిడిట్రేడింగ్ అండ్ ఏజెన్సీస్‌నుంచి సెమికండక్టర్ ఫోకస్ సంస్థగా నిలిచింది. ప్రాధాన్యతా కేటాయింపుల కింద 1.35 కోట్ల షేర్లను రూ.12 చొప్పున కేటాయించింది. ఆ తర్వాత



ప్రమోటర్ వాటా 1.28శాతానికి పడిపోయింది పబ్లిక్ షేర్ హోల్డింగ్ ఒక్కసారిగా 98.72 శాతానికిపెరిగింది. ఈ దర్యాప్తులో చోదంకర్‌కు ఎక్కువ షేర్లు కేటాయించారని తేలింది. సుమారు 1.01 కోట్ల వాటాలు కేటాయించారు. కంపెనీ విస్తరించిన మూలధనంలో ఈ మొత్తం కేటాయింపు విలువ 74.5శాతంగా ఉంటుంది. అన్ని సమగ్ర రికార్డులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించిన తర్వాత సెబీ ఈ ఆదేశాలు జారీ చేసింది. చోదంకర్, ఇతర అనేకమంది కేటాయింపుదార్ల రికార్డులను కూడా పరిశీలించింది.

లాస్ట్‌ట్రేడెడ్ ప్రైస్ పై వీరి ప్రభావం వందల రెట్లు పెరిగిందని, అందువల్లనే ప్రాథమికంగా ట్రేడ్‌లో ఉద్దేశ్యపూర్వకంగాషేరుధరలు పెంచినట్లు గుర్తించింది. డిపాజిటర్లు ఈ కంపెనీలో ఉన్న తమ వాటాలను వెంటనే స్తంభింపచేసుకోవాలని వెల్లడించింది. మల్టిప్లయర్ షేర్ అండ్ స్టాక్ అడ్వయిజర్స్ సంస్థకు రూ.59.47 లక్షలు, పేస్ స్టాక్‌బ్రోకింగ్ సర్వీసెస్ సంస్థపై 1.26కోట్లు, నియో అపెక్స్ వెంచర్ ఎల్‌ఎల్‌పి సంస్థపై 14.66 లక్షలుచొప్పున సెబీ ఇంపౌండింగ్ ఉత్తర్వులు జారీచేసింది.





## బ్లాక్‌రాక్ 200కోట్ల డాలర్ల ఐపిఒ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** బ్లాక్‌స్టోన్ ఇంక్ ఐపిఒకోసం ఎస్‌ఇసికి చేసిన దరఖాస్తులు ఆమోదం పొందాయి. ఎఐకి పెరుగుతున్న బూమ్‌లో కొత్త డేటా సెంటర్ల కొనుగోళ్లకుగాను ఈనిధులు వినియోగించాలని కంపెనీ నిర్ణయించింది. బ్లాక్‌స్టోన్ ఇన్‌ఫ్రా ట్రస్టు ఇంక్ పేరిట ఏర్పాటయిన కొత్తసంస్థతో కొత్తగా నిర్మించిన డేటా సెంటర్లను కొనుగోలుచేస్తుంది. రెండుసంస్థలను ఒకటి 250 మిలియన్ డాలర్లు, మరోటి 1.5 బిలియన్ డాలర్లుగా విలువల మదింపు జరిగింది. ఈ సంస్థలనుంచి సాలీనా 5.75శాతంనుంచి ఏడు శాతం వరకూ రిటర్నులు రావచ్చని అంచనా. ఇక అద్దెలరూపంలో కూడా మరో రెండునుంచి మూడుశాతం సాలీనా పెరుగుతుందని దరఖాస్తులో వెల్లడించింది. ఈ ఐపిఒ ద్వారా 200 కోట్ల డాలర్లను సమీకరించాలని బ్లాక్‌స్టోన్ నిర్ణయించింది. ఇప్పటికే సావరిన్ వెల్త్‌ఫండ్స్‌ను కూడా సంప్రదించింది. భారీ స్థాయి ఇన్వెస్టర్లనుంచి మరింతగా నిధులు రాబట్టుకోవాలని చూస్తోంది. 1.3 లక్షలకోట్ల డాలర్ల విలువైన ప్రత్యామ్నాయ అసెట్ మేనేజ్‌మంట్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఎఐ ఇన్‌ఫ్రా ఉన్న సంస్థగా మారాలని చూస్తోంది. ఇప్పటికే డేటా సెంటర్లపై వందలకోట్ల డాలర్ల పెట్టుబడులుపెట్టింది. ఎఐ ఇన్‌ఫ్రాకు భూమి, ఇంధనం, మూలధనం రూపేణా ఎక్కువ వనులు అవసరం అవుతాయి. అయితే ఈ బ్లాక్‌స్టోన్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ నిర్మాణక్రమం మొత్తం రియల్‌ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్‌ట్రస్ట్‌ను పోలి ఉంది.

## టాటాసన్స్ లిస్టింగ్ చేయాల్సిందే!

**ముంబయి, ఏప్రిల్ 11:** టాటాగ్రూప్‌ప్రధాన సంస్థ టాటాసన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజిల్లో మోదుచేయాలన్న అంశంపై షాపూర్‌జీ పల్లోంజీ గ్రూపు పట్టుపడుతోంది. నిబంధనల సమ్మతికోసం కాదని, ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడుతుందని ఎస్పీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ తెలిపారు. టాటాసన్స్‌ను నమోదుకు తెచ్చే అంశంలో కేంద్రం, ఆర్బీఐ సరైన నిర్ణయంతో ఉంటాయన్న నమ్మకం తనకు ఉందన్నారు. టాటాసన్స్ లిస్టింగ్ వల్ల టాటాట్రస్ట్స్ ప్రయోజనాలు దెబ్బతింటాయని కానీ లబ్ధిదారులకు సేలందించే సామర్థ్యం తగ్గుతుందని స్పష్టమైన ఆధారాలేవీ సంబంధిత ప్రతినిధులు ఇవ్వలేకపోయారన్నారు. టాటాట్రస్ట్ చెందిన ఇద్దరుట్రస్టీలు వేణుశ్రీనివాసన్, విజయ్‌సింగ్‌లు టాటాసన్స్ లిస్టింగ్‌కు సానుకూలంగా ఉన్న క్రమంలో మిస్త్రీ వ్యాఖ్యలుచేయడం గమనార్హం. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ మాత్రం లిస్టింగ్‌కు విముఖంగా ఉన్నారు. అతిపెద్ద ఎన్‌బిఎఫ్‌సి అయిన టాటాసన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజిల్లో నమోదుచేయడం వల్లకార్పొరేట్ పాలనను పటిష్టంచేయడంతోపాటు పారదర్శకత జవాబుదారీ తనం పెంచినట్లవుతుందని మిస్త్రీ వాదన. లక్షలమంది రిటైల్ ఇన్వెస్టర్లకు మంచి విలువలు అందించినట్లవుతుంది. టాటాట్రస్ట్స్ బలమైన డివిడెండ్ ను



ఇవ్వవచ్చుని అన్నారు. ట్రస్టీల మధ్య గత ఏడాది అక్టోబరులో విభేదాలు పొడసూపాయి. టాటా సన్స్‌లో 66శాతం వాటా టాటా ట్రస్ట్స్‌కు ఉండగా 18.37శాతం వాటా షాపూర్జీ పల్లోంజీ కుటుంబానిది. గతంలో కూడా టాటా సన్స్ లిస్టింగ్‌కు మిస్త్రీ పిలుపునిచ్చారు. టాటాసన్స్‌లోని తన వాటా విలువద్వారా నిధులు సమీకరించి రుణాలు తీర్చుకోవాలని షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ భావిస్తోంది.



## డీజిల్, ఏటిఎఫ్‌లపై సుంకాల పెంపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సరఫరా చేస్తున్న డీజిల్, ఏవియేషన్ ఇంధనం ఎటిఎఫ్‌లపై ఎగుమతి సుంకాలను పెంచుతూ కేంద్రం నిర్ణయించింది. ఆర్థికశాఖ నోటిఫికేషన్ ప్రకారం ఎగుమతి సుంకాలు డీజిల్‌పై రూ.55.5 లీటరుకు పెరిగింది. ప్రస్తుతం లీటరుకు 21.5 మాత్రమే వసూలవుతోంది. ఇక ఏటిఎఫ్‌పై సుంకాలు 29.5 నుంచి లీటరుకు 42 రూపాయలకు పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. పెట్రోలుపై ఎలాంటిసుంకాలను పెంచడంలేదని ప్రకటించింది. ఈ మార్పులు తక్షణమే అమలుకు వస్తా యని చెపుతున్నారు. కేంద్ర ఎక్సైజ్‌చట్టం 1944 పరిధిలో ఈసవరణలు చేసినట్లు ఆర్థికశాఖ చెప్పింది. అలాగే ఆర్థిక చట్టాల్లోని సరైన సెక్షన్లను అనుసరించి సుంకాలను ఎంచామని ఆర్థికశాఖ వెల్లడించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో గ్లోబల్ చమురుమార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్లకు పెరిగింది. దీనితో సరఫరా సమస్యలుపెరిగిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌లతో ఉన్న వివాదం మొత్తం హర్ముజ్ జలసంధినిమూసివేసేంతవరకూ వెళ్లింది. దీనితో చమురురవాణా మొత్తం నిలిచిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా కూడా ధరలు పెరుగుతున్నప్పటికీ దేశంలో ఇంధన కొరత లేకుండా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్, డీజిల్ సమృద్ధిగా సరఫరా అవుతుందని, వ్యయభారం పెరగడంతో సుంకాలు పెంచక తప్పలేదని చెపుతోంది.

## చిన్న బ్యాంకుల్లోనే వడ్డీరేట్లు ఎక్కువ

**ముంబయి, ఏప్రిల్ 11:** స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకులు డిపాజిటర్లను ఎక్కువ రాబట్టేందుకు వడ్డీరేట్లు గణనీయంగా పెంచుతున్నాయి. పెద్దబ్యాంకులకంటే చిన్న బానయంకులే అధికంగా అంటే 8.10శాతంవరకూ వడ్డీరేట్లను ఆఫర్‌చేస్తున్నాయి. మార్కెట్ రిస్క్ లేకుండా స్థిరమైన రాబడులు వచ్చేందుకు ఈడిపాజిట్లు దోహదంచేస్తాయని అందువల్ల డిపాజిట్లవైపే ఎక్కువ మొగ్గుచూపిస్తున్నారు. అయితే ఆర్బీఐ పాలసీ నిర్ణయాలకు అనుగుణంగా వడ్డీరేట్లు తరచూ మారుతుంటాయి. డిపాజిట్ల కాలపరిమితిని అనుసరించి బ్యాంకులు కూడా వడ్డీరేట్లను సవరిస్తాయి. సూర్యోదయ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 30నెలల కాలానికిగాను 8.10శాతం రిటర్నులు ఇస్తోంది. ఇఎస్‌ఎఎఫ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 501 రోజులకుగాను 8శాతం వడ్డీ ఇస్తోంది. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 7.75శాతం 371 రోజులు, మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్లకు వడ్డీ ఇస్తోంది. జనస్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు ఏడాది, మూడేళ్లకు 7.50శాతం, మూడేళ్లు, ఐదేళ్లలోపు డిపాజిట్లకు 7.77శాతం ఇస్తోంది. ఉజ్జీవన్ స్మాల్‌ఫైనాన్స్24 నెలలకు గాను 7.55శాతం, ఎయు స్మాల్‌ఫైనాన్స్ 30 నెలల నుంచి 36 నెలల కాలానికిగాను 7.10శాతం వడ్డీ ఇస్తోంది. వడీరేట్లు అన్నీ కూడా .3 కోట్లలోపు డిపాజిట్లకు వర్తిస్తాయి. సీనియర్ సిటిజన్లకు మరికొంత ఎక్కువ బేసిస్ పాయింట్లు కలుస్తాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.